ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
ప్రకాశం
జిల్లా వార్తలు
ఆదివారం 30, నవంబరు 2025



కృష్ణానది వరద జలాల ఆధారంగా జిల్లాలోని పశ్చిమప్రాంత సాగు, తాగునీటి అవసరాల కోసం నిర్మిస్తున్న వెలిగొండ ప్రాజెక్టుకు గోదావరి నీరు కూడా అందనుంది. దాని ఆయకట్టుతోపాటు ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం వివిధ వనరుల కింద ఉన్న ఆయకట్టు స్థిరీకరణ, లక్షలాది ఎకరాల మెట్ట భూములకు సాగునీటి సౌకర్యం కలగనుంది. భవిష్యత్ తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి లభ్యత గ్యారెంటీ లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రతిపాదించిన పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టు ఇందుకు ఉపయుక్తం కానుంది. అందుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)ను సిద్ధం చేసేందుకు టెండర్‌ను కూడా పిలవడంతో ఉమ్మడి జిల్లా ప్రజల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.


పోలవరం ప్రాజెక్టు

గోదావరి జలాలతో పశ్చిమం ప్రకాశమే


వెలిగొండ ప్రాజెక్టు మొదటి టన్నెల్

వెలిగొండ ప్రాజెక్టుకు నీటి గ్యారెంటీ

- పోలవరం-నల్లమల సాగర్ పథకంతో తరలించి మూడు భాగాలుగా నిర్మాణం
- సమగ్ర ప్రాజెక్టు రిపోర్ట్ కోసం టెండర్లు పిలిచిన ప్రభుత్వం
- వెలిగొండ ఆయకట్టుతోపాటు ఉమ్మడి జిల్లా పరిధిలో లక్షలాది ఎకరాలకు ఉపయుక్తం
- తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు హామీ
- ఆశలు రేకెత్తిస్తున్న సీఎం తాజా నిర్ణయం

ఒంగోలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండకు గోదావరి జలాలు అందనున్నాయి. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును మార్చి పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టును అమలులోకి తీసుకురావాలని సీఎం నిర్ణయించారు. దాదాపు మూడు దశాబ్దాల క్రితం వెలిగొండ ప్రాజెక్టుకు ఆనాటి, ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేయగా నిర్మాణం కొనసాగుతూనే ఉంది. ప్రజాప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టితో వచ్చే ఏడాది ఆగస్టుకు తొలి దశ పూర్తి చేయడమే లక్ష్యంగా పనులు సాగుతున్నాయి. అయితే వెలిగొండ ప్రాజెక్టుకు నికర జలాలు లేవు. కృష్ణానది వరద జలాల ఆధారంగా దీనిని నిర్మిస్తున్నారు. అంటే

మిగతా 6వ పేజీలో

దూసుకొస్తున్న దిత్వా

నేడు, రేపు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు

- ప్రభావం చూపనున్న తుఫాన్
- మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరిక
- ఇప్పటికే పెరిగిన చలి తీవ్రత
- జిల్లాకు ఆరెంజ్ అలర్ట్
- యంత్రాంగం అప్రమత్తం

ఒంగోలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాపై దిత్వా తుఫాన్ ప్రభావం చూపే అవకాశం ఉంది. వాతావరణ శాఖ ఆమేరకు స్పష్టంగా తెలియజేస్తోంది. తుఫాన్ వల్ల ఆది, సోమవారాల్లో ఓ మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆ ప్రభావం శనివారం నుంచే కనిపిస్తోంది. జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. రెండు రోజుల క్రితం శ్రీలంకను ముంచెత్తిన దిత్వా తుఫాన్ ప్రస్తుతం తమిళనాడు తీరాన్ని అతలాకుతలం చేస్తోంది. శనివారం రాత్రికి చెన్నై-పుదుచ్చేరి మధ్య కేంద్రీకృతమై ఉన్న తుఫాన్ ఆదివారం తీరానికి మరింత దగ్గరగా


కొత్తపట్నం తీరంలో ఎగిసిపడుతున్న అలలు

రావచ్చని సమాచారం. అది రాష్ట్రంపై ప్రభావం చూపుతుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. తమిళనాడుకు సమీపంలో ఉన్న తిరుపతి, నెల్లూరు జిల్లాలపై తీవ్రంగా, మన జిల్లాపై ఒక మోస్తరుగా చూపే అవకాశం ఉంది. ఈమేరకు వాతావరణ శాఖ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీచేసింది. అంటే ఆది, సోమవారాల్లో జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచిస్తోంది. ఈ పరిస్థితుల్లో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరికలు కూడా అందాయి. తదనుగుణంగా యంత్రాంగం చర్యలకు సిద్ధమైంది. కాగా జిల్లాలో శనివారం తుఫాన్ ప్రభావం కనిపించింది. పగటిపూట వర్షం కురవకపోయినప్పటికీ చాలా ప్రాంతాల్లో చలి తీవ్రత, గాలి పెరిగింది. దిత్వా తుఫాన్ జిల్లాపై అధిక ప్రభావం చూపితే తీవ్రంగా నష్టపోతామన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. చేతికి వస్తున్న దశలో ఉన్న ఖరీఫ్ పంటలు దెబ్బతినడంతోపాటు రబీ సాగు మరింత జాప్యమవుతుందని ఆందోళన చెందుతున్నారు.

తూర్పున శనగ.. పశ్చిమాన సజ్జ, మొక్కజొన్న


రైతులకు సీఎం సందేశపత్రాన్ని అందజేస్తున్న కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర

- ధరలు కల్పించి కొనుగోలు చేయాలంటున్న రైతులు
- అన్నిచోట్లా వ్యవసాయ యంత్రాలకు డిమాండ్
- ముగిసిన 'రైతన్నా మీకోసం'
- 2.78 లక్షల కుటుంబాలను కలిసిన సిబ్బంది
- చివరిరోజు పలుచోట్ల ముఖ్య ప్రజాప్రతినిధులు హాజరు
- ఆర్ఎస్‌కే స్థాయిలో ప్రణాళికలు

ఒంగోలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన 'రైతన్నా మీకోసం' శనివారంతో ముగిసింది. రైతు సేవా కేంద్రం యూనిట్‌గా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో మొత్తం 516 ఆర్ఎస్‌కేల పరిధిలో 2.78 లక్షల కుటుంబాలను ఆయా శాఖల సిబ్బంది కలిశారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన, మేలైన యాజమాన్య పద్ధతులు, సాంకేతికత వినియోగం తదితర ఐదు అంశాలను వివరించడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని చేపట్టింది. ఈనెల 24 నుంచి 29వతేదీ వరకు వ్యవసాయ, అనుబంధ శాఖల సిబ్బంది క్షేత్రస్థాయిలో ఆర్ఎస్‌కే యూనిట్‌గా రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి ఈ అంశాలను వివరించడంతోపాటు వారి అవసరాలు, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించింది. తదనుగుణంగా జిల్లాలోని 516 రైతు సేవా కేంద్రాలలో ఈనెల 24న వ్యవసాయశాఖ అధికారులు కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) శ్రీనివాసరావు మద్దిపాడు మండలం

మిగతా 6వ పేజీలో



7

కొత్త పంచాయతీల ఏర్పాటు

- విలీనానికి మార్గం సుగమం
- 2020 ఎన్నికల సమయంలో విధించిన నిషేధాన్ని ఎత్తివేసిన ప్రభుత్వం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో గ్రామ పంచాయతీల పునర్‌వ్యవస్థీకరణపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పంచాయతీల విభజన, విలీనంపై ఐదేళ్లుగా అమలులో ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో జిల్లాలో పరిపాలన సౌలభ్యం కోసం కొత్త గ్రామపంచాయతీల ఏర్పాటుకు, ఇప్పటికే ఉన్న వాటిని సమీప పట్టణ, స్థానిక సంస్థల్లో విలీనం చేసేందుకు మార్గం సుగమమైంది. గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేందుకు 2020 మార్చిలో ప్రభుత్వం పంచాయతీల పునర్‌వ్యవస్థీకరణపై పూర్తిస్థాయిలో నిషేధం విధించింది. దీంతో పెద్ద గ్రామపంచాయతీలను విభజించడం, చిన్న పంచాయతీలను సమీపంలోని నగర పంచాయతీలు, మునిసిపాలిటీలలో విలీనం చేయడం వంటి ప్రక్రియ నిలిచిపోయింది. ఈ నిషేధాన్ని ఎత్తివేయాలని కోరుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఇటీవల ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో ప్రతిపాదనలను పరిశీలించి ఆ నిషేధాన్ని తొలగిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్ 97 జీవోను జారీ చేశారు. తదుపరి అవసరమైన చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రం, జిల్లాలో కొత్త పంచాయతీల ఏర్పాటు ప్రక్రియ మళ్లీ ప్రారంభం కానుంది. వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పదవీ కాలం ముగియనుంది. ఇక పంచాయతీ ఎన్నికలు జరగనున్న



మిగతా 6వ పేజీలో

వైకల్యాన్ని మరిచి.. విజయం వైపు సాగి..

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఒంగోలులోని డీఆర్ఆర్ఎం స్కూల్‌లో నిర్వహించిన క్రీడా పోటీల్లో దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వైకల్యాన్ని మరిచి ఆటల్లో అదరగొట్టారు. షాట్ పుట్, డిస్కస్ త్రో, 50, 100 మీటర్‌ల ట్రై సైకిల్ రేస్, త్రీ వీలర్ బైక్ రేస్, పరుగు పందెం, క్రికెట్, స్కిప్పింగ్ పోటీల్లో సత్తా చాటారు.

రైళ్ల ప్రారంభానికి 300 మీటర్లే అడ్డంకి

- కోర్టులో కేసు వేసిన కంకర వ్యాపారి
- అధికారులు రాజీకి ప్రయత్నించినా రాని వైనం

7

పాల కేంద్రాల్లో తనిఖీలు


పాలలో కల్తీ చేసేందుకు కలిపే ఆయిల్ ప్యాకెట్లు, మిక్సీలను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- చలివేంద్రలో కల్తీ పాల శాంపిల్స్ తీసిన ఆహార భద్రతా అధికారులు

దర్శి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంతంలోని పాల కేంద్రాల్లో ఆహార భద్రత అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. గురువారం 'పాల కూట విషం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి వారు స్పందించారు. మండలంలోని చలివేంద్ర గ్రామంలోని డెయిరీ ఫాంలో కల్తీ పాలు తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో జిల్లా ఆహార భద్రతా అధికారి

మిగతా 6వ పేజీలో

అసైన్డ్ భూమాయ!

- పూర్వ తహసీల్దార్ సహా మరో ఇద్దరిపై శాఖాపరమైన విచారణ
- ఫ్రీహోల్డ్ తొలగింపులో మోసం.. నకిలీ పత్రాలతో చేతివాటం
- నకిలీ ఆధార్‌లతో 'ఎనీవేర్' రిజిస్ట్రేషన్
- 10 రోజుల్లో వివరణ ఇవ్వాలని రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదేశాలు

6

వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా శ్రీధర్‌రెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా కె.శ్రీధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండు నెలల క్రితం ఇక్కడ స్పెషల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీధర్‌రెడ్డిని బదిలీ చేశారు. ఆ స్థానంలో ఐఏఎస్ అధికారిని నియమించాలని ప్రభుత్వం భావించింది. మరలా ఇప్పుడు వెలిగొండ ప్రాజెక్టు పీఏ టూ స్పెషల్ కలెక్టర్‌గా శ్రీధర్‌రెడ్డినే నియమించింది. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

బోగస్ బాగోతం బయటపడుతోంది..!

- మెప్మాలో కొనసాగుతున్న విచారణ

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) కార్యాలయంలో చోటుచేసుకున్న అవినీతి వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. నగరంలోని కేశవస్వామిపేటకు చెందిన యానాది సామాజికవర్గానికి చెందిన పలు పొదుపు సంఘాల బాధ్యతను చూసే ఆర్పీ దివ్యశాంతిపై బాధితులు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఇప్పటికే ఎస్టీ సామాజికవర్గం మహిళలకు జరిగిన అన్యాయంపై మెప్మా ఎండీ కార్యాలయం నుంచి ఐదుగురు సభ్యుల కమిటీ ఒంగోలు వచ్చి విచారణ చేపట్టింది. మరోవైపు కలెక్టర్ ఆదేశాలతో జేసీ గోపాలకృష్ణ ఛైర్మన్‌గా విచారణ కొనసాగుతోంది. పీడీ శ్రీహరి ఆధ్వర్యంలో మరో విచారణ కమిటీని నియమించారు. ఈ మేరకు పీడీ విచారణ కమిటీ శనివారం స్థానిక దేవుడు చెరువులో విచారణ చేసింది. మూడు గ్రూపులకు ఒక ఆర్పీని నియమించగా ఐబీ స్పెషలిస్ట్ ఫణికుమారి, సీఎంఎం సంతోష్, సీవో మరియమ్మ విచారణ చేశారు. వారి ఎదుట బాధిత మహిళలు గోడు వెళ్లబోసుకున్నారు. తమకు తెలియకుండా తమ పేరుతో రూ.లక్షల నిధులు బ్యాంకుల నుంచి రుణాల రూపంలో డ్రా చేసుకున్నట్లు వెల్లడించారు. గత కొన్ని నెలలుగా ఈ వ్యవహారం నడుస్తున్నా తమకు తెలియదన్నారు. సమావేశాలు నిర్వహించి, ఆధార్ కార్డులు తీసుకున్నారని.. వాటితో బోగస్ పొదుపు గ్రూపులు సృష్టించారని


పొదుపు మహిళల నుంచి వివరాలు తెలుసుకుంటున్న విచారణ కమిటీ సభ్యులు

మిగతా 6వ పేజీలో



డ్వాక్రా మహిళలకు నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ రాజాబాబు, సత్య, బాలాజీ

మహిళల ఆర్థికాభ్యున్నతే ధ్యేయం

మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

- మూలగుంటపాడులో మెగా రుణమేళా, యూనిట్ల పంపిణీ
- పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు, ఛైర్మన్‌లు సత్య, బాలాజీ
- లబ్ధిదారులకు రూ.80.35 కోట్ల నమూనా చెక్కు అందజేత

7



ప్రజాదర్బార్‌లో వినతులు తీసుకుంటున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరులో ఎమ్మెల్యే ప్రజాదర్బార్

● వినతుల పరిష్కారానికి అశోక్‌రెడ్డి ఆదేశం

గిద్దలూరు టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తూ మరోవైపు వారి సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులతో మాట్లాడి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చర్యలు చేపట్టారు. శనివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో తెలియచేయగా వాటిని పరిష్కరించిన ఎమ్మెల్యే ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలు తెలిపిన సమస్యలను పరిష్కారం చేసేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు తమకు ఎటువంటి సమస్యలున్నా టీడీపీ కార్యాలయంలో నిర్వహించే ప్రజాదర్బార్‌లో తనకు తెలియచేయవచ్చని ఈసందర్భంగా ఎమ్మెల్యే వారితో అన్నారు.



రైస్ మిల్లును పరిశీలిస్తున్న కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

రైస్ మిల్లును పరిశీలించిన ఆర్డీవో

పొదిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం సీఎంఆర్ కింద రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి మిల్లర్ల వద్ద రైస్‌ను తయారు చేసేందుకు అనుమతి ఇచ్చిన రైస్ మిల్లును కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి రెవెన్యూ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని బియ్యంగా తయారు చేసి ప్రభుత్వానికి సరఫరా చేసేందుకు ప్రభుత్వం జిల్లాలోని మద్దిపాడు, ఎస్ఎన్‌పాడు, కొత్తపట్నం, దర్శి, శింగరాయకొండ, పొదిలి, నగులుప్పలపాడులో గల 10 రైస్ మిల్లులను ఎంపిక చేసినట్లు చెప్పారు. వాటిలో రోజుకు, నెలకు ఎంతమేర రైస్ తయారు చేసేందకు అవకాశముందో మిల్లర్లను ఆర్డీవో అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ షాజీదా, గోడౌన్ డీటీ డేవిడ్, వీఆర్వో సుబ్బారావు ఉన్నారు.

చౌకదుకాణాల్లో తనిఖీ

ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెంలో ఎఫ్‌సీ బియ్యం గోడౌన్‌ను జిల్లా విజిలెన్స్ అధికారి ఎ.వరకుమార్ శనివారం తనిఖీ చేశారు. బియ్యం స్టాకు నిల్వలను, స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం స్థానికంగా ఉన్న 5, 8, 22, 23 చౌక దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈపోస్ మిషన్లు సక్రమంగా ఉపయోగించాలని, వేళలు పాటించాలని, కార్డుదారులకు అసౌకర్యం కల్గించరాదని డీలర్లకు సూచనలు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ చంద్రశేఖర్, గోడౌన్ డీటీ భ్రమరాంబ, ఆర్ఐ, వీఆర్వో పాల్గొన్నారు.

తూర్పున శనగ.. పశ్చిమాన సజ్జ, మొక్కజొన్న

(5వ పేజీ తరువాయి)

రాచవారిపాలెంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా అన్ని ఆర్‌ఎస్‌కేల్లోనూ స్థానిక అధికారులు, సిబ్బంది సగటున రోజుకు 90 కుటుంబాలను కలిసేలా ప్రణాళికాబద్ధంగా నిర్వహించారు. పలువురు కీలక ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలా చివరిరోజైన శనివారం పీసీపల్లి మండలం నేరేడుపల్లిలో జరిగిన కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొనగా రైతులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అలాగే మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తర్లుపాడు మండలం చెన్నారెడ్డిపల్లిలో, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కొమరోలు మండలం రాజుపాలెంలో పాల్గొనగా దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ముండ్లమూరు మండలం శింగన్నపాలెంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా అధికారులు కూడా వివిధ ఆర్‌ఎస్‌కేలలో పాల్గొనగా డీఏవో శ్రీనివాసరావు ఎస్ఎన్‌పాడు మండలం మంగమూరులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరలే ప్రధానం

జిల్లాలోని మొత్తం 516 ఆర్‌ఎస్‌కేల పరిధిలోని 2.78లక్షల రైతు కుటుంబాలను ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, అనుబంధ శాఖల సిబ్బంది కలిసినట్లు డీఏవో శ్రీనివాసరావు తెలిపారు. ఇదిలా ఉండగా రైతుల వద్దకు సిబ్బంది వెళ్లిన సమయంలో ప్రభుత్వ పథకాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరించడంతోపాటు ప్రస్తుతం రైతులు ఏమి కోరుకుంటున్నారనే దానిపై కూడా తెలుసుకున్నారు. ఆ సందర్భంగా అనేక గ్రామాల్లో రైతులు తాము పండించిన శనగ, సజ్జ, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధరలు లభించని వైనాన్ని వారి దృష్టికి తెచ్చినట్లు సమాచారం. ప్రధానంగా తూర్పు ప్రాంతంలోని రైతులు శనగల పరిస్థితిని వివరిస్తూ ధరలు సరిలేక కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేస్తే మళ్లీ సాగు సీజన్ వచ్చినా వాటిని కొనేవారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. మొక్కజొన్న ధరలు కొనుగోలు అంశాలను అధికారుల దృష్టికి తెచ్చారు. అదేసమయంలో అన్నిప్రాంతాల్లో డ్రోన్లు, ట్రాక్టర్లు ఇతర వ్యవసాయ యంత్ర పరికరాలను అందించాలని కోరినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ కార్యక్రమం ముగియగా తమ దృష్టికి వచ్చిన, గుర్తించిన అంశాలను విశ్లేషించి ఆర్‌ఎస్‌కే స్థాయిలో ప్రస్తుత రబీ, అలాగే వచ్చే ఏడాది ఖరీఫ్ రబీ సీజన్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించనున్నట్లు డీఏవో శ్రీనివాసరావు తెలిపారు. వచ్చేనెల 3న ఆర్‌ఎస్‌కేలలో రైతులతో సమావేశాలు ఏర్పాటుచేసి చర్చిస్తామన్నారు. అలాగే రైతులు తమ దృష్టికి తెచ్చిన పట ఉత్పత్తుల ధరలు, యంత్ర పరికరాలు ఇతర అంశాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.



రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయి బాలాజీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సయ్యద్ మస్తాన్ వలి శనివారం తెలిపారు. ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీలలో పాఠశాలకు చెందిన కృపావరం, మునేంద్ర, జాయ్ సుశాంత్ జిల్లా జట్టుకు ఎంపికై డిసెంబరు 9న జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా అండర్-17 స్థాయిలో ఆడతారని తెలిపారు. శిక్షణ ఇచ్చిన పీఈటీ మస్తాన్ వలిని ఉపాధ్యాయులు అభినందించారు.

అసైన్డ్ భూమాయ!

పూర్వ తహసీల్దార్ సహా మరో ఇద్దరిపై శాఖాపరమైన విచారణ

ఫ్రీహోల్డ్ తొలగింపులో మోసం

తర్వాత నకిలీ పత్రాలతో చేతివాటం

నకిలీ ఆధార్‌లతో ఎనీవేర్ రిజిస్ట్రేషన్

10 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశాలు

త్రిపురాంతకం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దోర్నాల మండలంలో గతంలో జరిగిన అసైన్మెంట్ భూ మాయపై చర్యలకు రంగం సిద్ధమైంది. భూ అక్రమాలపై వచ్చిన ఫిర్యాదు ఆధారంగా విచారణ జరిపిన అధికారులు నిర్ధారణ జరిగిన అంశాలపై సంబంధిత అధికారుల నుంచి వివరణ కోరుతూ రెవెన్యూ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. దోర్నాల తహసీల్దార్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఎ.వేణుగోపాలరావు మండలంలోని ఐనముక్కల గ్రామంలో 778, 779, 780, 781, 782, 783, 784, 785 సర్వే నెంబర్లలో ఉన్న భూమి వాస్తవ పరిస్థితిని పరిశీలించకుండా ఫ్రీహోల్డ్ చేయాలని ప్రతిపాదించారు. ఈ మేరకు 2024 ఫిబ్రవరి 12న వాటిని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించారు. తరువాత ముగ్గురు వ్యక్తులు యాత వీరప్రసాద్, నరసింహారావు, సత్య దీప్తి పేర్లతో నకిలీ ఆధార్ కార్డులు తయారు చేసి ఆయా భూములను వారి పేర్లతో మార్కాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. తరువాత ఈ ముగ్గురు వ్యక్తులు ఎస్‌పీపీ ఫార్మల్యాండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ విజయవాడ పేరుతో ఎనీవేర్ రిజిస్ట్రేషన్ ఆప్షన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేశారు.

రెవెన్యూ మంత్రికి ఫిర్యాదు

వాస్తవానికి గ్రామంలో భూమిలేని 16 మంది పేదలకు 778/1, 778/2, 779/1, 779/2, 780/1, 780/2, 781/1, 781/2, 782/1, 782/2, 783/1, 783/2, 784/1, 784/2, 785/1, 785/2లలో మొత్తం దాదాపు 73.59 ఎకరాలు 1985లో అసైన్ చేశారు. కానీ వాస్తవ పరిస్థితికి భిన్నంగా సదరు తహసీల్దారు కేవలం 2003లోపు ఇచ్చిన అసైన్మెంట్ అన్న కారణం చూపుతూ ఫ్రీహోల్డ్ సిఫారసు చేసినట్టు అధికారులు గుర్తించారు. ఈ మొత్తం వ్యవహారంపై రెవెన్యూ శాఖ మంత్రి వద్దకు ఫిర్యాదు వెళ్లటంతో మార్కాపురం సబ్‌కలెక్టర్ నేతృత్వంలో మార్కాపురం తహసీల్దార్, డీఐ, దోర్నాల సర్వేయర్‌లతో విచారణ కమిటీ వేసి నివేదిక తెప్పించుకున్నారు. అందులో పొందుపరిచిన వివరాల ప్రకారం తహసీల్దార్ వేణుగోపాలరావుతోపాటు అప్పటి రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఇప్పుడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న వి.నాగేశ్వరరావు, అప్పటి ఐనముక్కల వీఆర్వో ప్రస్తుతం దోర్నాల-2 వీఆర్వోగా ఉన్న పి.రవికుమార్‌లను బాధ్యులుగా పేర్కొంటూ ఫ్రీహోల్డ్ సిఫారసు ఫైలును కూడా రెవెన్యూ శాఖకు పంపారు.

పది రోజుల్లో వివరణ ఇవ్వండి

ఈ మేరకు రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ బాధ్యులపై చర్యలకు ఆదేశిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు వారు 10 రోజుల్లోగా వివరణ ఇస్తూ వారిపై వచ్చిన అభియోగాలను అంగీకరిస్తున్నారా? లేదా అని లిఖిత పూర్వకంగా సమాధానం ఇవ్వాలని పేర్కొన్నారు. గడువులోపు వివరణ ఇవ్వకపోతే వచ్చిన అభియోగాలపై ఉన్న ఆధారాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తహసీల్దార్ వేణుగోపాలరావు రిటైర్డ్ అయినప్పటికీ సర్వీస్ నిబంధనలు ఉల్లంఘించిన కారణంగా అధికారికంగా ఆయనపై శాఖాపరమైన విచారణ మొదలు పెట్టాలని ప్రతిపాదిస్తామని ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చంద్రన్నకు జీవితాంతం పశ్చిమం రుణపడి ఉంటుంది

ఎమ్మెల్యే కందుల



కృతజ్ఞతా సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాలుగా వెనుకబాటుతనంతో కొట్టు మిట్టాడుతున్న మార్కాపురం ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకే మార్కాపరం జిల్లాను ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక 20వ వార్డులో శనివారం రాత్రి మార్కాపురం జిల్లా ప్రకటన నేపథ్యంలో ముఖ్యమంత్రికి కృతజ్ఞతా తెలుపుతూ సభ నిర్వహించారు. ముందుగా వార్డులోని ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు పశ్చిమ ప్రకాశ ప్రజలు జీవితాంతం రుణపడి ఉంటారని అన్నారు. గత వైసీపీ పాలకులు ఓట్లు దండుకుని పశ్చిమ ప్రజలను మోసం చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు మార్కాపురం జిల్లాను చేశారన్నారు. ఆయనకు కృతజ్ఞతగా చంద్రన్న మార్కాపురం జిల్లాగా నామకరణం చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారన్నారు. జిల్లాతోపాటు త్వరలోనే వెలిగొండ ప్రాజెక్టు కూడా పూర్తవుతుందన్నారు. ఈ ప్రాంతానికి ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, మార్కెట్ యార్డు చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్ ఇబ్రహీంఖాన్, మేడిద రంగస్వామి, కౌన్సిలర్ నాలి కొండయ్య యాదవ్, టీడీపీ నాయకులు షేక్ మౌళాలి, కొప్పుల శ్రీనివాసులు, కనిగిరి రమణ, సయ్యద్ గఫార్, శర్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

● ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ జావెద్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ జావెద్

మార్కాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓట్ల దొంగ మోదీని గద్దెదించి భవిష్యత్‌లో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తలు శక్తి వంచనలేకుండా కృషి చేయాలని ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ జావెద్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి, ప్రకాశం జిల్లా సంస్థాగత ఎన్నికల పరిశీలకులు నదీమ్ జావెద్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై పోరాటం చేయాలన్నారు. అన్ని జిల్లాల్లో సంఘటన సృజన అభియాన్ ద్వారా జిల్లా అధ్యక్షుల నియామకం చేపట్టిందన్నారు. కింది స్థాయి నుంచి కార్యకర్తల అభిప్రాయాలను సేకరించి బలమైన వ్యక్తులను జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తామన్నారు. కార్యక్రమంలో పీసీసీ జాన్‌బాబు, రాణిమేకల సతీష్, రాష్ట్ర పార్టీ క్రమశిక్షణా సంఘం సభ్యులు సయ్యద్ జావీద్ అన్వర్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ మహబూబ్ అలి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు షేక్ రెహానా, కొట్టు వరప్రసాద్, కె.రమేష్, ఎన్.ఇమ్మానియేల్, ముల్లా జిలాని, షేక్ ఇమ్రాన్, పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, నాయకులు బొడ్డు సతీష్, వేణు, మధు, ఇమ్రాన్, అల్తాఫ్, ఖాదర్, సుల్తానా పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికులకు తీవ్ర నష్టం

● ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకటసుబ్బయ్య



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకటసుబ్బయ్య

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులను కట్టుబానిసలుగా మారుస్తాయని, దీనివల్ల వారు తీవ్రంగా నష్టపోతారని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకట సుబ్బయ్య ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో శనివారం జరిగిన ఏఐటీయూసీ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసిన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాధాకృష్ణమూర్తితో కలిసి వెంకట సుబ్బయ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని మండిపడ్డారు. కార్పొరేట్‌శక్తులు, పారిశ్రామికవేత్తల కోసమే లేబర్ కోడ్‌లను అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విధానాలను ఉపసంహరించుకోకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్మికులు ఏడాదికి రూ.400 కోట్ల సంపద సృష్టిస్తున్నారని, అయితే వీరికి ఎటువంటి ప్రయోజనాలు సమకూరడం లేదన్నారు. పర్మినెంట్ ఉద్యోగాల స్థానంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని తీసుకువస్తున్నారని ఆరోపించారు. రానున్న కాలంలో జరిగే ఉద్యమాల్లో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, కాటంశెట్టి హనుమంతరావు, భవన నిర్మాణ రంగం కార్యదర్శి దాసరి మల్లికార్జున, హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాన్‌నాయుడు, పుల్లమ్మ, దాసరి సునీత, కె.అంజయ్య పాల్గొన్నారు.



ఒడ్డుకు చేరిన పడవలు

'దిత్వా'తో ఎగిసిపడుతున్న అలలు

● తీరంలో బలమైన గాలులు

● తుఫాన్ ప్రభావంతో ఒడ్డుకు చేరిన పడవలు

ఒంగోలు నగరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో తీరంలో సముద్రపు అలలు ఎగిసిపడుతున్నాయి. సముద్రం పలు ప్రాంతాల్లో సాధారణం కంటే ఐదారు మీటర్లు ముందుకు తోసుకువచ్చింది. శుక్ర, శనివారాల్లో సముద్రం అల్లకల్లోలంగా మారటంతో మత్స్యకారులు వేటకు వెళ్ళలేదు. దీనికి తోడు అధికారులు హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు తమ పడవలను ఒడ్డుకు చేర్చుకున్నారు. జిల్లావ్యాప్తంగా మత్స్యకారులు వేటకు విరామం ప్రకటించారు. కాగా శనివారం ఉదయం నుంచి తీరంలో సముద్రపు అలలు ఎగిసిపడుతుండటంతో పాటు గాలుల తీవ్రత కూడా అధికమయ్యింది. చెదుమదురు వానలు పడుతున్నాయి. మొంథా తుఫాన్‌తో ఇబ్బందులు పడ్డ తీర ప్రాంత ప్రజలు దిత్వా ప్రభావంతో ఆందోళన చెందుతున్నారు. వరుస తుఫాన్‌లతో తమ జీవనం దెబ్బతింటోందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ కొళాయిలను క్రమబద్ధీకరించాలి

● కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అక్రమ కొళాయిలను క్రమబద్ధీకరించి పన్ను పరిధిలోకి తీసుకురావాలని, అలాగే నూరు శాతం నీటి పన్నులు వసూలు చేయాలని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశించారు. శనివారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులు, ఎమినిటీ సెక్రటరీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా తాగునీటి పన్నులు అధిక మొత్తంలో పెండింగ్ ఉన్నాయన్నారు. అమృత్ పథకం కింద మంజూరైన నీటి కొళాయి కనెక్షన్‌లకు సంబంధించి చెల్లించాల్సిన డొనేషన్, ఇతర చార్జీలు మొత్తం వసూలు చేయాలని చెప్పారు. లేని పక్షంలో గృహ యజమానులకు నోటీసులు జారీ చేయాలని, డిసెంబరు 31 నాటికి పూర్తి స్థాయిలో క్రమబద్ధీకరించి, పన్ను వసూలు చేయాలని ఆయన ఆదేశించారు. అలాగే దిత్వా తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో అన్నీ విభాగాల సిబ్బంది, నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అలాగే ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి, పునరావాస కేంద్రాలకు తరలించే విధంగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



చోరీ జరిగిన వైన్‌షాపులో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

కంభంలో వరుస దొంగతనాలు

● రెచ్చిపోతున్న దొంగలు

● తాజాగా ఓ వైన్‌షాప్‌లో రూ. 1.50లక్షల నగదు, మద్యం బాటిళ్లు చోరీ

కంభం నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కంభం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీ విజయదుర్గ వైన్ షాప్‌లో దొంగలు పడి వైన్ షాప్ క్యాష్ కౌంటర్‌లో దాచిన రూ.1.50లక్షల నగదు, కొన్ని మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లిన ఘటన శనివారం తెల్లవారు జామున జరిగింది. వివరాలలోకి వెళితే.. కంభం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న విజయదుర్గ వైన్ షాప్‌లో శుక్రవారం అమ్మిన మద్యం బాటిళ్ల సొమ్ము రూ.1.50లక్షల నగదును కౌంటర్‌లో పెట్టి యజమానులు ఇళ్లకు వెళ్లారు. శనివారం ఉదయం 10గంటల సమయంలో వైన్ షాపు యజమానులు షట్టర్ తెరిచి షాపులోకి వెళ్లగా క్యాష్ కౌంటర్ తెరిచి ఉండడంతో పాటు నగదు లేకపోవడంతో దొంగతనం జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ మల్లికార్జున ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. వైన్ షాప్ వెనుక నుంచి లోపలికి వచ్చి దొంగలు లోపల అమర్చిన సీసీ కెమెరాలు, మానిటర్, హార్డ్ డిస్క్ మొత్తం పీకేసి సమీపంలోని ఇరిగేషన్ మురుగు కాలువలో పడేశారు. అనంతరం తాపీగా క్యాష్, మద్యం బాటిళ్లను దొంగిలించుకుపోయారు. సీఐ మల్లికార్జున షాప్‌లో దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం సాయంత్రం ఒంగోలు నుంచి క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పశ్చిమం ప్రకాశమే

(5వ పేజీ తరువాయి)

కృష్ణా నదిలో ఎగువ ప్రాంతంలో భారీవర్షాలు కురిసి వరదలు వస్తే ఆ సమయంలో వరద నీటిని వెలిగొండకు మళ్లించే విధంగా ప్రాజెక్టును రూపకల్పన చేశారు. మొత్తం 4.46 లక్షల ఎకరాల ఆయకట్టులో 3.36 లక్షల ఎకరాల ఆయకట్టు నీరు వాడుకునే వారిలో 90 శాతం మంది పశ్చిమ ప్రాంతంలోనే ఉన్నారు.

సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి

పోలవరం-నల్లమల సాగర్ (వెలిగొండ రిజర్వాయర్) ప్రాజెక్టును అమలు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచన. దానికి అనుగుణంగా డీపీఆర్ కోసం సంబంధిత అధికారులు టెండర్లు పిలిచారు. దీంతో వెలిగొండ ప్రాంత ప్రజల్లోనే కాక మొత్తం ఉమ్మడి జిల్లా రైతులు, ప్రజానీకంలో ఆశలు రేకెత్తుతున్నాయి. తాజా ప్రతిపాదన ప్రకారం పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్టును మూడు భాగాలుగా నిర్మించనున్నారు. తొలుత పోలవరం నుంచి రోజుకు 2 టీఎంసీలు గోదావరి నీటిని కాలువ ద్వారా కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజీ ఎగువన ఉన్న త్రివేణి సంగమం దగ్గరకు తరలిస్తారు. రెండో భాగంలో అక్కడి నుంచి పల్నాడు జిల్లాలోని బొల్లాపల్లి ప్రాంతంలో ప్రతిపాదిత రిజర్వాయర్‌కు, మూడో భాగంలో రిజర్వాయర్ నుంచి నల్లమల సాగర్‌కు తరలిస్తారు. అలా ఏటా 200 టీఎంసీలు గోదావరి వరద నీటిని తరలించేలా దాదాపు రూ.58,700 కోట్లతో మూడు దశల్లో పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించింది. డీపీఆర్ కోసం రూ.9.10 కోట్లతో సంబంధిత అధికారులు టెండర్లను పిలిచారు. వాటి ఖరారు, డీపీఆర్ సిద్ధం చేయడం, కేంద్రం నుంచి సాంకేతిక అనుమతులు తీసుకురావడం వంటి పనులు వచ్చే ఏప్రిల్‌కు పూర్తి చేయాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ఈ ప్రతిపాదనతో వెలిగొండ ప్రాజెక్టుకు కృష్ణానది నీరేకాక గోదావరి నీరు కూడా అందనుంది.

ప్రయోజనమిలా..

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం సుమారు 4.42 లక్షల ఎకరాల సాగర్ ఆయకట్టు ఉంది. దీంతోపాటు 72 వేల ఎకరాలు కృష్ణా, పశ్చిమడెల్టా (కొమ్మమూరు) కాలువ ఆయకట్టు. రాళ్లపాడు, మోపాడు, కంభం చెరువు వంటి ఐదు మధ్యతరహా ప్రాజెక్టులు, చిన్న నీటి చెరువుల కింద కలిపి మరో లక్షా 75 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందక రైతులు అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని దాదాపు 2,400 ఆవాసాలలోని 40 లక్షల మంది ప్రజానీకంలో సగం మందికి తాగునీటి సౌకర్యం లేదు. వెలిగొండ ప్రాజెక్టు ఆధారంగా ఇటీవల రూ.1,290 కోట్లతో పశ్చిమప్రాంత ప్రజలకు జేజేఎం కింద భారీ రక్షిత తాగునీటి పథక నిర్మాణం చేపట్టగా రామతీర్థం, గుండ్లకమ్మ రిజర్వాయర్ల ఆధారంగా ఇతర ప్రాంతాల వారికి జేజేఎం కింద ప్రాజెక్టులు రూపకల్పన చేశారు. దొనకొండ పారిశ్రామిక కారిడార్, కనిగిరితో పాటు పశ్చిమాన సీబీజీ ప్లాంట్లు, ఎంఎస్ఎంఈ పార్కులు కదులుతుండగా వాటికి కూడా అదనంగా నీరు అవసరం. ఇలాంటి సమయంలో ప్రభుత్వం తాజాగా ప్రతిపాదించిన పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టు ద్వారా 200 టీఎంసీల గోదావరి నీటిని తరలించే ఆలోచన ఉమ్మడి జిల్లా మొత్తానికి ఉపయుక్తం కానుంది.

పాలకేంద్రాల్లో తనిఖీలు

(5వ పేజీ తరువాయి)

శివకృష్ణ సిబ్బందితో వెళ్లి తనిఖీ చేశారు. పాల సాంపిళ్లను సేకరించారు. ఈ సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ దర్శి ప్రాంతంలో పలుచోట్ల కల్తీ పాలను విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందని తెలిపారు. అందులో భాగంగా చలివేంద్రలో తనిఖీలు నిర్వహించామన్నారు. ఇక్కడి పాలకేంద్రంలో పాల కల్తీ కోసం వాడిన ఆయిల్ ప్యాకెట్లు, పాలు మిక్సింగ్ చేసేందుకు వాడే జార్లు పట్టుబడ్డాయన్నారు. పాల సాంపిళ్లను సేకరించి వాటిని ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు చెప్పారు. నివేదిక రాగానే బాధ్యులపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. సీజ్ చేసిన మెటీరియల్‌ను జాయింట్ కలెక్టర్ ముందు ఉంచుతామని, తాము తయారు చేసిన నివేదికను సమర్పిస్తామన్నారు. కల్తీ పాల నివారణకు ముమ్మర తనిఖీలు చేపట్టి కల్తీరాయుళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని శివకృష్ణ హెచ్చరించారు. ఎక్కడైనా పాలు కల్తీ జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే తమకు ఫిర్యాదు చేయాలని కోరారు.

కొత్త పంచాయతీల ఏర్పాటు

(5వ పేజీ తరువాయి)

నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాలో ఎన్నో ఏళ్ల నుంచి పంచాయతీల విభజన చేయాలని ప్రతిపాదనలు ఉన్నాయి. అవన్నీ ఇప్పుడు ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఈ ప్రక్రియను ఎన్నికలు జరిగే లోపు పూర్తిచేయాల్సి ఉండటంతో తదనుగుణంగా జిల్లా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టనున్నారు. పంచాయతీల విభజన, విలీనంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయడంతో జిల్లాలో ఇప్పుడు కొత్త పంచాయతీల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఆయా నియోజకవర్గాల నుంచి వచ్చే ప్రతిపాదనలను అనుగుణంగా చర్యలు తీసుకోనున్నారు.

బోగస్ బాగోతం బయటపడుతోంది!

(5వ పేజీ తరువాయి)

ఫిర్యాదు చేశారు. బ్యాంకర్లు వచ్చే వరకు తమకు తెలియదన్నారు. తమకు న్యాయం చేయాలని వారు విచారణ కమిటీ ఎదుట వాపోయారు. మొదట్లో వాస్తవాలు చెప్పేందుకు కొందరు పొదుపు సభ్యులు వెనుకంజ వేయగా, ఆ తర్వాత ఒక్కొక్కరుగా తాము నష్టపోయిన వైనాన్ని వివరించారు. ఇప్పటికైనా ఆర్పీగా ఆమెను తొలగించాలని, అలాగే తమ పేరుతో తీసుకున్న రుణాలను తిరిగి వసూలు చేసి తమను రుణ విముక్తులను చేయాలని కోరారు. ఈ సందర్భంగా విచారణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆదివారం కూడా విచారణ కొనసాగుతుందన్నారు. అనంతరం నివేదికను పీడీకి అందజేస్తామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు



రుణమేళాలో మాట్లాడుతున్న మంత్రి స్వామి

మహిళల ఆర్థిక అభ్యున్నతే ధ్యేయం

- మంత్రి డాక్టర్ స్వామి
- మూలగుంటపాడులో మెగా రుణమేళా, యూనిట్ల పంపిణీ
- పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు, చైర్మన్లు సత్య, నూకసాని

సింగరాయకొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆర్థికాభ్యున్నతే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని కాకతీయ కన్వెన్షన్ హాల్‌లో శనివారం స్వయం సహాయక సంఘాల సభ్యుల మెగా రుణమేళా, యూనిట్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి కుటుంబంలో ఒక వ్యాపారవేత్త ఉండాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఈదిశగా మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటునందిస్తోందని తెలిపారు. పాలేరు. ముసిలపై చెక్ డ్యాంలను నిర్మించి నియోజకవర్గంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో పొదుపు సంఘాల వద్ద రూ.10వేల కోట్ల పొదుపు నగదు ఉందన్నారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆత్మగౌరవంతో ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన తర్వాత ప్రకాశం జిల్లాలో కొండపి వెనుకబడిన నియోజకవర్గమవుతుందని తెలిపారు. దీన్ని అభివృద్ధిపథంలో నడిపించేందుకు అధికంగా నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల అభివృద్ధికి కృషి చేసిన పార్టీ టీడీపీనేనని తెలిపారు. అనంతరం మంత్రి స్వామి, కలెక్టర్ రాజాబాబు, కార్పొరేషన్ చైర్మన్లు సత్య, బాలాజీలు సింగరాయకొండ, టంగుటూరు, పొన్నలూరు మండలాలకు చెందిన డ్వాక్రా మహిళలకు రూ.80.35కోట్ల చెక్కును అందజేశారు. రూ.25 కోట్ల యూనిట్ల మంజూరు లేఖలను లబ్ధిదారులకు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు, గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ వేల్పుల సింగయ్య, ఏఎంసీ చైర్మన్ కర్నా తిరుపతమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు మించల బ్రహ్మయ్య, చంద్రశేఖర్, నేతలు, అధికారులు పాల్గొన్నారు.

ఎంతోకాలంగా దర్శి-కనిగిరి ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న రైల్వే ప్రయాణం చిన్న సమస్యతో వెనక్కిపోతోంది. కేవలం 300 మీటర్ల అడ్డంకే రైళ్ల ప్రారంభానికి పెను అడ్డంకిగా మారింది. ఒక కంకర వ్యాపారి కోర్టులో కేసు వేయటంతో ఏళ్ల తరబడి ఆ కొద్ది దూరంలో రైల్వేలైన్ నిర్మాణం నిలిచిపోయింది. దీంతో మిగిలిన పనులన్నీ దాదాపు పూర్తయినప్పటికీ మిగిలిన ఆ ప్రదేశంలో రైల్వే నిర్మాణం జరగకపోవటంతో అధికారులు రైళ్ల రాకపోకలను ప్రారంభించలేకపోతున్నారు. అధికారులు రాజీకి ప్రయత్నించినా ఆ వ్యాపారి మొండిపట్టు పట్టడంతో సమస్య అలాగే కొనసాగుతోంది. ప్రభుత్వం చొరవ తీసుకుంటే తప్ప ఆ సమస్య పరిష్కారం అయ్యే పరిస్థితి కనిపించటం లేదు.

- కోర్టులో కేసు వేసిన కంకర వ్యాపారి
- అధికారులు రాజీకి ప్రయత్నించినా రాని వైనం
- నడికుడి నుంచి కనిగిరి వరకు నిర్మాణం పూర్తి
- ప్రభుత్వం చొరవ తీసుకుంటేనే సమస్య పరిష్కారమయ్యే అవకాశం

రైళ్ల ప్రారంభానికి ఆ 300 మీటర్లే అడ్డంకి

దర్శి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే నిర్మాణం గత ఎన్‌డీఏ పాలనలో ప్రారంభించారు. తొలి దశలో నడికుడి నుంచి కనిగిరి వరకు 150 కిలోమీటర్ల రైల్వే లైన్ నిర్మాణం చేపట్టారు. ఏడాది క్రితమే 99శాతం రైల్వే లైన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అన్నిచోట్ల రైల్వే స్టేషన్ల నిర్మాణం దాదాపు పూర్తయింది. దర్శిలో రైల్వేస్టేషన్‌తో పాటు టికెట్ బుకింగ్ కౌంటర్లు, వెయిటింగ్ హాలు, వంతెన తదితర పనులన్నీ పూర్తయ్యాయి. గత ఏడాదే రైళ్లు, గూడ్సులు ట్రయల్‌రన్ నిర్వహించారు. 2025 జనవరిలోనే రైళ్లు నడుపుతామని ఎంపీ మాగుంట హామీ ఇచ్చారు. ఆసమయంలో పొదిలి వద్ద ఒక రైతు, కనిగిరి సమీపంలో కంకర వ్యాపారి తమకు నష్టపరిహారం అధికంగా కావాలని కోర్టులో కేసు వేయటంతో ఆ రెండు చోట్ల పనులు పూర్తికాలేదు. పొదిలి మండలంలో రైతుతో అధికారులు చర్చించి కేసు విత్‌డ్రా చేయించారు. ఆవెంటనే అక్కడ రైల్వేలైన్ నిర్మాణం పూర్తిచేశారు. ప్రస్తుతం కనిగిరి సమీపంలోని శంఖవరం వద్ద ఆ 300 మీటర్లు మాత్రమే పనులు నిలవటంతో రైళ్లు నడిపేందుకు అడ్డంకిగా మారింది. కనీసం 2026 జనవరిలోనైనా రైళ్లు నడుపుతారనే ఆశతో ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఆ వ్యాపారి రాజీకి రాకపోతే కనిగిరి సమీపంలోని గార్లపేట వరకు రైల్వే లైన్ నిర్మాణం పూర్తయినందున నడికుడి నుంచి గార్లపేట వరకైనా రైళ్లు నడపాలని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయంపై రైల్వే అధికారులను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా ఉన్నతాధికారులతో చర్చిస్తున్నామని తెలిపారు. త్వరలో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.



దర్శిలో నిర్మించిన నూతన రైల్వేస్టేషన్ భవనం



కనిగిరి సమీపంలో శంఖవరం వద్ద నిలిచిపోయిన రైల్వేలైన్ నిర్మాణ ప్రాంతం



పూర్తయిన రైల్వేలైన్, ప్లాట్‌ఫారం

పెళ్లి సందడి దొంగల దోపిడీ

- భారీగా దోచుకెళుతున్న సొత్తు
- పెళ్లివారు అప్రమత్తంగా ఉండాలి
- మధ్యప్రదేశ్ గ్యాంగ్‌గా అనుమానం

ఒంగోలు క్రైం,నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మొన్న కల్యాణ మండపంలో భారీగా సొత్తు చోరీ, నిన్న పెళ్లికుమారుడు ఇంటిలో దొంగతనం.. ఇలా పెళ్లిళ్ల సీజన్ వస్తే చాలు దొంగలు భయ భ్రాంతులకు గురిచేస్తున్నారు. వరుడు కోసం తెచ్చిన బంగారం, వధువు కోసం కల్యాణమండపంలోకి తెచ్చిన వస్తువులు ఏదైనా సరే దొంగలు ఏంచక్కా చుట్టాలులా వచ్చి విలువైన సొత్తు ఉన్న బ్యాగ్‌లను పట్టుకెళుతున్నారు. ఇలా కల్యాణమండపాలలో జరగడం ఒక రకమైన చోరీ అయితే వధువు, వరుడు ఇంటికి తాళం వేసి కల్యాణ మండపాలకు వెళ్లడంతో వారి ఇళ్లలో దొంగలుసొత్తు దోచుకెళ్లడం సులువుగా మా రింది. ఇటీవల అనేక చోరీలు జరగడం అందుకు తార్కాణంగా చెప్పవచ్చు.పెళ్లి సందడిలో దొంగల గోల పరిపాటిగా మారింది. విలువైన సొత్తును ఆసమయాలలో జాగ్రత్త చేసుకోవడంపై సంబంధిత యజమానులు బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది. కల్యాణమండపాలలో ఏవరి బంధువులు ఎవరో తెలియని పరిస్థితి.దీంతో దొంగల ముఠా చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. లక్షల రూపాయల సొత్తును దాచుకునే ఇళ్లకు కూడా కనీసం సీసీ కెమెరాలను ఏర్పాటుచేసుకోవాల్సిన అవసరం ఉంది.

మధ్యప్రదేశ్ ముఠాగా భావిస్తున్న పోలీసులు

బృందావన్ గార్డెన్స్‌లో ఇటీవల చోరీకి పాల్పడిన ముఠా మధ్యప్రదేశ్ గ్యాంగ్‌గా పోలీసులు అనుమానిస్తున్నారు. పెళ్లి జరుగుతున్న సమయంలో ఇరువురు అనుమానితులు మండపంలో తిరుగుతున్నట్లు సీసీ ఫుటేజీలో గుర్తించారు. అదే సమయంలో వారు ఇరువురూ హిందీలో మాట్లాడినట్లు తెలుస్తోంది. సీసీ ఫుటేజీ సేకరణలో పోలీసులు నిమగ్నమయ్యారు.



కల్యాణ మండపాలలో హైఫ్రీక్వెన్సీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి : డీఎస్పీ

కల్యాణ మండపాలలో హైఫ్రీక్వెన్సీ ఉన్న కెమెరాలను యజమానులు ఏర్పాటు చేసుకోవాలని ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. అదే విధంగా విలువైన సొత్తును జాగ్రత్తగా ఉంచుకోవాల్సిన బాధ్యత పెండ్లి వారికి ఉంటుందని అన్నారు. అంతే కాకుండా కల్యాణమండపాలలో వివాహం చేసుకునే వారు ఇంటివద్ద విలువైనసొత్తు దాచిపెడితే వాటికి కాపాలాగా బంధువులను ఉంచుకోవాలని చెప్పారు. ఇంటికి తాళం వేసి అందరూ పెళ్లి కి వెళ్లటం సరైయింది కాదన్నారు.

పెళ్లి ఇంట జరిగిన దొంగతనాలు

- ఈనెల 27న ఖైనంపాడుకు చెందిన పెండ్లి కుమార్తె వివాహం స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లో జరిగింది. అక్కడ ఇరువురు అనుమానితులు నేరుగా కల్యాణమండపంలో స్టేజీ మీదకు వచ్చి వధూవరులను ఆశీర్వదిస్తూ అక్షితలు వేసే సమయంలో సుమారు రూ. 20 లక్షల విలువగల సొత్తు ఉన్న బ్యాగ్‌ను అపహరించుకెళ్లారు.
- ఈనెల 27న చీమకుర్తి మండలానికి చెందిన ప్రజాప్రతినిధి కుమారుడి వివాహం చీమకుర్తిలోని ఓ కల్యాణమండపంలో జరిగింది. చీమకుర్తి పక్కనే ఉన్న గ్రామం పెండ్లి కుమారునిది. దీంతో ఇంట్లో సుమారు రూ. 5 లక్షలు నగదు, పది సవర్ల బంగారు ఆభరణాలు బీరువాలో పెట్టి ఇంట్లో వారు అంతా పెళ్లికి వచ్చారు. సుమారుగా రూ. 15లక్షల విలువైన సొత్తును అపహరించు కెళ్లారు.
- 2022 లో పేర్నమిట్టకు చెందిన జనసేన నాయకుడు ఇంట్లో వివాహం జరిగింది. పెళ్లి ఒంగోలులోని కల్యాణ మండపంలో చేశారు. ఆసమయంలో దొంగలు ఇంటితాళాలు పగులకొట్టి భారీగా సొత్తు అపహరించుకెళ్ళారు. ఇప్పటికీ ఆచూకీ దొరకలేదు.
- రెండేళ్ల క్రితం దక్షిణ బైపాస్ రోడ్డులో ఉన్న ఓ కల్యాణ మండపంలో భారీగా సొత్తుఉన్న బ్యాగ్‌ను అపహరించుకెళ్లారు.

కారు టైరు పగిలి కొండను ఢీకొట్టి బోల్తా

- శ్రీశైలం ఘాట్ రోడ్డులో ప్రమాదం
- ముగ్గురికి స్వల్ప గాయాలు

పెద్ద దోర్నాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉన్నపళంగా ప్రయాణిస్తున్న కారు టైరు పగిలి వేగం అదుపు కాక కొండను ఢీకొట్టి రోడ్డుపై బోల్తా పడింది. ఈ ఘటన శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డుపై చింతల సమీపంలో శనివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న విజయవాడకు చెందిన ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయవాడకు చెందిన కొందరు శ్రీశైలం దర్శనానంతరం తిరిగి స్వగ్రామానికి కారులో వెళ్తున్న క్రమంలో చింతల సమీపంలో కారు టైరు పేలి వేగం అదుపు తప్పి పక్కనే ఉన్న కొండను ఢీకొని రోడ్డుపై పల్టీ కొట్టింది. ఇదే సమయంలో మార్కాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు దోర్నాల నుంచి శ్రీశైలం వెళ్తూ అక్కడకు చేరుకుంది. కారు బోల్తా పడడం చూసిన డ్రైవర్ అప్రమత్తమై వెంటనే బస్సు నిలిపివేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. బస్సులోని వారికి ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు. కారులో ప్రయాణించిన ముగ్గురు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. కారు రోడ్డుపై అడ్డంగా పడడంతో రాకపోకలు నిలిచి పోయాయి.కొందరు 108కి సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్ వాహనంలో క్షతగాత్రులను దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసు స్టేషనుకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న కారును పక్కకు తొలగించడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.



ప్రమాదంలో బస్సు ముందు పడిన కారు

చీమకుర్తి జడ్పీటీసీ వేమా గృహంలో చోరీ

- బంగారం,నగదు మాయం

చీమకుర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కూనంనేనివారిపాలెం గ్రామంలో చీమకుర్తి జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు గృహంలో చోరీ జరిగింది. శనివారం ఈ సంఘటనపై శ్రీనివాసరావు చీమకుర్తి పోలిస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అందులో పేర్కొన్న మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.శ్రీనివాసరావు కుమారుని పెళ్లి చీమకుర్తిలో ఈనెల 27వ తేదీ రాత్రి ఓ కల్యాణ మండపంలో జరిగింది. దీని నిమిత్తం కుటుంబసభ్యులందరూ కూనంనేనివారిపాలెంలో ఉన్న తమ ఇంటికి తాళం వేసి చీమకుర్తి మండపానికి వెళ్లారు.పెళ్లి అయిన తర్వాత తిరుమల దర్శనానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేసరికి తన ఇంట్లో దొంగతనం జరిగిందని గుర్తించారు.పరిశీలించగా ఆరుసవర్ల బంగారు పూలహారం,ఏడు గ్రాముల ఉంగరం, రూ.4.73లక్షల నగదు బీరువానుంచి తస్కరించినట్లు గుర్తించారు.ఈ వివరాలు తెలియచేపోలిస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు.ఈ సంఘటనపై సీఐ దాసరి ప్రసాద్ స్పందిస్తూ క్లూస్ టీం పరిశోధిస్తుందని,కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.



జడ్పీటీసీ గృహంలో దొంగలు పగులకొట్టిన బీరువా

రంగనాయక ఆలయంలో ప్రత్యేక పూజలు

రాచర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోగల నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి మల్లవరపు నాగయ్య భక్తుల దర్శనానికి అవసరమైన ఏర్పాట్లు చేయించారు. ఆలయ సిబ్బంది భక్తులకు సంపూర్ణ సహకారం అందించారు. ఆలయంలోని శ్రీ కృష్ణదేవరాయ కాపు బలిజ, శ్రీ గోపాల కృష్ణ యాదవ సత్రాల్లో భక్తులకు ఉచిత అన్నదానం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.



రంగనాయకుడిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	126, 135, 146
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

వైకల్యాన్ని మరిచి.. ఉత్సాహంగా..!

- పండుగ వాతావరణంలో దివ్యాంగుల క్రీడాపోటీలు

వారంతా విభిన్న ప్రతిభావంతులు.. శరీరంలో ఏదో ఒక లోపం ఉన్నప్పటికీ ఏనాడు బాధపడలేదు. అన్నీ రంగాల్లోనూ తామేమీ తక్కువ కాదు అనేదిశగా ముందుకెళుతున్న వారు ఆటల్లోనూ అదరగొట్టారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలలో జిల్లా వ్యాప్తంగా వారు పాల్గొన్నారు. షాట్ పుట్, డిస్కస్ త్రో, 50, 100 మీటర్ ట్రై సైకిల్ రేస్, త్రీ వీలర్ బైక్ రేస్, అంధుల క్రికెట్ పోటీలు, స్కిప్పింగ్ పలు క్రీడలను నిర్వహించారు. కాగా అయితే గెలుపు, ఓటములను పక్కన పెడితే.. పోటీలో పాల్గొన్నవారికి ఐకమత్యంగా చేయూతనందిస్తూ ప్రోత్సహించారు. స్నేహితుల కరతాళ ధ్వనుల మధ్య, సందడి వాతావరణంలో కొనసాగిన క్రీడా పోటీలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. ప్రత్యేకంగా జిల్లా వ్యాప్తంగా విచ్చేసిన దివ్యాంగులు ఒకచోట చేరి నవ్వులు పువ్వులు పూయించారు. వారి యోగక్షేమాలు తెలుసుకోవడంతోపాటు, ఆటల్లోనూ తమను ఎవరూ ఢీ కొట్టలేరని నిరూపించారు.

- ఒంగోలు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)



పరుగు పందెంలో ఉత్సాహంగా పాల్గొన్న దివ్యాంగులు



చెస్‌లో తలపడుతున్న విభిన్న ప్రతిభావంతులు



బాల్ విసురుతున్న దివ్యాంగ యువకుడు



కాలితో క్యారమ్ ఆడుతున్న యువతి

పేద విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

● మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి



గురుకుల పాఠశాలలో వంటగదిని పరిశీలిస్తున్న మంత్రి స్వామి

సింగరాయకొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమంపై ప్రజాప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. శనివారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, వంట గదిని పరిశీలించారు. అనంతరం విద్యార్థినిలతో మాట్లాడారు. గురుకుల పాఠశాలల్లో గత ప్రభుత్వం కంటే అన్ని విధాలా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. పేద విద్యార్థులు కష్టపడి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే సీఎం లక్ష్యమని తెలిపారు. తొలుత మరమ్మతులు చేస్తున్న కందుకూరు రోడ్డులోని ఎస్సీ సంక్షేమ వసతి గృహాన్ని, ఇటీవల పూర్తిచేసిన చేపల మార్కెట్ ఆధునికీకరణ పనులను మంత్రి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు ఇచ్చారు.

డాక్టర్ కృష్ణచైతన్యకు అవార్డు ప్రదానం



ఎమ్మెల్యే హరీష్‌రావు చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న డాక్టర్ కృష్ణచైతన్య

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉభయ రాష్ట్రాలకు సంబంధించిన ఆరో ఎడిషన్ టైమ్ ఎక్సలెన్స్ అవార్డు-25ను ఒంగోలుకు చెందిన చైతన్య కార్డియాక్ హాస్పటల్ డాక్టర్ బీఎంవీ.కృష్ణచైతన్య అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన సభలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు చేతుల మీదుగా అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ కారిడియాలజిస్ట్ అవార్డును అందజేశారు. ముఖ్యఅతిథులుగా సుప్రీంకోర్టు రిటైర్డ్ జస్టిస్ ఎన్వీ.రమణ, డైరెక్టర్ అనుపమకేర్ తదితరులు పాల్గొన్నారు. కాగా కృష్ణచైతన్యను పలువురు డాక్టర్లు ప్రత్యేకంగా అభినందించారు.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆది, సోమవారాల్లో ఒంగోలులో జరిగే పలు పలు కార్యక్రమాకు హాజరుకానున్నారు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి వర్ధంతి వేడుకల పనులను మాగుంట రాఘవరెడ్డితో కలిసి పరిశీలిస్తారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. సోమవారం ఉదయం 9గంటలకు మాగుంట కార్యాలయంలో, అనంతరం సుబ్బరామిరెడ్డి వర్ధంతి కార్యక్రమాల్లో ఎంపీ మాగుంట పాల్గొంటారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : హోమ్ అప్లయన్సెస్ అండ్ బేసిక్ ఎలక్ట్రానిక్స్ టెక్నీషిన్‌లుగా ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ప్రేరణ ఎన్జీవో సంస్థ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఒంగోలులోనే మూడు నెలల పాటు ఉచిత వసతి, భోజనం, శిక్షణ అందిస్తామన్నారు. ఏసీ, కూలర్, వాషింగ్ మెషిన్, టీవీ, ఫ్రిడ్జ్, ఇతర గృహోపకరణాల మరమ్మతులలో శిక్షణ ఇస్తామని, ఆసక్తి గల ఉమ్మడి ప్రకాశం జిల్లా యువతీ, యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొంది. 18-35 సంవత్సరాల వయస్సు, కనీస విద్యార్హత 10వ తరగతి వారు అర్హులని, డిసెంబరు 2వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 9908824390 ద్వారా సంప్రదించాలని ఆ సంస్థ కోరింది.

వృద్ధురాలి నేత్రాలు దానం

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒంగోలుకు చెందిన కోడూరి పెద్దమ్మ (98) మరణించడంతో ఆమె కుటుంబసభ్యులు శనివారం ఆమె నేత్రాలను ఎల్‌వీ.ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. ఈ సందర్భంగా మృతురాలి కుమార్తె పిన్నక లక్ష్మీసీతాంబ మాట్లాడుతూ బాపట్ల జిల్లా నరసాయాలెంకు చెందిన తన తల్లి పెద్దమ్మ కోరిక మేరకు నేత్రాలు దానం చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు ఎస్‌వీ.రంగారెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సుబ్బరామరెడ్డి వర్ధంతి ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు పార్లమెంట్ మాజీ సభ్యుడు స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి వర్ధంతి ఏర్పాట్లను శనివారం సాయంత్రం మాగుంట ప్రతినిధులు పరిశీలించారు. సోమవారం స్థానిక పీవీఆర్ గ్రౌండ్‌లో సుబ్బరామరెడ్డి వర్ధంతి నేపథ్యంలో అక్కడ భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా భారీగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందుకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి నిర్వాహకులకు పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్.లక్ష్మీనారాయణరెడ్డి, బెజవాడ సురేష్‌రెడ్డి, అయినాబత్తిన ఘనశ్యాం, తాతా ప్రసాద్, బెల్లం సత్యనారాయణ, ఆత్మకూరి బ్రహ్మయ్య, కుప్పా రంగసాయి, పాలపర్తి శీనారెడ్డి, కృష్ణారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న నాయకులు

మద్దిపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని అభివృద్ధి చేసి అధికారంలోకి తీసుకునిరావడమే లక్ష్యమని మాజీ ఎంపీ జేడీ.శీలం అన్నారు. శనివారం మద్దిపాడులో సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ రాష్ట్ర పీసీసీ ప్రెసిడెంట్ షారాద్ ఆహర్, పీసీసీ కార్యదర్శి గంటా అంజిబాబు, ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ ఇన్‌చార్జి పసుమర్తి సుధాకర్ పాల్గొని మట్లాడారు. ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్తంగా ఉందని, ప్రజలకు మంచి జరగాలంటే ఇందిరమ్మరాజ్యం రావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొణిజేటి గురుబాబు, నట్టే సుబ్బారావు, పులిపాటి రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



స్టార్‌ను ఏర్పాటు చేసిన క్రిస్టియన్లు

ఒంగోలు(రూరల్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు రోడ్డులోని బృందావన్ గార్డెన్స్ కాలనీ రహదారిలో గల బేతస్త చర్చి దగ్గర శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ చైతన్య ప్రభు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

కొత్తపట్నం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదివి రాబోయే పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ అనిల్‌కుమార్ కోరారు. శనివారం మోటుమాల కస్తూర్బా బాలికల పాఠశాల, కొత్తపట్నంలో జడ్పీ హైస్కూలును ఆయన సందర్శించారు. కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో సంపూర్ణ ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కొత్తపట్నంలో స్టడీ అవర్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జీసీడీవో హేమలత, ఎంఈవో పద్మావతి, కోఆర్డినేటర్ జాలరత్నం, ఏఎంవో నాగేంద్రనాయక్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు అండగా ప్రభుత్వం

● ఎమ్మెల్యే దామచర్ల
● దివ్యాంగుల క్రీడా పోటీల ప్రారంభం



దివ్యాంగుల క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకుని శనివారం ఒంగోలులోని డీఆర్ఆర్ఎం స్కూలు నిర్వహించిన దివ్యాంగుల క్రీడా పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ దివ్యాంగులు వైకల్యాన్ని అధిగమించి జీవితంలో ముందుకు సాగేందుకు క్రీడలు ఉత్తమ మార్గమన్నారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. వైకల్యాన్ని అధిగమించి ముందుకు సాగాలన్నారు. అలాగే వివిధ రుణాల మంజూరు, అలాగే పెన్షన్లు అందిస్తూ ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనందిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పోటీలలో జిల్లావ్యాప్తంగా సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభను చాటారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, దివ్యాంగుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్.సువార్త, డీఈవో కిరణ్‌కుమార్, డీఎస్‌డీవో రాజేశ్వరి, పలువురు వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడల్లో విద్యార్థులు సత్తా చాటారు.

అల్పాహారం అందజేత

అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకుని ఒంగోలులోని డీఆర్ఆర్ఎం హైస్కూలులో జరిగిన క్రీడా పోటీల సందర్భంగా సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్పాహారం అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ, నిర్వాహకులు సర్దార్‌బాషా, షమనాజ్, మనవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మారెళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

రూ.50లక్షలతో మార్కెట్ కమిటీ భవన నిర్మాణాలు

● మద్దిపాడు ఏఎంసీ చైర్‌పర్సన్ రాజేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజేశ్వరి

సంతనూతలపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు మార్కెట్‌కమిటీ యార్దులో రూ.50లక్షలతో నూతన భవనాలు, యార్డు మరమ్మతులు చేపడుతున్నట్లు కమిటీ చైర్‌పర్సన్ మన్నం రాజేశ్వరి తెలిపారు. శనివారం సంతనూతలపాడులోని మద్దిపాడు ఏఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాలకవర్గసభ్యుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉప్పుగుండూరు యార్డు అభివృద్ధి కోసం తీర్మానించిన ప్రతిపాదనలను రాష్ట్ర మార్కెట్ కమిటీ కమిషనర్‌కు పంపనున్నట్లు చెప్పారు. అదేవిధంగా మార్కెట్ యార్డులో పశువుల సంత పునరుద్ధరణకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి మార్కెట్ కమిటీకి రూ.4.52కోట్లు లక్ష్యం కాగా నవంబరు నెల వరకు రూ.1.64కోట్లు సెస్సురూపంలో వచ్చినట్లు చెప్పారు. అదేవిధంగా మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడులోని మార్కెట్ కమిటీ స్థలాన్ని కోల్డ్‌స్టోరేజ్‌కు లీజ్‌కు ఇవ్వడానికి తీర్మానించినట్లు తెలిపారు. సభ్యుల ఫిర్యాదు మేరకు కమిటీ సమావేశానికి గైర్హాజరయ్యే సిబ్బందిపై చర్యలకు సిఫార్సు చేయనున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఏఎంసీ ఆదాయం పెంపునకు కృషిచేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్యదర్శి దానమ్మ, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ షేక్ ఖాజావలి, మన్నం ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పాడి పరిశ్రమతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

● ఎమ్మెల్యే దామచర్ల



రైతులకు దాణాను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు(రూరల్), నవంబరు29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పాడి పరిశ్రమతో ఆర్థికాభివృద్ధి సాధించాలని, ఇందుకోసం ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శనివారం ఒంగోలు నగరం కొప్పోలు గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం, పశువుల దాణా పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే దామచర్ల మెగా పశువైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అర్హులైన మహిళలకు పాడిపశువులను రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో కొనుగోలు చేసి ఇస్తుందని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులు బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేసిందని, ఇది వారికి కొంత ఉపశమనం కలిస్తుందని పేర్కొన్నారు. అనంతరం జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పశువులకు గర్భకోశవ్యాధులు రాకుండా వైద్యపరీక్షలు చేయించాలన్నారు. ఉచితంగా మందులు కూడా అందజేస్తామని చెప్పారు. మేలు జాతి దూడలతో పశుసంపదను వృద్ధి చేసుకోవాలని కోరారు. అనంతరం పశువులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. అలాగే 100 మంది రైతులకు పశువుల దాణాను 50శాతం సబ్సిడీతో ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు ఎన్.జగత్‌శ్రీనివాసులు, బి.మురళికృష్ణ, ఎన్.జయచంద్ర, కాట్రగడ్డ అనిల్, భరత్, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, టీడీపీ నాయకులు కొటారి నాగేశ్వరరావు, బండారు మదన్, కాట్రగడ్డ రఘు, నడిపినేని భాస్కర్, వడ్లమూడి మునీంద్ర, కాట్రగడ్డ వెంకట్రామయ్య, నీటి సంఘం అధ్యక్షుడు బత్తినేని కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త కనిపిస్తే పంచాయతీ అధికారిదే బాధ్యత

● డీపీవో వెంకటేశ్వరరావు



ఇలపావులూరులో మాట్లాడుతున్న డీపీవో వెంకటేశ్వరరావు

చీమకుర్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో రోడ్లపై చెత్త కనిపిస్తే పంచాయతీ డెవలెప్‌మెంట్ అధికారిదే బాధ్యతని డీపీవో ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇలపావులూరు గ్రామంలో శనివారం నిర్వహించిన స్వామిత్వ గ్రామసభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన డీపీవో మాట్లాడుతూ సర్వేపై వచ్చిన అభ్యంతరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. తన పర్యటనల్లో ఇలపావులూరు, శివరాంపురం, వెల్లంపల్లి గ్రామాల్లో ప్రధాన రహదారుల్లో చెత్త పేరుకుపోవటం, వీధిదీపాలు పగలు సైతం వెలగటం లాంటి లోపాలను గుర్తించినట్లు చెప్పారు. వాటిని వెంటనే సరిదిద్దుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవేంద్రరావు, శ్రీధర్‌రావు, సర్పంచ్ పులి రమణమ్మ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మద్దిపాడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీవో వెంకటేశ్వరరావు ఆదేశించారు. శనివారం వెల్లంపల్లిలో ఆయన పర్యటించి ఆయన అపరిశుభ్రంగా ఉన్న పేడదిబ్బలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శి మాధవిని ఆదేశించారు. సర్పంచ్, కార్యదర్శులు సమన్వయం చేసుకుని గ్రామ అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. నూరు శాతం పన్నులు వసూలు చేయాలని, ప్రతి శుక్రవారం పరిశుభ్రతకు కేటాయించాలని, దోమలు అభివృద్ధి చెంది అంటురోగాలు ప్రబలకుండా జాగ్రత్త పడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రఘుబాబు, సర్పంచ్ చిట్టిబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

● ఆర్టీఏ అధికారి భాస్కర్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియంత్రణ, వేగ పరిమితులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఆర్టీఏ అధికారులు జి.భాస్కర్, కె.జయప్రకాష్ సూచించారు. శనివారం ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రాఫిక్ నియంత్రణ- భద్రతపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. మద్యం సేవించి వాహనాన్ని నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల జరిగే అనార్థాలు, రాంగ్‌వే డ్రైవింగ్, అధిక వేగం, ఓవర్ టేకింగ్, లైసెన్స్ తీసుకునే విధానాలు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారు వివరించారు. విద్యార్థులు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నప్పును తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే.మూర్తి, ఏవో ఎం.రమణబాబు, ట్రాన్స్‌పోర్టు కళాశాల ఇన్‌చార్జిలు ఏకాంబరం, రవీంద్ర, ఎర్రం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

నాగులుప్పలపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులను కాలరాసేలా తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ఉప్పుగుండూరు సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జి.బసవపున్నయ్య మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకొన్న 8 గంటల పని విధానాన్ని హరించే విధంగా 12 గంటలు పనిచేయాలని యాజమాన్యాలకు అనుకూలంగా లేబర్ కోడ్‌లను కేంద్రప్రభుత్వం తీసుకురావడం దుర్మార్గమైన చర్యన్నారు. అనంతరం జీవోలను దహనం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నలతోటి రామారావు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ప్రతి పౌరునికీ సమాన హక్కులు

ఒంగోలు(రూరల్), నవంబరు29(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ గౌరవప్రదంగా జీవించాలని, భారత ప్రభుత్వం ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిందని రూరల్ తహసీల్దార్ నాయబ్‌రసూల్ పేర్కొన్నారు. ఒంగోలు మండలం యరజర్ల ఎస్సీకాలనీలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులు అందరికీ సమానమని, ప్రతి పౌరుడు స్వేచ్ఛగా, గౌరవప్రదంగా జీవించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖరరావు, దేవదాయశాఖ ఈవో శ్రీనివాసరావు, ఎంపీటీసీ గుండపనేని శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి: బండ్లమూడి ఎస్సీకాలనీలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రజలందరూ చట్టం ముందు సమానులే అని చెప్పారు. సమావేశంలో సీఐ దాసరి ప్రసాద్, ఎంపీడీవో రాఘవేంద్ర, ఏవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



ఆటల పోటీలకు హాజరైన ఉపాధ్యాయులు

ఒంగోలు విద్య, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల మండల స్థాయి ఆటల పోటీలు శనివారం ఒంగోలులో ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను డీఈవో కిరణ్‌కుమార్, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డి.అనీల్‌కుమార్, ఎంఈవో టి.కిషోర్‌బాబులు ప్రారంభించారు. శనివారం ఉదయం పురుషుల విభాగంలో క్రికెట్ రెండు టీంలు, సాయంత్రం రెండు టీంలు పోటీలో పాల్గొన్నారు. మహిళా విభాగంలో త్రోబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఒంగోలు మండలంలోని 200 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడూ కరెంటు బిల్లులు చెల్లించవచ్చు : ఎస్‌ఈ

ఒంగోలు క్రైం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల కోసం ఆదివారం సెలవు అయినా కరెంటు బిల్లులు చెల్లించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు జిల్లాలోని అన్ని కౌంటర్లు తెరిచి ఉంటాయని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తుఫాన్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు క్రైం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ కారణంగా తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ మేరకు ఓ ప్రకటనలో తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. కొత్తపట్నం, మడనూరు, ఈతముక్కల, పాకల, ఊళ్ళపాలెం, కనపర్తి బీచ్‌లకు ప్రజలు వెళ్లవద్దన్నారు. సముద్రంలో అలలు తీవ్రత ఉందని, మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని పేర్కొన్నారు. అత్యవసరమైతే తప్ప తీర ప్రాంత ప్రజలు బయటకు రావద్దని, ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని కోరారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే వెంటనే 112 లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

నేడు మండవవారిపాలెంలో సచివాలయం ప్రారంభం

ఒంగోలు(రూరల్), నవంబరు29(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం మండవవారిపాలెంలో ఆదివారం ఉదయం నూతనంగా నిర్మించిన రైతు సేవాకేంద్రం, సచివాలయ భవనం ప్రారంభించనున్నట్లు సర్పంచ్ మండవ వెంకటసుబ్బయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు.

శ్రీవారికి స్వర్ణపద్మపీఠం సమర్పణ



స్వర్ణ పద్మపీఠం సమర్పిస్తున్న దాతలు

ఒంగోలు కల్చరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీగిరిలోని శ్రీవేంకటేశ్వర స్వామికి భక్తులు స్వర్ణ పద్మపీఠాన్ని సమర్పించారు. ఒంగోలుకు చెందిన భాస్కరుని వెంకట అనిల్‌కుమార్, మొవ్వ శ్రీనివాస్, సింగరాయకొండకు చెందిన బత్తుల సుభాష్ చంద్ర, తిప్పారెడ్డి సంజీవరెడ్డి, తిరుమలరెడ్డిలు ఈ స్వర్ణ పద్మ పీఠాన్ని శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారికి అందజేశారు. అనంతరం వారికి వేదపండితులు వేద ఆశీర్వదించారు. స్వర్ణ పద్మపీఠం సమర్పించిన దాతలకు ఆలయ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి, ధర్మకర్తలు సుశీలాదేవి, సీవీ.రామకృష్ణారావు, వెంకటేశ్వరరావు, లక్ష్మీకుమారి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కళామిత్రమండలి వార్షికోత్సవం

ఒంగోలు కల్చరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కళామిత్ర మండలి తెలుగు లోగిలి వార్షికోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు శనివారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించే ఈ వేడుకలలో సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణకు నూనె వెంకాయమ్మ, వెంకటరత్నం జీవనసాఫల్య పురస్కారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా మండలి వెంకటకృష్ణారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా స్మారక ఉపన్యాసం జేడీ లక్ష్మీనారాయణ చేస్తారన్నారు. అవనిగడ్డ శాసనసభ్యులు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ తదితర రాజకీయ ప్రముఖులు, సాహిత్య ప్రముఖులు పాల్గొంటారన్నారు. సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రేపటి నుంచి భాగవత సప్తాహం

ఒంగోలు కల్చరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పద్యసారస్వత పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి శ్రీమద్భాగవత సప్తాహ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాగంటి శ్రీరామమూర్తి, పింగళి పూర్ణచంద్రరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు నగరం వీఐపీ రోడ్‌లోని పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ప్రతి రోజు సాయంత్రం 7 గంటల నుంచి ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. పద్యసారస్వత పరిషత్ కార్యవర్గ సభ్యులు ప్రవచనకర్తలుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కనుక సాహిత్య, ఆధ్యాత్మికవేత్తలు, అభిమానులు పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు : డీఎస్పీ



కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు క్రైం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం ఒంగోలు టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడినా, చట్టాన్ని అతిక్రమించి దౌర్జాన్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సత్ప్రవర్తన ఒక్కటే మార్గమన్నారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి గొడవలు, అల్లర్లు చేసే వారి ఆస్తులు జప్తి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ సాంబశివయ్య, ఫిరోజ్, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతించిన మేరకే పొగాకు సాగు చేయాలి



పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న ఆర్ఎం రామారావు

కొండపి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రైతులు బోర్డు అనుమతించిన విస్తీర్ణం మేరకే పొగాకు సాగు చేయాలని ఒంగోలు ఆర్ఎం శీలం రామారావు సూచించారు. పంట నాణ్యతకు అనుగుణంగా ధరలు ఇప్పించేందుకు బోర్డు కృషి చేస్తుందని చెప్పారు. శనివారం ఆయన స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోళ్లను పరిశీలించారు. వ్యాపారులు, రైతులతో మాట్లాడారు. సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. రైతుల సమస్యల పరిష్కారానికి పారదర్శకంగా, జవాబుదారీతనంతో పనిచేయాలని ఈ సందర్భంగా సిబ్బందికి సూచించారు. రైతులు అధిక రేట్లకు పొలాలు, బ్యారన్లు కౌలుకు తీసుకుని నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్, చతుకుపాడు, గుర్రప్పడియ, నరసరాజుపాలెం, కె.అగ్రహారం గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రూ.కోటి అవినీతి ఎలా సాధ్యం : వైసీపీ

సంతనూతలపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని సిండికేట్ రైతు సొసైటీ భవన నిర్మాణానికి అయిన ఖర్చు రూ.98లక్షలు కాగా అందులో కోటిరూపాయలు అవినీతి ఎలా సాధ్యమని సొసైటీ మాజీ అధ్యక్షులు దుంపా యలమందారెడ్డి, మాదాల వెంకట్రావు, వైసీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ఆరోపించారు. శనివారం సంతనూతలపాడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత వైసీపీ పాలనపై అసత్య ప్రచారం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ డైరెక్టర్లు మోహన్‌రావు, కోటేశ్వరరావు, హరిబాబు పాల్గొన్నారు.

రైతుల వివరాలను నమోదు చేయాలి

సంతనూతలపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న రైతు కుటుంబాల సర్వేలో రైతుల వివరాలను ఏపీఎయిమ్స్ యాప్‌లో నమోదు చేయాలని డీఏవో ఎస్.శ్రీనివాసరావు ఆదేశించారు. మంగమూరులో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు బి.రమేష్‌బాబు, ఏవో పావని, టీడీపీ మండల అధ్యక్షుడు హరిబాబు, నీటిసంఘం అధ్యక్షుడు నల్లూరి క్రిష్ణారావు, నాయకులు అబ్బూరి శ్రీనివాసరావు, నల్లూరి నారాయణరావు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

నాగులుప్పలపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చీరాల నాగరత్నం వైద్యశాల డాక్టర్ అంజలి సూచించారు. ఉప్పుగుండూరులోని ఆర్‌వీీ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెప్పారు. డైరెక్టర్లు కిషోర్, నరేష్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రైతన్నా మీకోసంలో ఎమ్మెల్యే కందుల

తర్లుపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే కూటమి ప్ర భుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లెలో శనివారం రైతన్నా మీకోసం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అధికారులు రైతుల వద్దకు వెళ్లి లాభసాటి వ్యవసాయ సాగుకు ఏమి అవసరమో అడిగి తెలుసుకుని వాటి అవసరాలను గుర్తించి వ్యవసాయాభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ఈ రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, నీటి భద్రతా ఆరాధిత పంటలు, అగ్రిటెక్ సాగు, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభు త్వం నుంచి మద్దతు గురించి వివరించారు. రైతును రాజు చేయాలనే ధృడ సంకల్పంతో సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. రైతులకు ఇచ్చిన ప్రతి హా మీ సీఎం చంద్రబాబు నెరవేరుస్తున్నారన్నారు. మార్కాపురాన్ని ప్రత్యేక జిల్లా చేశారన్నారు. వారికి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పాలని పేర్కొన్నారు. గత వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి వెలిగొండ ప్రాజెక్టును గాలికొదిలేశారన్నారు. ప్రస్తుతం వెలిగొండ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు. వెనుకబడిన పశ్చిమ ప్రాంతమైన మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించటంలో జగన్‌రెడ్డి వివక్ష చూపారన్నారు. అప్పట్లో మేము 66 రోజులు రిలే నిరాహార దీక్షలు చేయటం జరిగిందన్నారు. ఆ సమయంలో పోలీసుల చేత మమ్మల్ని దీక్షలు చేయకుండా లాఠీలను ఉపయోగించి మాపై అక్రమ కేసులు బనాయించారన్నారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. రైఉతలు పండించిన పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారన్నాఉ. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలతో సూపర్ హిట్ కొట్టిందన్నారు. 20లక్షల ఉద్యోగాలు కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతోందన్నారు. అనంతరం టీడీపీ నాయకులు మార్కాపురాన్ని సీఎం చంద్రబాబు జిల్లాగా ప్రకటించినందుకు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి జోత్స్నదేవి, ఇన్‌చార్జి ఎంపీడీవో బుర్రి చంద్రశేఖర్‌రావు, ఆర్‌ఐ చరణ్, పలు శాఖల అధికారులు, మార్కాపురం మార్కెట్ యార్డు ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, టీడీపీ నాయకులు కం చర్ల కాశయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రావి బాసపతిరెడ్డి, మాజీ ఎంపీపీ పి.యేసుదాసు, ఆరికట్ల వెంకటేశ్వరెడ్డి, వెంకటరెడ్డి, పి.గోపినాథ్ చౌదరి, మేకల వెంకట్, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.


రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల

రైతులకు అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

బేస్తవారపేట : రైతులకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని అక్కపల్లె గ్రామంలో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన గ్రామంలో ఇంటింటికీ వెళ్లి రైతులతో మాట్లాడి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు మంజూరు చేసిన అన్నదాత సుఖీభవ పథకం, వ్యవసాయంలో పంచసూత్రాలు వాటి ఆవశ్యకతను వివరించారు. రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందజేస్తుందని తెలిపారు. రైతుల నుంచి మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేసిన ఘనత టీడీపీదే అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జితేంద్ర, ఎంపీడీవో రంగనాయకులు ఏడీ రాజశ్రీ, ఏవో రఫి, మండల పార్టీ అధ్యక్షుడు సోరెడ్డి మోహన్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనూరు భూపాల్‌రెడ్డి,గుంటక నరశింహరావు, తాళ్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కొమరోలు : రానున్న 5 సంవత్సరాల్లో రైతును రాజును చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి అన్నారు. మండలంలోని రాజుపాలెం గ్రామంలో శనివారం నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పలు సూచనలు, భరోసా అందించారు. నీటి భద్రత డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్ సాగుకు సాంకేతికతను చేరవేయడం, ఫుడ్ ప్రాసెసింగ్ ప్రోత్సాహం, ప్రభుత్వ పెట్టుబడి సాయం, సేంద్రియ, జీవన, నానో ఎరువుల వైపు మార్చుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో చైర్మన్ భైలడుగు బాలయ్య, వైస్ చైర్మన్ గోడి ఓబుళ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి, బాల ఈశ్వరయ్య, వ్యవసాయ శాఖ అధికారి రాజశ్రీ, ఎంపిడిఓ సత్యం, మండల పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


రైతన్నా మీకోసం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

పొదిలి : రైతులు వాతావరణ పరిస్థితితులను బట్టి పంటమార్పిడి విధాన్నాన్ని పాటించాలని వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కంభాలపాడు, మాదిరెడ్డిపాలెం, కొండాయపాలెం రైతుసేవ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం రైతుల కోసం అనేకరకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. ముఖ్యంగా నీటి భద్రతను పాటించాలని, ఆహారపు అలవాట్లకు అనుకూలంగా రైతులు సాగుపద్దతులు మార్చుకోవాలన్నారు. ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ద్వారా పథకాలను అమలు చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రాచర్ల : రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో షేక్ మహబూబ్‌బాషా అన్నా రు. మండలంలోని అనుములవీడు గ్రా మంలో శనివారం ఆయన రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. రైతుల సమస్యలు తెలుసుకునేందుకు వారి అవసరతలు తీర్చేందుకు ప్రభుత్వం దీనిని అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లతీఫ్, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం

అధికారులు ఏం చేస్తున్నారంటూ ఎమ్మెల్యే ఆగ్రహం

తర్లుపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంటే అధికారులు ఏంచేస్తున్నారంటూ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చెన్నారెడ్డిపల్లెలో జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమానికి వెళ్తున్న ఎమ్మెల్యేకు పారిశుధ్యం అధ్వానంగా ఉందని ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తర్లుపాడు శివాలయం వద్ద మురుగునీరు కూడా రోడ్డుపై ఉండి కంపుకొడుతోందని తెలిపారు. వెంటనే ఈవోఆర్‌డీ రాఘవరావును, ఇన్‌చార్జి ఎంపీడీవో బుర్రి చంద్రశేఖర్‌ను పిలిచి పారిశుధ్యం ఇలా ఉంటే మీరు ఏమి చేస్తున్నారంటూ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. నీరు పోయేదానికి కాలువలు తీస్తుంటే కొందరు అడ్డుకుంటున్నారంటూ ఎమ్మెల్యే దృష్టికి అధికారులు తీసుకొచ్చారు. రోడ్లు ఎవరి సొత్తు కాదు వెంటనే పగులగొట్టి మురుగునీరు పోయేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఎవరైనా అడ్డువస్తే చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ బ్రహ్మనాయుడుని ఆదేశించారు. 2 రోజుల్లోపు తర్లుపాడు శివాలయం వద్ద, చెన్నారెడ్డిపల్లెలో పారిశుధ్యం క్లియర్ చేయాలని సూచించారు.

ఎమ్మెల్యేకు ధన్యవాదాలు

గిద్దలూరు టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యాలయంలో శనివారం సందడి వాతావరణం నెలకొన్నది. టీడీపీ శ్రేణులతోపాటు బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని పార్టీ కార్యాలయంలో కలిసి మార్కాపురం జిల్లా ప్రకటన రావడంపై ఎమ్మెల్యే కృషిని అభినందిస్తూ ఆయనకు పూలమాలలు, శాలువలతో సన్మానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి శ్రేణులు ధన్యవాదాలు తెలిపారు. మార్కాపురం జిల్లా సాధనలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఎంతో కృషి చేశారని, వెనుకబడిన గిద్దలూరును అభివృద్ధి చేయడమే ఎమ్మెల్యే లక్ష్యంగా పెట్టుకున్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో గిద్దలూరు, కొమరోలు మండల పార్టీల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, బోనేని వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఎడ్యుకేషన్ సోషల్ వెల్ఫేర్ కార్పోరేషన్ డైరెక్టర్ గోన చెన్నకేశవులు, కంభం జడ్పీటీసీ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాసులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కంభంలో రెచ్చిపోతున్న దొంగలు

నిద్రపోతున్న పోలీసులు

కంభం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కంభంలో వరుస దొంగతనాలు చేస్తూ పోలీసులకు దొంగలు సవాల్ విసురుతుంటే పోలీసులు మాత్రం నిద్రపోతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. కంభం పట్టణంలో ఈ రెండు నెలల వ్యవధిలోనే 10కిపైగా దొంగతనాలు జరిగినా పోలీసులు ఈ కేసులను ఛేదించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. పట్టణంలో అరాఫత్ నగర్‌లో, బస్టాండ్ సమీపంలో మూడు షాపుల షట్టర్లను పగులగొట్టి దొంగలు కొంతమేర నగదు దోచుకెళ్లారు. ప్రస్తుతం దొంగతనం జరిగిన మూడు షాపులు ఎదురుగా ఉండే వైన్ షాపులో దొంగలు పడి రూ.1.50లక్షలు నగదును, మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారు. ఈ రెండు నెలల వ్యవధిలోనే కాదు ఏడాది కాలంగా గృహాలలో దొంగలు పడి చోరీలు చేసిన ఏ కేసులోనూ పోలీసుల పురోగతి సాధించలేదని తెలుస్తుంది. దీంతో ఇళ్లకు తాళాలు వేసి బంధువుల ఊళ్లకుగానీ, దూర ప్రాంతాలకు వెళ్లాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు. ముఖ్యమైన కూడళ్లలో గృహాలకు సీసీ కెమెరాలు అమర్చినా ప్రయోజనం లేకుండా పోయిందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఇప్పటికైనా రాత్రివేళ గస్తీ పెంచి అనుమానితులను అదుపులోకి తీసుకొని ప్రశ్నించాలని కోరుతున్నారు.

వాటర్‌షెడ్‌లను నాణ్యతతో నిర్మించాలి

పొదిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో వాటర్‌షెడ్‌లలో నిర్మించే చెక్‌డ్యాంలను నాణ్యతతో నిర్మించాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ జోసఫ్ కుమార్ అన్నారు. మండలంలోని అన్నవరం గ్రామంలో నిర్మించిన పలు చెక్‌డ్యాంలను శనివారం ఆయన పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలతో చెక్‌డ్యాంలో ఉన్న నీటి నిల్వలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయన వెంట వాటర్‌షెడ్ ఏపీడీ చంద్రశేఖర్, పీవో సుధాకర్, జేఈ శ్రీనివాస్, టీవోలు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి దోహదపడేలా ఉపాధి పనులు

రాచర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనులు గ్రామాల అభివృద్ధికి దోహదపడే విధంగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఐ వెంకటేష్ అన్నారు. మండలంలోని రాచర్ల, చిన్నగానిపల్లి, అనుములపల్లి గ్రామాల్లో శనివారం ఉపాధి పనులకు సంబంధించి పీఆర్‌ఏ, గ్రామ సభలు నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2కోట్ల 70లక్షల 80వేల 629రూపాయల లేబర్ బడ్జెట్‌తో 52,927 పనిదినాలు కూలీలకు కల్పించాల్సి ఉందని, చేపట్టే పనులు ప్రయోజనకరంగా ఉండాలన్నారు. అనంతరం గ్రామానికి సంబంధించిన చిత్రపటాన్ని సిద్ధం చేసి చేసిన పనులు, పనిదినాలు, కూలీల వివరాలను అధికారులు ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీవో ఆర్ మహాలక్ష్మి, ఈసీ జే నాగేశ్వరరావు, కార్యదర్శులు ఎంవీ నాయక్, ఎం శిరీష దేవి, ఏవి సురేష్, ఉపాధి సిబ్బంది, టీడీపీ నాయకులు డీ కాశిరెడ్డి, ఎస్ కల్యాణ్ రెడ్డి పాల్గొన్నారు.



చిత్రపటం ద్వారా పనులను గుర్తిస్తున్న సిబ్బంది

ఉత్సాహంగా ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

కంభం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి ఉపాధ్యాయుల క్రీడాపోటీలను ఎంఈవోలు అబ్దుల్ సత్తార్, శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులలో ఉత్సాహం, శారీరక, మానసిక ధృఢత్వాన్ని పెంపొందించేందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రయోగాత్మకంగా టీచర్స్ గేమ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని పలువురు ఉపాధ్యాయులు ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొని హోరాహోరీగా తలపడ్డారు. క్రికెట్ విభాగంలో పురుషులు, త్రోబాల్ పోటీల్లో మహిళలు పాల్గొని తమ తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ క్రీడాకారులు మాట్లాడుతూ రోజువారీ బోధన కార్యక్రమాల ఒత్తిడి నుంచి ఆట విడుపుగా ఏర్పాటు చేసిన క్రీడలతో ఆనందాన్ని, ఆహ్లాదాన్ని పొందుతున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన ఉపాధ్యాయులు డివిజన్ స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓ అబ్దుల్ సత్తార్ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయినీ బి అమూల్య, శివనాగ మోహిని, వెంకట లక్ష్మమ్మ, సుబ్బలక్ష్మీ, సయ్యద్ షబ్బీర్, సయ్యద్ ఆదిల్, ఖాశింపీరా, వీరనారాయణ, సునీల్ కుమార్, వేణుగోపాలాచారి, పీఈడీలు సుబ్రమణ్యం, విజయ్ కుమార్; బషీర్, సుశీల పాల్గొన్నారు.


కంభంలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో

ఎర్రగొండపాలెం : ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులకు ఆటల పోటీల శనివారం ఎంఈవో అంజనేయులు, ఎస్‌ఐ చౌడయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ క్రీడలు,ఆటలు మానసిక ఉల్లాసానికి, శారీక దేహదారుడ్యానికి దోహదపడతాయని అన్నా రు. 16 మందితో క్రికెట్ జట్టును ఎంపిక డివిజన్‌సాయి పోటీలకు పంపిస్తామని అన్నారు. ఉపాధ్యాయులు ఆటలు, క్రీడా పోటీల్లో పాల్గొని ఆరోగ్య భారత్‌కు దోహదపడాలని ఎంఈవో అన్నారు. కార్యక్రమంలో హెచ్ ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుల్లలచెరువ : విద్యార్థులకు బోధనతో పాటు ఉపాధ్యాయులు క్రీడల్లో పాల్గొనాలని ఎంఈవోలు బాస్కర్‌రావు అన్నారు. మండలంలోని పిడికిటివారిపల్లె జెడ్పీ పాటశాలలో ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆటలతోనే ఉత్సా హం, శారిరక ధృఢ త్వం పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఇందిర, హెచ్‌ఎం వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మండల స్థాయి ఉపాధ్యాయుల ఆటలపోటీలను ఎంఈవో మస్తాన్ నాయక్ శనివారం ప్రారంభించారు. ఎంఈవో మస్తాన్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయిలో నైపుణ్యాలు కలిగిన క్రీడాకారులను డివిజన్ స్థాయికి ఎంపిక చేస్తారని, ప్రధానంగా పురుషుల విభాగంలో క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అద్భుత ప్రతిభను కనబర్చి రాష్ట్ర స్థాయిలో రాణించాలని ఎంఈవో ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 కొండలరావు, హెచ్‌ఎం శ్యామ్ ప్రసన్నతాంజలి, వ్యాయామ ఉపాధ్యాయులు రామానాయక్, హెచ్.రామానాయక్, పీ తులసీ నాయక్, సిద్ధు, మధుసూధన్, సరస్వతి, అపూర్వ, సుష్మబాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సావిత్రి సేవలు ఆదర్శనీయం

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

పెద్దదోర్నాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సావిత్రీ సేవలు ఆదర్శనీయమని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సావిత్రి ఉద్యోగ విరమణ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా ఉన్నతమైనదన్నారు. అంకితభావంతో విధులు నిర్వహించిన అధ్యాపకుల సేవలు చిరస్థాయిగా నిలిచి పోతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, టీడీపీ మండల కన్వీనర్ షేక్ మాబు, నాయకులు దొడ్డా శేషాద్రి, దర్శనం దేవయ్య, దేసు నాగేంద్రబాబు, చంటి,కటికల శ్రీనివాసులు, పబ్బతి సుబ్బారావు, చల్లా వెంకటేశ్వర్లు, బాబు, షేక్ మౌలాలి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

మార్కాపురం రూరల్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ రానున్న నేపథ్యంలో మండలంలోని రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ చిరంజీవి కోరారు. మండలంలోని భూపతిపల్లి గ్రామంలో శనివారం తహసీల్దార్ అధికారులతో కలిసి గ్రామస్తులతో సమావేశమై తుఫాన్ వచ్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివవరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు ముఖ్యంగా వారం రోజుల పాటు వరి పంటను కోయవద్దని తెలిపారు. పత్తి పంటను కూడా ఈ సమయంలో తీయవద్దని కోరారు. ముఖ్యంగా మండలంలోని భూపతిపల్లితో పాటు మాల్యవంతునిపాడు, వేమలకోట, కొండేపల్లి, కోలభీమునిపాడు, పెద్దనాగులవరం గ్రామాలలో రైతు లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏవో బుజ్జిబాయి మాట్లాడుతూ పత్తి పంట కొనుగోలు చేసేందుకు మార్కాపురంలోని మార్కెట్ యార్డులో ప్రభుత్వం సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో పత్తి పంటను అమ్ముకునే రైతులు ముందుగా గ్రామ వ్యవసాయ శాఖ సిబ్బందితో తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో బాల వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

బేస్తవారపేట : ఆదివారం నుంచి 5వ తేదీ వరకు దిత్వా తుఫాన్ కారణంగా రైతులు తగు జాగ్రతలు తీసుకోవాలని, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వ్యవసాయాధికారి అబ్దుల్ రఫీ తెలిపారు. వరి, మొక్కజొన్న కోతకు సిద్ధంగా ఉన్నప్పటికీ కోతను తుఫాన్ తగ్గేవరకూ వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే కోసినట్లయితే పంటను సురక్షిత ప్రాంతానికి తరలించి భద్రపరుచుకోవాలని ఏవో సూచించారు.

గిద్దలూరు : దిత్వా తుఫాన్ ప్రభావం వలన వర్షాలు, గాలులు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున వరి పంట సాగు చేసిన రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వరిపంట కోసిన రైతులు ధాన్యాన్ని కల్లాల్లో అలాగే వదిలివేయకుండా సురక్షిత ప్రదేశాలకు మార్చుకోవాలని సూచించారు. నాలుగైదు రోజుల్లో కోతకు వచ్చే వరిపంటను ప్రస్తుతం కోయకుండా ఉండాలన్నారు. వర్షంలో మొక్కలు పడిపోకుండా చూసుకోవాలని, వర్షం భారీగా పడితే నీరు పొలాల్లో నిలువఎవ లేకుండా ముందస్తుగా కాలువలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మార్కాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణ పరిధిలో 9 మందికి మంజూరైన రూ.5.85లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శనివారం ఎమ్మెల్యే నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మి ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యం పొందిన పేదలైన వారికి నిర్ణీత సమయంలోనే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సాయం అందుతోందన్నారు. వైద్యం సహాయం పొందిన వాళ్ల వ్యయ ప్రయాసలకోర్చి ఎక్కడా తిరగకుండా వారి ఇంటికే వెళ్లి సహాయం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీంఖాన్, కనిగిరి రమణ, తిరుమలశెట్టి వీరయ్య, సయ్యద్ గఫార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాచర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల కారణంగా నేడు ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రాచర్ల విద్యుత్ శాఖ ఏఈ బాలగురవయ్య శనివారం తెలిపారు. రాచర్ల 33/11సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న అనుములపల్లి గ్రామంలో ఆర్‌డిఎస్‌ఎస్ పనుల కారణంగా ఈ అంతరాయం కలిగిందని ప్రజలు, విద్యుత్ వినియోగదారులు ఈ విషయం గమనించి విద్యుత్ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

అలరించిన ఫుడ్ ఫెస్టివల్

కంభం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల విద్యార్థులు నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎంఈవో అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో కూల్ డ్రింక్స్, జంక్ ఫుడ్స్ వినియోగం అధికమౌతున్న క్రమంలో సహజమైన ఆహార పదార్థాల వినియోగాన్ని వివరిస్తూ ఫ్రూట్స్, కీరా, క్యారెట్, బీట్రూట్, మజ్జిగ, కొబ్బరి నీళ్లు తదితర ఫుడ్స్ వినియోగంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకునేలా విద్యార్థులకు ఆరోగ్య అవగాహన కలిగించనున్నట్లు తెలిపారు. ఆహార నియమాలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, విజయవాహిని ఫౌండేషన్, టాటా ట్రస్ట్ ప్రోగ్రాం అసోసియేట్ శ్యాంబాబు, వొకేషనల్ ట్రైనర్స్ అజయ్ కుమార్, పెంచల్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దొనకొండను కలపాలి

గిద్దలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా ఏర్పాటైన మార్కాపురం జిల్లాలో దొనకొండ మండలాన్ని కలుపాలని బీజేపీ జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జేవీ నారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వెనుకపడిన పశ్చిమ ప్రాంతాన్ని కలిపి మార్కాపురం జిల్లా చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అయితే బ్రిటీష్ కాలం నుంచి మార్కాపురానికి అనుబంధంగా ఉన్న దొనకొండ ప్రాంతంలో అవసరమైన భూములు, రైల్వే వ్యవస్థ, పురాతన ఎయిర్‌పోర్టు లాంటివి ఉన్న దృష్ట్యా ఆప్రాంతాన్ని మార్కాపురం జిల్లాలో కలిపితే త్వరరలో పూర్తయ్యే వెలుగొండ, నల్లమల అటవీ ప్రాంత ఉత్పత్తులతో పరిశ్రమలు భారీగా వచ్చే అవకాశం ఉన్నందున ఈప్రాంత నిరుద్యోగ సమస్య కూడా తీరుతుందని, వెనుకపడిన కొత్త మార్కాపురం జిల్లా త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

ఘనంగా గంధం పూజ

గిద్దలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీహజరత్ ఖాదర్‌వలిస్వామి ఉరుసు మహోత్సవం వైభవంగా ప్రారంభమైంది. శనివారం గంధం పూజ నిర్వహించారు. 5వ వార్డులోని స్వామి వారి చిన్న దర్గ నుంచి మేళతాళాల మధ్య పకీర్ వాయిద్యాలతో గంధాన్ని ఖాదర్‌వలిస్వామి దర్గాకు తీసుకునివచ్చి పూజలు నిర్వహించారు. దర్గా కమిటీ అధ్యక్షులు పఠాన్ లతీఫ్‌ఖాన్, ఉపాధ్యక్షులు అబ్దుల్‌సుకూర్, కార్యదర్శి పీవై ఖాన్, కమిటీ ప్రతినిధు పాల్గొన్నారు.

పొరుగు వారి హక్కుల ఉద్యమం

గిద్దలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జేఐహెచ్ ఆధ్వర్యంలో పొరుగు వారి హక్కుల ఉద్యమం నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో కరపత్రాలు పంపిణీ చేశారు. సమాజంలో ఉన్న పొరుగు వారి పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, ఈ ఉద్యమం ఉద్దేశ్యమని జెఐహెచ్ మహిళ విభాగం కార్యకర్తలు మహబున్నీసా, రేష్మా పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో నుంచి పొగ

అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది

ఎర్రగొండపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్జీవో కాలనిలో శనివారం తాళం వేసి ఉన్న ఇంటిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారిగా పొగ వ్యాపించింది. వెంటనే స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ఇంటి యజమాని సత్యనారాయణతో తాళం తెరిపించి మంటలను అదుపు చేయించారు. ఇంటిలో అద్దెకు ఉన్న వ్యక్తులు రెండురోజుల కిందట తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. టీవీ స్విచ్ ఆఫ్ చేయకపోవడంతో టీవీలో సర్క్యూట్ ఏర్పడి పొగ మంటలు వ్యాపించినట్లు అగ్నిమాపక అధికారి వీ మాల్యాద్రి తెలిపారు. టీవీ, ఫ్రిజ్ ఫ్రిజ్ కాలిపోయినట్లు తెలిపారు.

ఉద్యాన అధికారి జగన్ జపం

తర్లుపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నారెడ్డిపల్లెలో జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఉద్యాన అధికారి రమేష్. జగన్ జపం చేయడంపట్ల ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. జగన్ మీకోసం కార్యక్రమానికి వచ్చిన అధికారులు, రైతులందరికీ కూడా ధన్యవాదాలు అని చెప్పడంతో వచ్చిన రైతులు, ప్రజలు ఆశ్చర్యపోయారు. ఇంకా జగన్ జపం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పాల్గొన్న కార్యక్రమంలోనే జగన్ పేరు జపించడంతో పలువురు రైతులు అసహనానికి గురయ్యారు. కనీసం మాట్లాడే సమయంలో పొరపాటి అని కూడా చెప్పకపోవడం ఆ ఉద్యోగి బాధ్యతారాహిత్యానికి నిదర్శనం.

దరఖాస్తు గడువును పొడిగించాలి

గిద్దలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాజ్ యోజన గృహ నిర్మాణ దరఖాస్తుల గడువును డిసెంబరు ఆఖరు వరకు పొడిగించాలని సీపీఎం జిల్లా నాయకులు బాలకోటయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో బాలకోటయ్య మాట్లాడుతతూ గ్రామాలలోని నిరుపేదలు రకరకాల సమస్యలతో పక్కా ఇళ్ళ కోసం దరఖాస్తులు చేసుకోలేక పోయారని, గడువును డిసెంబరు నెలాఖరు వరకు పొడిగించి పేదల సొంతింటి కలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో నాయకులు ఆవులయ్య, థామస్, నరసింహులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రాచర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన రాచర్ల స్పందన ఉన్నత పాఠశాల ఆవరణలో నేడు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్పందన విద్యాసంస్థల ఎండీ పేర్ల సుధీర్ కుమార్ రెడ్డి శనివారం తెలిపారు. నంద్యాల పట్టణానికి చెందిన ఉదయానంద ఆసుపత్రి వారు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గుండె, క్యాన్సర్, కళ్లు, ఎముకలు, కీళ్లు, తదితర వ్యాధులకు ఉచితంగా వైద్య చేస్తారని ఆయన తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కొనసాగుతుందన్నారు.

పంట నష్టపోయిన రైతుకు ఎమ్మెల్యే సాయం

గిద్దలూరు టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తెగుళ్లతో పంట నష్టపోయిన రైతులకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆర్థిక సాయం అందించారు. ఆ రైతు సాగు చేసిన భూమి అసైన్‌మెంట్ కావడంతో పంట నష్టపరిహారం వచ్చే అవకాశం లేదు. తన పరిస్థితిని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి తెలియచేయగా వెంటనే స్పందించి రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందిస్తానని తెలిపారని రైతు కొర్రా రామయ్య తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి శనివారం టీడీపీ కార్యాలయంలో రామయ్యకు సాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు బద్రి గోపాల్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కంకర వెంకటరెడ్డి, దొంతరి రామయ్య, అల్లం రంగస్వామి, ఎస్.తిరుపతయ్య పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా రవిశంకర్

గిద్దలూరు టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు ట్రాన్స్‌కో సబ్‌డివిజన్ డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా మేకల రవిశంకర్ నియమితులై శనివారం బాధ్యతలు స్వీకరించారు. నియోజకవర్గ పరిధిలోని ఏపి ట్రాన్స్‌కో 132కెవి అనుమలపల్లె, 132 కేవీ కంభం, 132 కేవీ గిద్దలూరు సబ్‌స్టేషన్లకు ఆయన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పర్యవేక్షించనున్నారు. రవిశంకర్ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

రాచర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా ఎంపికైన యూటీఎఫ్ కార్యవర్గం సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. రాచర్ల యూటీఎఫ్ నూతన కమిటీ ఆదివారం ఎంపిక కాగా ఆయన పాల్గొన్నారు. ఉపాధ్యాయ విద్య వ్యవస్థలపై యుటిఎఫ్ రాజీలేని పోరాటం చేసిందన్నారు. అధ్యక్షుడిగా జె రఘురాం, ప్రధాన కార్యదర్శిగా రంగారెడ్డి, గౌరవాధ్యక్షుడిగా కాశయ్య, సహ అధ్యక్షుడిగా బి వెంకటేశ్వర్లు, సహ అధ్యక్షురాలుగా ఎస్ సుజాత, కోశాధికారిగా మురళి, శ్రీధర్‌రెడ్డి, కుటుంబ సంక్షేమ కార్యదర్శిగా శివరామిరెడ్డి ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా కౌన్సిల్ సభ్యులు, రమణారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

దొనకొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం ఏర్పడుతుందని ఎంఈవోలు ఎస్.సాంబశివరావు, షేక్ అమీర్ అన్నారు. మండలస్థాయి ఉపాధ్యాయులకు శనివారం దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన క్రికెట్ పోటీలను వారు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఈవో సాంబశివరావు మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణతో పాటు శారీరక దృఢత్వం, ఆరోగ్య పరిరక్షణకు ఎంతో ఉపయోడపడతాయన్నారు. ఈపోటీల్లో వాచ్ఎం వీవీ రామాంజనేయులు, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పామూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలునాటి సంరక్షించాలని ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ బైరెడ్డి జయరామిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అనుమునిగిరి క్షేత్రం వద్ద రెడ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీకాశీనాయన అన్నదాన సత్రం ప్రాంగణంలో మొక్కలు నాటారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఖాదరున్నీసా బేగం అధ్యక్షతన పీఎంశ్రీలో భాగంగా నో బ్యాగ్‌డే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే, పాఠశాల పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సాధికారతతో సమానత్వం

పామూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సమాజంలో పురుషులతో పాటు మహిళలకు సమాన చట్టాలు కలిగి ఉన్నాయని స్త్రీనిధి ఏజీఎం, ఏజీఎం అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయం, మండల సమాఖ్య ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్త్రీనిధి జిల్లా మేనేజర్ ఉదయ్‌కుమార్, సంపత్‌కుమార్, ఇన్‌చార్జ్ ఏపీఎం ఎం.అశోక్, మండల సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు ఓరుగంటి సుబ్బమ్మ, ఉమ్మడి పద్మావతి, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా రాధాకృష్ణమూర్తి

దొనకొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీవో గుడిపాటి వెంకటరాధాకృష్ణమూర్తి శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం నడింపాలెం గ్రామ కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై గ్రామ సచివాలయం, వార్డు సచివాలయాల డిప్యూటీ ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు.

'ఉజ్వల యోజన'ను సద్వినియోగం చేసుకోవాలి

దొనకొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేదప్రజల కోసం నూతనంగా ప్రవేశపెట్టిన ఉజ్వల యోజన పథకం కింద ఉచితంగా అందించే గ్యాస్ కనెక్షన్లు అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు రొడ్డా వెంకటరావు అన్నారు. పేద ప్రజల కోసం ప్రధాని మోదీ ఎన్నో బృహత్తరమైన కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. తాజాగా గ్యాస్ కనెక్షన్ లేని ప్రతి పేదకుటుంబానికి ఉజ్వల యోజన పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ కనెక్షన్ అందించే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు.

మృతుల కుటుంబాలకు సాయం

ముండ్లమూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములబండ ఎస్సీ కాలనీకి చెందిన వరగాని చినగురవయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుమారుడు నాగ సుబ్బయ్యకు శనివారం టీడీపీ నాయకుడు రూ.పది వేలు ఆర్థికసాయం చేశారు. అదే గ్రామానికి చెందిన దార్ల ఆంజనేయులు మృతిచెందగా, ఆయన కుమారుడు మల్లికార్జున్‌కూ రూ.పది వేలు అందజేశారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంచుమాటి ఏడుకొండలు, దుగ్గినేని శ్రీను, కోనంకి శ్రీను పాల్గొన్నారు.

బాధితుడికి చెక్కు అందజేత

ముండ్లమూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మలూరు ఎస్సీ కాలనీకి చెందిన దాసరి జాన్ ప్రభాకర్ అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని ప్రభాకర్ బంధువులు సంప్రదించగా వెంటనే రూ.2 లక్షలు మంజూరుచేయించి ఎల్‌వోసీ చెక్కును శనివారం అందజేశారు.

ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలి

కనిగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఉషారాణి అన్నారు. శనివారం కళాశాలలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక పఠనం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పోటీల్లో పాల్గొన్న విజేతలకు ప్రిన్సిపాల్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డి.విజయకుమారి, డాక్టర్ బి.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

పీసీపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో శనివారం జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు మాత్రమే ఎరువులు, పురుగుమందులు ఉపయోగించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలన్నారు. రైతులకు పెట్టుబడి తగ్గించే కార్యక్రమంలో భాగంగా పురుగుమందులను పిచికారీ చేసేందుకు డ్రోన్ స్ప్రేయర్లను సబ్సిడీపై ప్రతి మండలానికి ఒకటి ఇచ్చినట్టు చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగంతో కూడిన కరపత్రాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు, ఏడీఏ షేక్ జైన్‌లబ్దిన్, మండల వ్యవసాయ అధికారి ఎస్.రంగాక్రిష్ణ, తహసీల్దార్ సీహెచ్ ఉష, సర్పంచ్‌లు పల్లా మల్లికార్జున్, కరణం తిరుపతయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, తదితరులు పాల్గొన్నారు.



రైతన్నా మీకోసం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి



పెదయిర్లపాడులో జరిగిన గ్రామసభలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

స్వామిత్వతో భూమి వివాదాలు పరిష్కారం

పీసీపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వే చేయించడం ద్వారా గ్రామాల్లో నివాస స్థలాల వివాదాలకు తావుండదని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని పెదయిర్లపాడులో శనివారం స్వామిత్వ కార్యక్రమంపై జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ అధికారులకు సహకరించి స్వామిత్వ సర్వే చేయించుకోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, ఎంపీడీవో జీవీ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠినచర్యలు

పీసీపలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠినచర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఆక్రమణదారులపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయాలన్నారు. మండలంలోని వెంగళాయపల్లి గ్రామ పరిధిలో సర్వేనెంబరు 676లో 23.54ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. దానికి ఉన్న ఆనకట్టతో పాటు చెరువులోనూ చిల్ల, తుమ్మ వంటి వివిధ రకాల చెట్లు ఉన్నాయి. కొద్దిరోజులుగా పెదయిర్లపాడుకు చెందిన ఓ వ్యక్తి ఆనకట్టను ధ్వంసం చేసి అందులోని చెట్లను నరికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడంటూ తహసీల్దార్‌కు ఫిర్యాదుచేశారు. ఫిర్యాదుచేసి 20రోజులైనా అధికారులెవరూ ఎటువంటి చర్య తీసుకోలేదని ఆరోపిస్తూ శనివారం నేరేడుపల్లికి వచ్చిన ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డికి వెంగళాయపల్లి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు.

దీనిపై స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

» ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

దర్శి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు వీలుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం సేకరించే రైస్‌మిల్లులను శనివారం ఆయన పరిశీలించారు. అందులోభాగంగా దర్శి పట్టణంలోని పొదిలి రోడ్డులో గల విజయలక్ష్మి రైస్ మిల్లును ఆయన పరిశీలించారు. మిల్లు సామర్థ్యాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆర్డీవో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లా డుతూ దర్శి మండలంలో 15, కురిచేడు మండలంలో 6, దొనకొండ మండలంలో 3 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ఆయా సొసైటీ కేంద్రాలతోపాటు ఆ పరిధిలోని నిర్ధేశించిన రైతుసేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయటం జరుగుతుందన్నారు. ధాన్యం పండించిన రైతులు తమ పంటలను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకొని గిట్టుబాటు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు వెంకటేశ్వరరావు, పరిటాల శ్రీనివాసరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రాధాకృష్ణ, ఆర్ఐ రాజు, వ్యవసాయాధికారి కె.రాధ, తదితరులు పాల్గొన్నారు.



దర్శి పట్టణంలోని రైస్‌మిల్లును పరిశీలిస్తున్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, పాల్గొన్న రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు

హామీలన్నింటిని అమలుచేశాం

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ముండ్లమూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రభుత్వం ఏర్పడిన పదిహేడు నెలల కాలంలోనే 90 శాతం హామీలు నెరవేర్చినట్టు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని సింగనపాలెం గ్రామంలో జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రధానంగా రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించి లాభసాటి వ్యవసాయం చేసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారులు సూచనలు, సలహా లు తీసుకొని పంటలు సాగు చేసుకోవాలన్నారు. దర్శి నియోజకవర్గంలో ఏ రైతు నష్టపోకుండా, దళారుల చేతుల్లో మోసపోకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి ఆదుకోవటం జరుగుతుందన్నారు. వ్యవసాయ శాఖమంత్రితో మాట్లాడి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేస్తామన్నారు. దర్శి నియోజక వర్గంలో గతంలో ఎవరు చేయనంత అభివృద్ధిపనులు చేసిచూపించినట్టు చెప్పారు.

రాష్ట్ర సాంస్కృతిక సృజనాత్మక కమిషన్ చైర్మన్ పోడపాటి తేజశ్విని మాట్లాడుతూ రైతును రాజుగా చూడాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ఎక్కువ నిధులు కేటాయించి సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందిస్తున్నట్టు చెప్పారు. పశుపోషకులకు 50 శాతం సబ్సిడీపై దాణా అందజేస్తున్నట్టు చెప్పారు. ముందుగా అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు వారి ఖాతాల్లో రూ.7వేలు నగదు జమ చేయడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, ఏడీఏ బాలాజీ నాయక్, మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు, పశువైద్యా ధికారి బ్రహ్మయ్య, డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, మోదేపల్లి డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మానం నరసింహారావు, పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ కందిమళ్ళ చంద్రమౌళి, సొసైటీ అధ్యక్షుడు కోయ శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

నీటి సంరక్షణతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించాలి

» డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్

పీసీపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నీటి సంరక్షణతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించాలని డ్వామా పీడీ గంగవరపు జోసెఫ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని మురుగుమ్మి గ్రామంలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా వాటర్‌షెడ్ ద్వారా చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఆనకట్టలు, చెక్‌డ్యాంలు, నీటికుంటలు వంటి అభివృద్ధి పనుల స్థితిగతులను వాటర్‌షెడ్, ఉపాధిహామీ సిబ్బందితో చర్చించారు. అనంతరం జోసెఫ్‌కుమార్ మాట్లాడుతూ పర్యావరణ హితం కోసం నీటికుంటల కట్టలపై, ఆనకట్టలు, చెక్‌డ్యాం కట్టలపై మొక్కలు పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. మెరుగైన నీటి యాజమాన్య పద్ధతులతో వర్షపునీరు వృథా కాకుండా సమగ్ర జల సంరక్షణతో మురుగుమ్మి గ్రామం ఇటీవల జాతీయ ఉత్తమ జల పంచాయతీ అవార్డుకు ఎంపికై అవార్డు పొందడాన్ని సిబ్బందికి గుర్తుచేశారు. మనం చేపట్టే పనులు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ వై.చంద్రశేఖర్‌రెడ్డి, పీవో నజీముద్దీన్, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ నాగలింగేశ్వరి, ఈసీ జహంగీర్ బాషా, జేఈ ఎ.మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.



నీటికుంటలను పరిశీలిస్తున్న పీడీ జోసెఫ్‌కుమార్

టీడీపీని బలోపేతం చేయాలి

ముండ్లమూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): టీడీపీని బూత్‌స్థాయి నుంచి బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని రాష్ట్ర సాంస్కృతిక సృజనాత్మక కమిషన్ చైర్మన్ పొడపాటి తేజశ్విని అన్నారు. శనివారం మండలంలోని పసుపుగల్లు, చింతలపూడి, పులిపాడు గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో బూత్‌ల వారీగా పార్టీకి తగ్గిన ఓట్లపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తించటం జరుగుతుందన్నారు. ఏడాదిన్నర కాలంలో రాష్ట్రంలో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టినట్టు చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను టీడీపీ కార్యకర్తలు తిప్పికొట్టాల్సి న అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూర పాటి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ కామని పూర్ణచంద్రరరావు, మోతుకూరి శంకరరావు, మాజీ సర్పంచ్ ఇందూరి పిచ్చిరెడ్డి, గుర్రం వెంకటనారాయణ, కాటూరి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



చింతలపూడిలో బూత్ కమిటీ సభ్యులతో సమీక్షిస్తున్న రాష్ట్ర సాంస్కృతిక సృజనాత్మక కమిషన్ చైర్మన్ పొడపాటి తేజశ్విని



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య

లోతట్టు ప్రాంతాలకు వర్షపునీరు చేరకుండా చర్యలు

దర్శి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలకు వర్షపునీరు చేరకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దర్శి - అద్దంకి రోడ్డులోని జోమ్‌కాలువపై నూతన వంతెన నిర్మాణం, దర్శి-పొదిలి రోడ్డులోని కాటేరువాగుపై వంతెన నిర్మించే పనులపై చర్చించారు. ఈ వాగుల పరివాహ ప్రాంతాల్లో వర్షాలు పడినప్పుడు నీరు కిందకు వెళ్లే వీలులేక లోతట్టు ప్రాంతాల్లోని గృహాలకు చేరుతుంది. దీంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఆ రెండు వంతెనలను నిర్మిస్తే సమస్య తీరుతుందన్నారు. దర్శి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కొనసాగించటంతో పాటు నూత నంగా ఏర్పాటవుతున్న అద్దంకి రెవెన్యూ డివిజన్‌లో కలపటం పట్ల సమావేశం హర్షం వ్యక్తం చేసింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి సమా వేశం ధన్యవాదాలు తెలిపింది. ప్రజాప్రభుత్వం ప్రవేశ పెట్టిన భవన క్రమబద్ధీకరణ పథకాన్ని ప్రజలు సద్విని యోగం చేసుకోవాలన్నారు. గడువు దాటిన తర్వాత అక్రమ లేఅవుట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిషనర్ వై.మహేశ్వర రావు, వైస్‌చైర్మన్ జి.స్టీవెన్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫుడ్ ఫెస్టివల్

వెలిగండ్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని ఎంఈవో దాస్ ప్రసాద్, ఎంపీడీవో గంగాధర్ ప్రారంభించి మాట్లాడారు. సంతులిత ఆహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటామన్నారు. వివిధరకాల మెలకెత్తిన విత్తనాలు, పిండి వంటలు, జొన్న రొట్టె, చిక్కీలు, సున్నుండలు, రాగిజావ, స్వీట్లను ఫుడ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించారు. కార్యక్రమంలో డాక్టర్లు హైమావతి, మౌనిక, హెచ్ఎం గౌసియా బేగం, ప్రత్యేకాధికారి శ్రీరామ సుశీల, మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో మెలగాలి

తాళ్లూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు క్రీడాస్ఫూర్తితో ఉంటూ విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఎంఈవో జి.సుబ్బయ్య అన్నారు. శనివారం స్థానిక వీకే ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల క్రికెట్, త్రోబాల్ పోటీలు జరిగాయి. ఈపోటీల్లో ప్రతిభచూపిన ఉపాధ్యాయులు డిసెంబర్ 16న డివిజన్ స్థాయిలో జరిగే పోటీలకు హాజరవుతారని ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-2 సుధాకర్‌రావు, ఏఎస్సై భాస్కర్ రావు, స్కూల్ కమిటీ చైర్మన్ అనపర్తి సత్యవర్ధన్‌రావు, వీకే ఉన్నత పాఠశాల, తూర్పుగంగవరం జడ్పీ హైస్కూల్ హెచ్ఎంలు మిల్టన్, వైఎస్ఆర్‌కే ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో పనులు పూర్తిచేయాలి

కనిగిరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నిర్ణీత సమయంలో పనులు పూర్తిచేయాలని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. శనివారం పట్టణంలోని దేవాంగనగర్ వద్ద పీహెచ్‌సీని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో రెండు పీహెచ్‌సీలు ఉన్నాయన్నారు. పీహెచ్‌సీల వద్ద డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్డు పనులు చేపట్టినట్టు చెప్పారు. నిర్ణీత సమయంలో పనులు పూర్తిచేసేలా చర్యలు తీ సుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈ మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

దూబగుంటలోనే ట్రిపుల్‌ఐటీ ఏర్పాటుచేయాలి

పామూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూబగుంట గ్రామంలోనే ట్రిపుల్‌ఐటీ నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ శనివారం సీపీఎం శ్రేణులు జీపు జాత కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ పాలకులు ట్రిపుల్‌ఐటీని బల్లిపల్లి గ్రామానికి తరలించారన్నారు. ప్రస్తుత ప్రజాప్రభుత్వం ప్రతిపాదత దూబగుంటలోనే ఈకళాశాలను నిర్మించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.శంకర్, సీహెచ్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి అడ్డుగాఉన్న విద్యుత్ పోల్ తొలగింపు

కనిగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇంటికి అడ్డంగా ఉన్న విద్యుత్ పోల్‌ను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాలతో విద్యుత్‌శాఖ అధికారులు శనివారం తొలగించారు. పట్టణంలోని 2వ వార్డులో శుక్రవారం ఛాయ్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పర్యటించారు. ఈసందర్భంగా ప్రజలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆవార్డులో ఓ ఇంటికి అడ్డంగా రోడ్డుపై విద్యుత్ స్తంభం ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే విద్యుత్ పోల్‌ను తొలగించాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు శనివారం విద్యుత్ స్తంభం తొలగించటంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



ఇంటి గేటుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభం





సమావేశం నిర్ణయాలను వివరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

అమరావతి రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

- రాజధాని రైతులకు రోడ్డు పోటు లేని ప్లాట్లు
- రెండో విడత సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని
- అమరావతి రైతుల సమస్యలపై త్రీమన్ కమిటీ సమీక్ష

అమరావతి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి రైతుల సమస్యలను గుర్తించాం.. వాటి పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. రాజధాని రైతులతో తాడేపల్లిలోని పెమ్మసాని క్యాంపు కార్యాలయంలో త్రీమన్ కమిటీ రెండో విడత సమావేశం శనివారం జరిగింది. మున్సిపల్ మంత్రి నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను పెమ్మసాని మీడియాకు వివరించారు. రాజధాని అమరావతిలో కొంతమంది రైతులకు గతంలో ఇచ్చిన రోడ్డు పోటు ప్లాట్లకి ప్రత్యామ్నాయంగా వాస్తుదోషం లేని నివేశన స్థలాలు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 156 మంది రైతులు వాస్తుదోషంపై ఫిర్యాదు చేశారని, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టామన్నారు. మెయిన్ రోడ్డు పెద్దదిగా ఉండి, కనెక్టింగ్ రోడ్డు చిన్నదిగా ఉన్న చోట్ల కమర్షియల్ ప్లాట్లు రోడ్డు పోటు కిందకు రావని అప్పట్లో అధికారులు చెప్పి కేటాయించారన్నారు. వాటికి కూడా ఇంపాక్ట్ అసెస్‌మెంట్ చేస్తున్నామన్నారు. ఎల్‌పీఎస్ స్కీమ్‌లో ఇంకా 2,492 ఎకరాల భూమి సీఆర్‌డీఏకి రావాల్సి ఉండగా 45 మంది రైతులు కోర్టు కేసులు వేశారని, వారితో మాట్లాడి 17 ఉపసంహరింపచేశామన్నారు. మిగతా 28 డిసెంబరు 3న కోర్టు (మిగతా 8వ పేజీలో)

లంక భూముల రిజిస్ట్రేషన్ ప్రారంభిస్తాం

ఎన్‌జీటీ కేసుతో సంబంధం లేకుండా లంక భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియని ప్రారంభిస్తామని పెమ్మసాని చెప్పారు. అసైన్డ్ భూములపై కేబినెట్‌లో చర్చించి ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామన్నారు. ఇక నుంచి ప్రతీ రెండు వారాల కు ఒకసారి అమరావతి రైతులతో సమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ రైతులు ప్రస్తావిస్తున్న సమస్యలను పరిష్కరించడానికి సీఆర్‌డీఏ అధికారులకు నిర్దేశిత గడువుని విధించి రిపోర్టులు తెప్పించుకుం టున్నామన్నారు. సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాత్సవ పాల్గొన్నారు.

గుర్తింపుతోనే.. సరి

అక్రమ కట్టడాలపై చర్యలు శూన్యం

- ప్రకటనల్లోనే కూల్చేస్తామన్న హెచ్చరికలు
- పురాల్లో బీపీఎస్ దరఖాస్తులు అరకొరగానే
- అనుమతించిన ప్లాన్లలో నిబంధనల అతిక్రమణ
- మామూళ్లతో కళ్లు మూసుకుంటోన్న మున్సిపల్ అధికారులు



- నరసరావుపేటలో నిర్మించిన అపార్ట్‌మెంట్

బాపట్ల, చీరాల గుంటూరు కార్పొరేషన్, తెనాలి, పొన్నూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా.. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా.. ఒకవేళ ఏదైనా ప్రమాదం జరిగినా నివారించేలా.. భవన నిర్మాణాలు చేపట్టాలి. అందుకు మున్సిపాల్టీ, నగర పాలక సంస్థల నుంచి ముందస్తు అనుమతులు ఉండాలి. నిబంధనల ప్రకారం ప్లాన్ రూపొందించుకుని, దానికి (మిగతా 8వ పేజీలో)

ప్లాన్లు తీసుకుని కొందరు.. లేకుండా మరికొందరు యథేచ్ఛగా భవన నిర్మాణాలు చేస్తున్నారు. ఇంకొందరు పేరుకు ప్లాన్ తీసుకుని అందుకు పూర్తి విరుద్ధంగా భవనాన్ని నిర్మిస్తున్నారు. అయితే అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు గుర్తిస్తున్నారే కానీ వాటిపై చర్యలు ఉండటంలేదు. మున్సిపల్ అధికారులు మామూళ్ల మత్తులో కళ్లెదుట అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ప్రభుత్వం ఒకవైపు అక్రమ నిర్మాణాలను కట్టడి చేయాలని సూచిస్తున్నా ఎక్కడికక్కడ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదు. ఒకవిధంగా అక్రమ నిర్మాణాలను అధికారులే ప్రోత్సహిస్తు న్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని మున్సిపల్ పట్టణాలతో పాటు గుంటూరు నగరపాలక సంస్థలో నిబంధనలకు విరుద్ధంగా భారీగా భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి. అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణకు తరచూ ప్రభుత్వం అవకాశం ఇస్తున్నా ఫలితం ఉండటం లేదు. అధికారులు, రాజకీయ నాయకుల అండతోనే అక్రమ నిర్మాణదారులు క్రమబద్ధీకరణకు ముందుకు రావడంలేదన్న ఆరోపణలు ఉంటున్నాయి.



గుంటూరు బ్రాడీపేట 4/14లో జరిగిన అక్రమ నిర్మాణం

గుంటూరులో 10 వేలకు.. 8 దరఖాస్తులు

గుంటూరు నగరంలో కొన్నేళ్లుగా అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగు తున్నాయి. నగర పరిధిలో 10 వేలకు పైగా అక్రమ కట్టడాలు ఉండగా ఇటీవల వరకు 8 మంది మాత్రమే బీపీఎస్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. జీఎంసీ పరిధిలో ఎక్కడ చూసినా అక్రమ కట్టడాలు కనిపిస్తాయి. అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించు కోకపోతే కూల్చేస్తామని ప్రభుత్వం హెచ్చరిస్తున్నా నిర్మాణదారులు అంతగా లెక్క చేయడంలేదు. బీపీఎస్ దరఖాస్తుకు గడువు ముగిసిన వెంటనే అక్రమ భవనాలపై కఠినంగా చర్యలు తీసుకుంటామని, వాటిని కూల్చివేస్తామని జీఎంసీ సీపీ రాంబాబు తెలిపారు.



కోతకు సిద్ధమైన వరి పైరు

దిత్వా.. ఎల్లో అలర్టు

అన్నదాతల గుండెల్లో వణుకు ● నేడు, రేపు జిల్లాకు వర్ష సూచన
● ఊపందుకున్న వరి కోతలు.. కల్లాల్లో ధాన్యం

(బాపట్ల, వేమూరు ఆంధ్రజ్యోతి)

మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్లు గాడిన పడుతుండగా.. దిత్వా హెచ్చరికలు అటు రైతులు, ఇటు అధికార యంత్రాంగంలో వణుకు పెడుతున్నాయి. వేల ఎకరాల్లో వరికోతలు పూర్తి కాగా కల్లాల్లో ధాన్యం రాశులు ఉన్నాయి. ఇదే సమయంలో దిత్వా తుఫాన్ హెచ్చరికలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఆది, సోమవారాల్లో జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వాతావరణ శాఖ రెండు రోజుల పాటు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. తుఫాన్ గండం నుంచి రైతులను గట్టెక్కించాలంటే ఆయా విభాగాలు సమన్వయంతో అడుగులేయాల్సి ఉంది. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో తొలి ప్రాధాన్యంగా కల్లాల్లోని ధాన్యాన్ని మిల్లులకు తరలించడం పైనే యంత్రాంగం దృష్టి పెట్టాల్సి ఉంది. అదేవిధంగా సేకరణపై రైతుల్లో ఉన్న అపోహలు తొలగించడానికి యంత్రాంగం సమాయత్తం కావాల్సి ఉంది. తుఫాన్ నేపథ్యంలో మార్కెటింగ్ శాఖ టార్పాలిన్ పట్టాలతో పాటు గన్నీ సంచులను సిద్ధం చేసుకోవాల్సి ఉంది. తేమ శాతంపై ఉదారంగా వ్యవహరించాలని ఇప్పటికే మిల్లర్లకు ఆదేశాలు అందాయి. కానీ అవి ఎక్కడా అమలవుతున్న దాఖలాలు కనిపించడం లేదు. జిల్లాలో 30 శాతం మిల్లుల్లో కూడా డ్రయ్యర్లు లేకపోవడం మరింత ఆందోళన కలిగించేదిగా ఉంది. కేవలం 18 మిల్లుల్లోనే డ్రయ్యర్ల సదుపాయం ఉన్నట్లు తెలుస్తోంది. అంచనాలకు మించి తుఫాన్ జిల్లాపై ప్రభావం చూపిస్తే తేమ శాతం విషయంలో మరింతగా గందరగోళం తలెత్తే ప్రమాదాలు కనబడుతున్నాయి.

కమ్మేసిన మబ్బులు.. రైతుల్లో ఆందోళన

శనివారం సాయంత్రానికి మబ్బులు పూర్తిగా కమ్మేశాయి. దీంతో రైతులు హడావుడిగా హార్వెస్టర్‌పై నూర్పిడి చేస్తున్నారు. కాగా కోత కోసిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు అవకాశం లేక ఆందోళన చెందుతున్నారు. కాగా రోడ్లు, కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని తేమ శాతం నిబంధనతో అమ్మలేని స్థితిలో ఎటూ పాలుపోని స్థితిలో ఉన్నారు. ఈ క్రమంలో ధాన్యాన్ని సంరక్షించుకునేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. మరోవైపు కోతకు సిద్ధమైన పైర్లను నిలువపై హార్వెస్టర్ల ద్వారా నూర్పిడి చేయాలన్న ఆలోచన ఉన్నప్పటికీ వాతావరణం సక్రమంగా లేకపోవడంతో పాటు హార్వెస్టర్ కొరతతో రైతులు అల్లాడుతున్నారు. ఈ పరిస్థితుల్లో వర్షం పడితే కోతకు సిద్ధమైన పైర్లు కూడా పూర్తిగా దెబ్బతింటాయని వాపోతున్నారు. జొన్న, మొక్కజొన్న మొలకల దశలో ఉన్నాయని వర్షం పడితే ఎదుగుదల ఆగిపోయి నష్టపోతామని రైతులు వాపోతున్నారు.

తుఫాన్ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ ఎదుర్కోవటానికి జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. దిత్వా తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులతో శనివారం ఆయన వీక్షణా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళరాదన్నారు. ఆమేరకు మత్స్యశాఖాధికారులు, పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రాన్ని తాకుతూ తుఫాన్ వెళుతుందన్నారు. జిల్లాకు భారీవర్ష సూచన ఉందన్నారు. తుఫాన్ తీరం దాటే వరకు ఆయాశాఖల అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. పంటకాల్వలపై ఉన్న కల్వర్ట్‌ల వద్ద పూడికతీత పనులు చేపట్టాలని, గుర్రపుడెక్కలను తొలగించాలన్నారు. నిత్యావసర సరుకులు సిద్ధంగా ఉంచుకోవాలని పౌరసరఫరాల శాఖాధికారికి ఆదేశాలు జారీచేశారు.

పల్లెల్లోనూ.. అన్న క్యాంటీన్లు

- మూడు జిల్లాలకు ఐదు మంజూరు
- శరవేగంగా నిర్మాణం.. 300 మందికి ఆహారం



నరసరావుపేట: నిర్మాణంలో ఉన్న అన్న క్యాంటీన్

భట్టిప్రోలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో పేదల ఆకలి తీరుస్తూ వివిధ వర్గాల నుంచి ఆదరణ పొందుతున్న అన్న క్యాంటీన్లు ఇక నుంచి పల్లెల్లోనూ సేవలు అందించనున్నాయి. గ్రామీణ ప్రాంతాల పేదల కడుపు నింపేలా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మండల, నియోజకవర్గ కేంద్రాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు ఐదు అన్న క్యాంటీన్లు మంజూరయ్యాయి. వాటి నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. నామమాత్రపు ధరకే టిఫిన్, భోజనం అందించేలా 2019కి ముందే గత టీడీపీ ప్రభుత్వం అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే వాటిని వైసీపీ ప్రభుత్వం మూసేసింది. ఈ నిర్ణయం పేదల కడుపు కొట్టడమేనని పలువురు విమర్శించినా వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లను పునరుద్ధరించింది. నిత్యం మూడు పూటలా వందల సంఖ్యలో పేదలు ఇక్కడ ఆహార పదార్థాలతో కడుపు నింపుకుంటున్నారు. పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్లకు పెద్దఎత్తున ఆదరణ లభించడంతో పాటు విరాళాలు కూడా వస్తున్నాయి. దీంతో ఇంతకాలం పట్టణ కేంద్రాలకే పరిమితమైన అన్న క్యాంటీన్లను పల్లెలకూ విస్తరణపై ప్రభుత్వం దృష్టి సారించింది. అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీలు ఉండే పల్లెల్లో రూరల్ అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తుంది. ఈ క్యాంటీన్ల ద్వారా నిత్యం 300 మందికి భోజనం అందించేలా నిర్వహించనున్నారు.

మంజూరు ఇలా..

- పల్నాడు జిల్లా : పెదకూరపాడు
- గుంటూరు జిల్లా : మంగళగిరి, ప్రత్తిపాడు, ఫిరంగిపురం
- బాపట్ల : భట్టిప్రోలు

మొక్కుబడిగా మున్సిపల్ సమావేశం

అద్దంకి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపల్ సమావేశం శనివారం చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన మొక్కుబడిగా సాగింది. ఇరు పక్షాల సభ్యులు ఎలాంటి చర్చలో పాల్గొనకుండ మౌనంగా ఉండిపోయారు. అజెండా లోని 18 అంశాలు చదవడం పూర్తయిన తర్వాత ఆమోది స్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు. గత కౌన్సిల్ సమావేశాలు జరిగిన తీరును ప్రస్తావిస్తూ కౌన్సిలర్లు హుందాగా వ్యవ హరించాలని 13వ వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి తెలిపారు. ఈ సమావేశంలో వైస్‌చైర్మన్లు పద్మేష్, అనంతలక్ష్మి, కమిషనర్ రవీంద్ర, మేనేజర్ రవీంద్ర, ఏఈ లోకేశ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ, హాజరైన కౌన్సిలర్లు

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

- రైతన్నా మీ కోసంలో ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు(కొల్లూరు), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. మండల పరిధిలోని వెల్లటూరులో శనివారం రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. రైతులకు ఆర్థిక భద్రతతో పాటు వ్యవసాయ పెట్టుబడిగా అన్నదాత సుఖీభవ పథకం దోహదపడుతుందని ఆయన తెలిపారు. ఏటా ఈ పథకం



వెల్లటూరులో రైతన్నా మీకోసంలో ఎమ్మెల్యే ఆనందబాబు

మూడు విడతలుగా రూ.20 వేలు రైతు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ మోటూరు పుణ్యశ్రీనివాసకుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు పరుచూరి రమేష్, టీడీపీ మండల అధ్యక్షుడు వాకా శేషుబాబు, నాయకులు కాట్రగడ్డ నాగమల్లేశ్వరరావు, వేములపల్లి జగన్నాథం, నూతక్కి దినకర్, పాల్గొన్నారు.

1, 2న మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం

బాపట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మెప్మా, ఎస్‌యూహెచ్‌ఎం ఆధ్వర్యంలో మహిళలకు వైద్య శిబిరం బాపట్ల అంబేద్కర్ భవనంలో సోమవారం, మంగళవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఈ వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని స్వయం సహాయక సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



మైనింగ్ సీనరేజ్ వసూళ్లు చేస్తున్న ఏఎంఆర్ కంపెనీకి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేస్తున్న గ్రానైట్ పరిశ్రమల యజమానులు, కార్మికులు

మైనింగ్ సీనరేజ్‌పై ఆందోళన

- వసూళ్లపై వేమవరం జంక్షన్‌లో ధర్నా
- యజమానులతో ఏఎంఆర్ ప్రతినిధుల వాగ్వివాదం

బల్లికురవ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇష్టారీతిన మైనింగ్ సీనరేజ్ వసూళ్లపై గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డెక్కారు. ఏఎంఆర్ కంపెనీ సీనరేజ్ వసూళ్ల ప్రక్రియను నిరసిస్తూ మండలం వేమవరంలోని ఏఎంఆర్ కంపెనీ చెక్‌పోస్టు వరకు శనివారం ప్రదర్శన చేశారు. అనంతరం జంక్షన్‌లో ధర్నా చేశారు. ఈ క్రమంలో గ్రానైట్ యజమానులతో కంపెనీ సిబ్బంది వాదనకు దిగారు. దీంతో రెండు చెక్‌పోస్టు బాక్సులను ఆందోళనకారులు రోడ్డు మార్జిన్‌లోకి నెట్టేసి అక్రమ వసూళ్ల నిలుపుదల చేయాలని నినాదాలు చేశారు. సుమారు ఆరు వందల మంది ఫ్యాక్టరీల యజమానులు, కార్మికులు రోడ్డుపైకి చేరడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. ఇదే రోడ్డులోని మరి కొన్ని చెక్‌పోస్టు బాక్సులను పడేయాలని వెళ్తున్న ఆందోళనకారులను సంతమాగులూరు సీఐ వెంకట్రావు, ఎస్‌ఐలు నాగరాజు, పట్టాభిరామయ్య, సైదాలు అడ్డుకున్నారు. కంపెనీ ప్రతినిధులను చర్చలకు పిలుస్తామని హామీ ఇవ్వడంతో యజమానులు ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా యజమానులు మాట్లాడుతూ నాసిరకమైన ముడి సరుకు కూడా ఫస్ట్‌క్వాలిటీ మెటీరియల్‌కు మాదిరిగా సీనరేజ్ వసూలు చేస్తే తాము నష్టపోతామన్నారు. అక్రమ వసూళ్లకు అడ్డు కట్ట వేసి పరిశ్రమలను కాపాడాలని లేకుంటే పరిశ్రమలు పూర్తి స్థాయిలో మూత తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల సంఘం అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య, నాగరాజు, పత్తిపాటి సురేష్, నేతలు పెయ్యల రంగనాథ్, యిటూరి ఆంజనేయులు, పుచ్చకాయల సుబ్బరామయ్య, కొర్రపాటి వేణు, కొండూరి నాగయ్య, జూపల్లి సింగయ్య, శ్రీనాథ్, రామరాజు, లేమాటి హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ అసోసియేషన్ నాయకుల చర్చలు

మార్టూరు: బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, మైనింగ్ ఏడీ రామచంద్రయ్య సమక్షంలో శనివారం సాయంత్రం మార్టూరు స్టేషన్‌లో గ్రానైట్ అసోసియేషన్ నాయకులు, ఏఎంఆర్ ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయి. ధర్నా సందర్భంగా పోలీసులు ఇచ్చిన హామీ మేరకు ఈ చర్చలు నిర్వహించగా ఒక కొలిక్కి రాలేదు.



ఏఎంఆర్ కంపెనీ ప్రతినిధిని చుట్టు ముట్టిన యజమానులు, కార్మికులు

పేద విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

● మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి



గురుకుల పాఠశాలలో వంటగదిని పరిశీలిస్తున్న మంత్రి స్వామి

సింగరాయకొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమంపై ప్రజాప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. శనివారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, వంట గదిని పరిశీలించారు. అనంతరం విద్యార్థినిలతో మాట్లాడారు. గురుకుల పాఠశాలల్లో గత ప్రభుత్వం కంటే అన్ని విధాలా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. పేద విద్యార్థులు కష్టపడి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే సీఎం లక్ష్యమని తెలిపారు. తొలుత మరమ్మతులు చేస్తున్న కందుకూరు రోడ్డులోని ఎస్సీ సంక్షేమ వసతి గృహాన్ని, ఇటీవల పూర్తిచేసిన చేపల మార్కెట్ ఆధునికీకరణ పనులను మంత్రి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు ఇచ్చారు.

డాక్టర్ కృష్ణచైతన్యకు అవార్డు ప్రదానం



ఎమ్మెల్యే హరీశ్‌రావు చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న డాక్టర్ కృష్ణచైతన్య

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉభయ రాష్ట్రాలకు సంబంధించిన ఆరో ఎడిషన్ టైమ్ ఎక్స్‌లెన్స్ అవార్డు-25ను ఒంగోలుకు చెందిన చైతన్య కార్డియాక్ హాస్పటల్ డాక్టర్ బీఎంవీ.కృష్ణ చైతన్య అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన సభలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు చేతుల మీదుగా అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ అవార్డును అందుకున్నారు. ముఖ్యఅతిథులుగా సుప్రీంకోర్టు రిటైర్డ్ జస్టిస్ ఎన్వీ.రమణ, డైరెక్టర్ అనుపమకేర్ తదితరులు పాల్గొన్నారు. కాగా కృష్ణచైతన్యను పలువురు డాక్టర్లు ప్రత్యేకంగా అభినందించారు.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆది, సోమవారాల్లో ఒంగోలులో జరిగే పలు పలు కార్యక్రమాకు హాజరుకానున్నారు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి వర్ధంతి వేడుకల పనులను మాగుంట రాఘవరెడ్డితో కలిసి పరిశీలిస్తారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. సోమవారం ఉదయం 9గంటలకు మాగుంట కార్యాలయంలో, అనంతరం సుబ్బరామిరెడ్డి వర్ధంతి కార్యక్రమాల్లో ఎంపీ మాగుంట పాల్గొంటారు.

ఎలక్ట్రానిక్ టెక్నీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : హోమ్ అప్లయన్సెస్ అండ్ బేసిక్ ఎలక్ట్రానిక్స్ టెక్నీషిన్‌లుగా ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ప్రేరణ ఎన్జీవో సంస్థ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఒంగోలులోనే మూడు నెలల పాటు ఉచిత వసతి, భోజనం, శిక్షణ అందిస్తామన్నారు. ఏసీ, కూలర్, వాషింగ్ మెషిన్, టీవీ, ఫ్రిడ్జ్, ఇతర గృహోపకరణాల మరమ్మతులలో శిక్షణ ఇస్తామని, ఆసక్తి గల ఉమ్మడి ప్రకాశం జిల్లా యువతీ, యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొంది. 18-35 సంవత్సరాల వయస్సు, కనీస విద్యార్హత 10వ తరగతి వారు అర్హులని, డిసెంబరు 2వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 9908824390 ద్వారా సంప్రదించాలని ఆ సంస్థ కోరింది.

వృద్ధురాలి నేత్రాలు దానం

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒంగోలుకు చెందిన కోడూరి పెద్దమ్మ (98) మరణించడంతో ఆమె కుటుంబసభ్యులు శనివారం ఆమె నేత్రాలను ఎల్వీ.ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. ఈ సందర్భంగా మృతురాలి కుమార్తె పిన్నక లక్ష్మీసీతాంబ మాట్లాడుతూ బాపట్ల జిల్లా నరసాయాలెంకు చెందిన తన తల్లి పెద్దమ్మ కోరిక మేరకు నేత్రాలు దానం చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు ఎస్వీ.రంగారెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సుబ్బరామరెడ్డి వర్ధంతి ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు పార్లమెంట్ మాజీ సభ్యుడుదివంగత మాగుంట సుబ్బరామరెడ్డి వర్ధంతి ఏర్పాట్లను శనివారం సాయంత్రం మాగుంట ప్రతినిధులు పరిశీలించారు. సోమవారం స్థానిక పీవీఆర్ గ్రౌండ్‌లో సుబ్బరామరెడ్డి వర్ధంతి నేపథ్యంలో అక్కడ భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా భారీగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందుకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి నిర్వాహకులకు పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్.లక్ష్మీనారాయణరెడ్డి, బెజవాడ సురేష్‌రెడ్డి, అయినాబత్తిన ఘనశ్యాం, తాతా ప్రసాద్, బెల్లం సత్యనారాయణ, ఆత్మకూరి బ్రహ్మయ్య, కుప్పా రంగసాయి, పాలపర్తి శీనారెడ్డి, కృష్ణారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న నాయకులు

మద్దిపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని అభివృద్ధి చేసి అధికారంలోకి తీసుకునిరావడమే లక్ష్యమని మాజీ ఎంపీ జేడీ.శీలం అన్నారు. శనివారం మద్దిపాడులో సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ రాష్ట్ర పీసీసీ ప్రెసిడెంట్ షారాద్ ఆహార్, పీసీసీ కార్యదర్శి గంటా అంజిబాబు, ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ ఇన్‌చార్జి పసుమర్తి సుధాకర్ పాల్గొని మట్లాడారు. ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్తంగా ఉందని, ప్రజలకు మంచి జరగాలంటే ఇందిరమ్మరాజ్యం రావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొణిజేటి గురుబాబు, నట్టే సుబ్బారావు, ఫులిపాటి రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్‌స్టార్‌ను ఏర్పాటు చేసిన క్రిస్టియన్లు

ఒంగోలు(రూరల్), నవంబరు29(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు రోడ్డులోని బృందావన్ గార్డెన్స్ కాలనీ రహదారిలో గల బేతస్త చర్చి దగ్గర శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ చైతన్య ప్రభు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

కొత్తపట్నం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదివి రాబోయే పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ అనిల్‌కుమార్ కోరారు. శనివారం మోటుమాల కస్తూర్బా బాలికల పాఠశాల, కొత్తపట్నంలో జడ్పీ హైస్కూలును ఆయన సందర్శించారు. కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో సంపూర్ణ ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కొత్తపట్నంలో స్టడీ అవర్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జీసీడీవో హేమలత, ఎంఈవో పద్మావతి, కోఆర్డినేటర్ జాలరత్నం, ఏఎంవో నాగేంద్రనాయక్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు అండగా ప్రభుత్వం

● ఎమ్మెల్యే దామచర్ల
● దివ్యాంగుల క్రీడా పోటీల ప్రారంభం



దివ్యాంగుల క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకుని శనివారం ఒంగోలులోని డీఆర్ఆర్ఎం స్కూలు నిర్వహించిన దివ్యాంగుల క్రీడా పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ దివ్యాంగులు వైకల్యాన్ని అధిగమించి జీవితంలో ముందుకు సాగేందుకు క్రీడలు ఉత్తమ మార్గమన్నారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. వైకల్యాన్ని అధిగమించి ముందుకు సాగాలన్నారు. అలాగే వివిధ రుణాల మంజూరు, అలాగే పెన్షన్లు అందిస్తూ ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనందిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పోటీలలో జిల్లావ్యాప్తంగా సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభను చాటారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, దివ్యాంగుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్.సువార్త, డీఈవో కిరణ్‌కుమార్, డీఎస్‌డీవో రాజేశ్వరి, పలువురు వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడల్లో విద్యార్థులు సత్తా చాటారు.

అల్పాహారం అందజేత

అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకుని ఒంగోలులోని డీఆర్ఆర్ఎం హైస్కూలులో జరిగిన క్రీడా పోటీల సందర్భంగా సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్పాహారం అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ, నిర్వాహకులు సర్దార్‌బాషా, షమనాజ్, మనవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మారెళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

రూ.50లక్షలతో మార్కెట్ కమిటీ భవన నిర్మాణాలు

● మద్దిపాడు ఏఎంసీ చైర్‌పర్సన్ రాజేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజేశ్వరి

సంతనూతలపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు మార్కెట్‌కమిటీ యార్డులో రూ.50లక్షలతో నూతన భవనాలు, యార్డు మరమ్మతులు చేపడుతున్నట్లు కమిటీ చైర్‌పర్సన్ మన్నం రాజేశ్వరి తెలిపారు. శనివారం సంతనూతలపాడులోని మద్దిపాడు ఏఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాలకవర్గసభ్యుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉప్పుగుండూరు యార్డు అభివృద్ధి కోసం తీర్మానించిన ప్రతిపాదనలను రాష్ట్ర మార్కెట్ కమిటీ కమిషనర్‌కు పంపనున్నట్లు చెప్పారు. అదేవిధంగా మార్కెట్ యార్డులో పశువుల సంత పునరుద్ధరణకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి మార్కెట్ కమిటీకి రూ.4.52కోట్లు లక్ష్యం కాగా నవంబరు నెల వరకు రూ.1.64కోట్లు సెస్సురూపంలో వచ్చినట్లు చెప్పారు. అదేవిధంగా మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడులోని మార్కెట్ కమిటీ స్థలాన్ని కోల్డ్‌స్టోరేజ్‌కు లీజ్‌కు ఇవ్వడానికి తీర్మానించినట్లు తెలిపారు. సభ్యుల ఫిర్యాదు మేరకు కమిటీ సమావేశానికి గైర్హాజరయ్యే సిబ్బందిపై చర్యలకు సిఫార్సు చేయనున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఏఎంసీ ఆదాయం పెంపునకు కృషిచేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్యదర్శి దానమ్మ, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ షేక్ ఖాజావలి, మన్నం ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పాడి పరిశ్రమతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

● ఎమ్మెల్యే దామచర్ల



రైతులకు దాణాను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు(రూరల్), నవంబరు29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పాడి పరిశ్రమతో ఆర్థికాభివృద్ధి సాధించాలని, ఇందుకోసం ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శనివారం ఒంగోలు నగరం కొప్పోలు గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం, పశువుల దాణా పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే దామచర్ల మెగా పశువైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అర్హులైన మహిళలకు పాడిపశువులను రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో కొనుగోలు చేసి ఇస్తుందని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులు బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేసిందని, ఇది వారికి కొంత ఉపశమనం కలిస్తుందని పేర్కొన్నారు. అనంతరం జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పశువులకు గర్భకోశవ్యాధులు రాకుండా వైద్యపరీక్షలు చేయించాలన్నారు. ఉచితంగా మందులు కూడా అందజేస్తామని చెప్పారు. మేలు జాతి దూడలతో పశుసంపదను వృద్ధి చేసుకోవాలని కోరారు. అనంతరం పశువులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. అలాగే 100 మంది రైతులకు పశువుల దాణాను 50శాతం సబ్సిడీతో ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు ఎన్.జగత్‌శ్రీనివాసులు, బి.మురళికృష్ణ, ఎన్.జయచంద్ర, కాట్రగడ్డ అనిల్, భరత్, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, టీడీపీ నాయకులు కొటారి నాగేశ్వరరావు, బండారు మదన్, కాట్రగడ్డ రఘు, నడిపినేని భాస్కర్, వడ్లమూడి మునీంద్ర, కాట్రగడ్డ వెంకట్రామయ్య, నీటి సంఘం అధ్యక్షుడు బత్తినేని కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త కనిపిస్తే పంచాయతీ అధికారిదే బాధ్యత

● డీపీవో వెంకటేశ్వరరావు



ఇలపావులూరులో మాట్లాడుతున్న డీపీవో వెంకటేశ్వరరావు

చీమకుర్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో రోడ్లపై చెత్త కనిపిస్తే పంచాయతీ డెవలెప్‌మెంట్ అధికారిదే బాధ్యతని డీపీవో ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇలపావులూరు గ్రామంలో శనివారం నిర్వహించిన స్వామిత్వ గ్రామసభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన డీపీవో మాట్లాడుతూ సర్వేపై వచ్చిన అభ్యంతరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. తన పర్యటనల్లో ఇలపావులూరు, శివరాంపురం, వెల్లంపల్లి గ్రామాల్లో ప్రధాన రహదారుల్లో చెత్త పేరుకుపోవటం, వీధిదీపాలు పగలు సైతం వెలగటం లాంటి లోపాలను గుర్తించినట్లు చెప్పారు. వాటిని వెంటనే సరిదిద్దుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవేంద్రరావు, శ్రీధర్‌రావు, సర్పంచ్ పులి రమణమ్మ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మద్దిపాడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీవో వెంకటేశ్వరరావు ఆదేశించారు. శనివారం వెల్లంపల్లిలో ఆయన పర్యటించి ఆయన అపరిశుభ్రంగా ఉన్న పేడదిబ్బలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శి మాధవిని ఆదేశించారు. సర్పంచ్, కార్యదర్శులు సమన్వయం చేసుకుని గ్రామ అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. నూరు శాతం పన్నులు వసూలు చేయాలని, ప్రతి శుక్రవారం పరిశుభ్రతకు కేటాయించాలని, దోమలు అభివృద్ధి చెంది అంటురోగాలు ప్రబలకుండా జాగ్రత్త పడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రఘుబాబు, సర్పంచ్ చిట్టిబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

● ఆర్టీఏ అధికారి భాస్కర్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియంత్రణ, వేగ పరిమితులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఆర్టీఏ అధికారులు జి.భాస్కర్, కె.జయప్రకాష్ సూచించారు. శనివారం ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రాఫిక్ నియంత్రణ- భద్రతపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. మద్యం సేవించి వాహనాన్ని నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల జరిగే అనార్థాలు, రాంగ్‌వే డ్రైవింగ్, అధిక వేగం, ఓవర్ టేకింగ్, లైసెన్స్ తీసుకునే విధానాలు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారు వివరించారు. విద్యార్థులు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే.మూర్తి, ఏవో ఎం.రమణబాబు, ట్రాన్స్‌పోర్టు కళాశాల ఇన్‌చార్జిలు ఏకాంబరం, రవీంద్ర, ఎర్రం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

నాగులుప్పలపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులను కాలరాసేలా తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ఉప్పుగుండూరు సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జి.బసవపున్నయ్య మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకొన్న 8 గంటల పని విధానాన్ని హరించే విధంగా 12 గంటలు పనిచేయాలని యాజమాన్యాలకు అనుకూలంగా లేబర్ కోడ్‌లను కేంద్రప్రభుత్వం తీసుకురావడం దుర్మార్గమైన చర్యన్నారు. అనంతరం జీవోలను దహనం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నలతోటి రామారావు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ప్రతి పౌరునికీ సమాన హక్కులు

ఒంగోలు(రూరల్), నవంబరు29(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ గౌరవప్రదంగా జీవించాలని, భారత ప్రభుత్వం ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిందని రూరల్ తహసీల్దార్ నాయబ్‌రసూల్ పేర్కొన్నారు. ఒంగోలు మండలం యరజర్ల ఎస్సీకాలనీలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులు అందరికీ సమానమని, ప్రతి పౌరుడు స్వేచ్ఛగా, గౌరవప్రదంగా జీవించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖరరావు, దేవదాయశాఖ ఈవో శ్రీనివాసరావు, ఎంపీటీసీ గుండపనేని శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి: బండ్లమూడి ఎస్సీకాలనీలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రజలందరూ చట్టం ముందు సమానులే అని చెప్పారు. సమావేశంలో సీఐ దాసరి ప్రసాద్, ఎంపీడీవో రాఘవేంద్ర, ఏవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



ఆటల పోటీలకు హాజరైన ఉపాధ్యాయులు

ఒంగోలు విద్య, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల మండల స్థాయి ఆటల పోటీలు శనివారం ఒంగోలులో ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను డీఈవో కిరణ్‌కుమార్, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డి.అనీల్‌కుమార్, ఎంఈవో టి.కిషోర్‌బాబులు ప్రారంభించారు. శనివారం ఉదయం పురుషుల విభాగంలో క్రికెట్ రెండు టీంలు, సాయంత్రం రెండు టీంలు పోటీలో పాల్గొన్నారు. మహిళా విభాగంలో త్రోబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఒంగోలు మండలంలోని 200 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడూ కరెంటు బిల్లులు చెల్లించవచ్చు : ఎస్ఈ

ఒంగోలు క్రైం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల కోసం ఆదివారం సెలవు అయినా కరెంటు బిల్లులు చెల్లించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు జిల్లాలోని అన్ని కౌంటర్లు తెరిచి ఉంటాయని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తుఫాన్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు క్రైం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ కారణంగా తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ మేరకు ఓ ప్రకటనలో తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. కొత్తపట్నం, మడనూరు, ఈతముక్కల, పాకల, ఊళ్ళపాలెం, కనపర్తి బీచ్‌లకు ప్రజలు వెళ్లవద్దన్నారు. సముద్రంలో అలలు తీవ్రత ఉందని, మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని పేర్కొన్నారు. అత్యవసరమైతే తప్ప తీర ప్రాంత ప్రజలు బయటకు రావద్దని, ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని కోరారు. అత్యవ సర పరిస్థితులు ఏర్పడితే వెంటనే 112 లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

నేడు సచివాలయ భవనం ప్రారంభం

ఒంగోలు(రూరల్), నవంబరు29(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం మండవవారిపాలెంలో ఆదివారం ఉదయం నూతనంగా నిర్మించిన రైతు సేవాకేంద్రం, సచివాలయ భవనం ప్రారంభించనున్నట్లు సర్పంచ్ మండవ వెంకటసుబ్బయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు.

శ్రీవారికి స్వర్ణపద్మపీఠం సమర్పణ



స్వర్ణ పద్మపీఠం సమర్పిస్తున్న దాతలు

ఒంగోలు కల్చరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీగిరిలోని శ్రీవేంకటేశ్వర స్వామికి భక్తులు స్వర్ణ పద్మపీఠాన్ని సమర్పించారు. ఒంగోలుకు చెందిన భాస్కరుని వెంకట అనిల్‌కుమార్, మొవ్వ శ్రీనివాస్, సింగరాయకొండకు చెందిన బత్తుల సుభాష్ చంద్ర, తిప్పారెడ్డి సంజీవరెడ్డి, తిరుమలరెడ్డిలు ఈ స్వర్ణ పద్మపీఠాన్ని శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారికి అందజేశారు. అనంతరం వారికి వేదపండితులు వేద ఆశీర్వదించారు. స్వర్ణ పద్మపీఠం సమర్పించిన దాతలకు ఆలయ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి, ధర్మకర్తలు సుశీలాదేవి, సీవీ.రామకృష్ణారావు, వెంకటేశ్వరరావు, లక్ష్మీకుమారి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కళామిత్రమండలి వార్షికోత్సవం

ఒంగోలు కల్చరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కళామిత్ర మండలి తెలుగులోగిలి వార్షికోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు శనివారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించే ఈ వేడుకలలో సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణకు నూనె వెంకాయమ్మ, వెంకటరత్నం జీవనసాఫల్య పురస్కారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా మండలి వెంకటకృష్ణారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా స్మారక ఉపన్యాసం జేడీ లక్ష్మీనారాయణ చేస్తారన్నారు. అవనిగడ్డ శాసనసభ్యులు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ తదితర రాజకీయ ప్రముఖులు, సాహిత్య ప్రముఖులు పాల్గొంటారన్నారు. సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రేపటి నుంచి భాగవత సప్తాహం

ఒంగోలు కల్చరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పద్యసారస్వత పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి శ్రీమద్భాగవత సప్తాహ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాగంటి శ్రీరామమూర్తి, పింగళి పూర్ణచంద్రరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు నగరం వీఐపీ రోడ్‌లోని పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ప్రతి రోజు సాయంత్రం 7 గంటల నుంచి ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. పద్యసారస్వత పరిషత్ కార్యవర్గ సభ్యులు ప్రవచనకర్తలుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కనుక సాహిత్య, ఆధ్యాత్మికవేత్తలు, అభిమానులు పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.

అమరావతి సమస్యలు పరిష్కరిస్తాం

(5వ పేజీ తరువాయి)

విచారణకు వస్తున్నాయన్నారు. అవి కూడా పరిష్కారమైతే డిసెంబరు 10న మిగిలిపోయిన భూమికి నోటిఫికేషన్ ఇచ్చి ఎల్‌పీఎస్ అమలు చేస్తామన్నారు. అప్పట్లో రైతులు ఇవ్వని భూముల్లో కూడా సీఆర్‌డీఏ ఎల్‌పీఎస్ లేఅవుట్లను రూపొందించి ప్లాట్ల కేటాయింపు జరిగిందన్నారు. వాళ్లంతా మూడు, నాలుగు నెలలు ఓపిక పడితే సమస్యని సానుకూలంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. లేదంటే సమీప గ్రామాల్లోని లేఅవుట్లలో లాటరీ వేసి ప్లాట్లు ఇస్తామన్నారు. కొంతమంది పెద్ద రైతులకు 10 వేల గజాల నుంచి 15 వేల గజాల ప్లాట్లు ఇవ్వాల్సి ఉందని, వారు కూడా కొంత ఓపిక పట్టాలన్నారు. లేదంటే వారికి ఇవ్వాల్సిన ప్లాటుని ఒకే ముక్కగా కాకుండా విభజించి ఇస్తామని చెప్పారు. అమరావతి రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో జరీబు, గ్రామ కంఠాల సమస్యలపై కలెక్టర్, తెనాలి సబ్ కలెక్టర్, తహసీల్దార్, వీఆర్‌వోలతో విచారణ జరిపించి నెలలో నివేదిక తెప్పించుకుని పరిష్కరిస్తామన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరుగుతుందని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి గ్రామ కంఠాల మినహాయింపు పొంది ఉంటే వాటిని రద్దు చేస్తామన్నారు.

నెలలో హెల్త్‌కార్డులు, పింఛన్లు

అమరావతి రైతులు 38 వేల మందికి గతంలోనే హెల్త్‌కార్డులు ఇవ్వగా వారిలో 10 వేల మంది లబ్ధి కూడా పొందారన్నారు. అయితే అప్పట్లో పిల్లలుగా ఉన్న 4 వేల మంది పెద్దవారు కాగా వారి పేర్లు చేర్చాలను ఆయా కార్డుల్లో చేర్చడంపై సానుకూలంగా ఉన్నామన్నారు. అలానే కొత్త పింఛన్లు, దివ్యాంగుల పింఛన్లు కూడా విచారణ జరిపి ఇస్తామన్నారు.

గుర్తింపుతోనే సరి

(5వ పేజీ తరువాయి)

ఆమోదం లభించిన తర్వాత నిర్మాణం చేపట్టాలి. అయితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో భవనాల నిర్మాణాలు ప్లాన్ ప్రకారం జరగడంలేదని తెలుస్తోంది. యథేచ్ఛగా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. మామూళ్ల వసూళ్లతోనే అక్రమ నిర్మాణాలను అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి. ఎవరైనా ఇల్లు కట్టుకుందామని పునాది వేస్తే టౌన్ ప్లానింగ్ సిబ్బంది క్షణాల్లో వాలిపోతారు. అనుమతులున్నాయా? లేదా అని పరిశీలించి, అనుమతులు లేకపోతే ఒక రేటు, ఉంటే మరో రేటు పెట్టి నిర్మాణదారుల నుంచి ముక్కు పిండి మామూళ్లు వసూలు చేస్తారు. అదే అపార్ట్‌మెంట్ అయితే రూ.లక్షల్లో అధికారులకు, ఆయా ప్రాంతాల నేతలకు చెల్లించుకోవాల్సిందే. అక్రమ నిర్మాణాల వివరాలు అధికారులకు తెలిసినా వాటిని పట్టించుకునే వారే లేరు. ఎప్పటికప్పుడు అక్రమ నిర్మాణాలను గుర్తిస్తున్నా.. వాటిపై చర్యలు ఉండటంలేదు. ఎందుకంటే మామూళ్లు తీసుకుని వాటికి అనుమతి ఇచ్చేది అధికారులే కావడమే కారణమని తెలుస్తోంది. ఈ కారణంగానే ప్రభుత్వం బీపీఎస్ ప్రకటిస్తున్నా.. దరఖాస్తులు వస్తున్నాయని సమాచారం. వైసీపీ ప్రభుత్వ కాలంలో అనుమతులతో పనిలేకుండా లెక్కలేకుండా ఇళ్లు కట్టేశారు. బహుళ అంతస్తుల భవనాలయితే సరేసరి. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా గత నిర్మాణాలు కొన్ని రోజులు కొనసాగాయి. తెనాలిలో అక్రమ నిర్మాణాలను ఆపాలని ఏకంగా మంత్రి మంత్రి మనోహర్ ఆదేశించినా తొలుత కఠినంగా వ్యవహరించిన అధికారులు ఆ తర్వాత పట్టించుకోలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

సా..గుతున్న లెక్కింపు..

అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చి రెండువారాలు అవుతున్నా ఇంకా లెక్క తేలలేదు. అనధికార, అక్రమ కట్టడాల లెక్కింపు ప్రక్రియ సా...గుతూనే ఉంది. ఆగస్టు వరకు నిర్మించిన భవనాలను మాత్రమే క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అనుమతి ఇస్తే, ఆ తర్వాత జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాలను కూడా వీటితోపాటే చూసేందుకు అధికారులే తాత్సారం చేస్తున్నారనే విమర్శ ఉంది. తెనాలిలో ఇప్పటి వరకు కేవలం 850 ఇళ్లనే గుర్తించడంపై విమర్శలు వస్తున్నాయి. పొన్నూరు పురపాలక సంఘంలో అనధికార కట్టడాలను గుర్తించి యజమానులతో దరఖాస్తు చేయించేందుకు అధికారులు సచివాలయాల వారీగా సర్వే చేపట్టారు. చిలకలూరిపేట మున్సిపాలిటీ పరిధిలో సుమారు 3 వేల వరకు అనధికార కట్టడాలు ఉన్నట్లు అధికారుల అంచనా. అయితే ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు కూడా మున్సిపాలిటీకి రాలేదు. వినుకొండలో బీపీఎస్‌కు కేవలం 10 దరఖాస్తులు అందాయి. నరసరావుపేటలో సూమరు 500 అపార్ట్‌మెంట్లు, ఇతర భవనాలను ఉండగా బీపీఎస్‌కు రెండు దరఖాస్తులు మాత్రమే దాఖలయ్యాయి.

అవీ..ఇవీ..

పట్టాలు దాటుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

● చీరాల రైల్వే స్టేషన్‌లో ఘటన

చీరాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రైలు పట్టాలు దాటుతూ గుర్తు తెలియని వ్యక్తి (50) మృతిచెందిన ఘటన స్టేషన్‌లో చోటుచేసుకొంది. సదరు వ్యక్తి నుంచి విఠల్‌నగర్ నగర్ వైపు వెళ్లేందుకు పట్టాలు దాటుతుండగా గూడ్స్‌రైల్ ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో ప్రయాణీకులు నివ్వెర పోయారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు స్థానికుడిగానే పోలీసులు భావిస్తున్నారు.

రైలు నుండి జారిపడి అస్సాం వాసి మృతి

రైలు నుండి జారిపడి అస్సాం వాసి మృతిచెందిన ఘటన కడవకుదరు గ్రామ సమీపంలో చోటుచేసుకొంది. అస్సాం రాష్ట్రం బిశ్వనాథ్ జిల్లాకు చెందిన వీరునాయక్(35) మరో పదిమంది సహచరులతో కోయంబత్తూర్‌లో పనిచేసేందుకు వెళుతున్నాడు. మెట్లు వద్ద కూర్చుని నిద్రలో జారిపడి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు తెలిపారు. మృతుని వివరాలు గుర్తించి శనివారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఆయన భార్య టెరీనాయక్ సుమారు ఐదేళ్ల క్రితం అనారోగంతో మృతి చెందింది. పురిట్లోనే కుమారుడు మృత్యువాత పడ్డాడు. తల్లిదండ్రులు కూడా లేకపోవడంతో మృతదేహాన్ని సమీప బంధువులకు అప్పగించారు.

తల్లిచెంతకు బాలిక

● ఇంటి నుంచి బయటకు వచ్చిన బాలిక

● గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

మార్టూరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): ఇంటిలో అమ్మ కోపగించుకొందని ఇంటి నుంచి బయటకు వచ్చిన బాలికను పోలీసులు గుర్తించి, అరగంట వ్యవధిలో తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన శనివారం సాయంత్రం మార్టూరు లో చోటుచేసుకొంది. బల్లికురవ మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామానికి చెందిన బాలిక బల్లికురవ జడ్‌పి హైస్కూల్ లో 9 వతరగతి చదువుతోంది. అయితే అమ్మ తిట్టిందనే కారణంతో ఇంటి నుంచి బయటకు వచ్చింది. నాగరాజుపల్లి కూడలిలో ఒంటరిగా నిలబడి ఏదో ఒక బస్సు ఎక్కడానికి ప్రయత్నించింది. అయితే అదే సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ సైదా, ఏఎస్ఐ ఎస్‌కె మహబూబ్‌బాషాలు బాలికను గమనించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంటనే బాలిక తల్లిని పిలిపించి బాలికను ఆ మెకు అప్పగించారు. తరువాత మహిళా కానిస్టేబుల్ అనిత తల్లికుమార్తెలను దగ్గరుండి ఆర్టీసీ బస్సులో నక్కబొక్కలపాడు గ్రామానికి పంపించారు.

273 మందికి వైద్య పరీక్షలు



రోగులకు పరీక్షిస్తున్న వైద్యుడు

చినగంజాం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోటుపల్లి గ్రామంలోని సచివాలయ ఆవరణలో ఒంగోలు కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామసర్పంచ్ వడ్లమూడి సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించినట్లు వైద్యశాల మార్కెటింగ్ ఎగ్జిక్యూటవ్ షేక్ రఫీ తెలిపారు. ఈ శిబిరంలో పలు వ్యాధులకు సంబంధించి 273 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 50 మందిని ఒంగోలు కిమ్స్ వైద్యశాలకు రిఫర్ చేసినట్లు తెలిపారు. వైద్యశాలలో ఆరోగ్యశ్రీ, ఈఎస్ఐ, ఈసిహెచ్ఎస్, రైల్వే, ఎఫ్‌సీఐ కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తామన్నారు. అప్తమాట్రిక్స్ సాగర్ కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, గుండె, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వైద్య సిబ్బంది తగు జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో హాస్పిటల్ డాక్టర్ రామాంజనేయులు, గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు ప్రత్యేక కౌంటర్లు

అద్దంకి, నవంబరు29(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులను చెల్లించేందుకు ఆదివారం అద్దంకి, మార్టూరులలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలలో ఆదివారం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. ఆదివారం సెలవుదినం అయినప్పటికీ, నెల చివరి రోజు కావడంతో వినియోగదారులు బిల్లులు చెల్లింపునకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేర ప్రవృత్తిని విడనాడండి

● రూరల్ సీఐ శేషగిరిరావు



పాత నేరస్థులకు కౌన్సిలింగ్ చేస్తున్న సీఐ శేషగిరిరావు

చీరాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పాత నేరస్థులు ప్రవృత్తిని మార్చుకోకుంటే శిక్షలు తప్పవని రూరల్ సీఐ శేషగిరిరావు అన్నారు. శనివారం రూరల్ సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లకు ఎస్సైలు చంద్రశేఖర్, జనార్ధన్‌లతో కలిసి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇటీవల కాలంలో కేసులకు సంబంధించి వారి పాత్రలపై ఆరా తీశారు. ఎప్పటికప్పుడు వారి జీవనశైలిపై నిఘా ఉంచినట్లు సూచించారు. సత్ప్రవర్తన కలిగి కుటుంబాలతో సంతోషంగా గడపాలని, భిన్నంగా వ్యవహరిస్తే జైలు జీవితం తప్పదని హెచ్చరించారు.

సేవా కార్యక్రమాలతో సంపూర్ణ ఆనందం

చీరాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత సమయంలో ఇతరులకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం వలన సంపూర్ణ ఆనందం ఉంటుందని పలువురు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. వాకర్స్ మాజీ అధ్యక్షులు అమరా వీరాంజనేయులు పెళ్లిరోజు కావడంతో శనివారం స్థానిక కోటయ్య ఆశ్రమం, చైతన్య మనోవికాస కేంద్రాలకు బియ్యం అందజేశారు. అలాగే శ్రీకృష్ణ గోశాలకు నగదు ఆర్థిక సాయం చేశారు. దీంతో వాకర్స్ ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.

ముప్పవరంలో టైర్ల దుకాణంలో టైర్లు దగ్ధం

● లక్షన్నర రూపాయల ఆస్తి నష్టం



దగ్ధమవుతున్న టైర్లు

పంగులూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం గ్రామంలో 16వ నెంబరు జాతీయ రహదారి పక్కన ఉన్న టైర్ల దుకాణంలో శనివారం రాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అందిన సమాచారం గ్రామానికి చెందిన యర్రంశెట్టి రామాంజనేయులుకు చెందిన టైర్ల దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గుర్తించిన స్థానిక యువకులు మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తూ అద్దంకి ఫైర్ స్టేషన్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ముప్పవరం చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు అదుపులోకి తెచ్చారు. అప్పటికే దుకాణంలో ఉన్న టైర్లు మంటల్లో దగ్ధమయ్యాయి. లక్షన్నర రూపాయల వరకు ఆస్తినష్టం ఉంటుందని భావిస్తున్నారు.

సాగర్ కాలువలో చేపట్టాల్సిన పనులపై సమీక్ష

నాగార్జునసాగర్ కుడికాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ చక్రపాణి



మాట్లాడుతున్న నాగార్జునసాగర్ కుడికాలువ ప్రాజెక్ట్ కమిటి వైస్ చైర్మన్ చక్రపాణి

మార్టూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువల పరిధిలో వచ్చే వేసవిలో చేపట్టాల్సిన పనులు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని నాగార్జునసాగర్ కుడికాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి సూచించారు. శనివారం కోనంకిలోని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, ఎన్ఎస్‌పీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ పరిధిలో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ తదితర పనులు నిమిత్తం రూ.6 కోట్లతో అంచనాలును తయారుచేసి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపిస్తున్నామన్నారు. ఇంకా ఏమైనా కాలువలో చేపట్టాల్సిన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకు పోతామన్నారు. రైతులందరికీ ఉపయోగపడే విధంగా కాలువ అభివృద్ధి పనులు చేయడంపై అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమానికి కార్యక్రమంలో ద్రోణాదుల, ఇంకొల్లు, పర్చూరు సాగునీటి సంఘాల అధ్యక్షులు కే.దిలీప్, శ్రీనివాసరావు, మురళీ కృష్ణ, డీసీ తాటి ఆంజనేయస్వామి, పర్చూరు ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, టీడీపీ మండల అధ్యక్షులు తాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిరుపేదకు అందిన సాయం



నిత్యావసరాలను అందజేస్తున్న ఎస్సై

నూతలపాడు(పర్చూరు), నవంబరు 29 : పర్చూరు మండల పరిధిలోని కురప్పాలేనికి ఓ వృద్ధ మహిళకు టీడీపీ యువనేత నూతలపాడు పీఏసీఎస్ చైర్మన్ విన్నకోట సతీష్ ఇంటి నిర్మాణం కోసం రూ.లక్ష సాయం అందించారు. సదరు మహిళ ఎమ్మెల్యేకు తన పరిస్థితిని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు వివరించగా, ఎమ్మెల్యే సూచన మేరకు పీ4 పథకంలో భాగంగా సతష్ స్పందించారు. అదే విధంగా మరో కుటుంబానికి రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. శనివారం ఎస్సై జీవీ.చౌదరి, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్.షంషుద్దీన్, సొసైటీ డైరెక్టర్ శేఖర్, స్థానిక నేతల సారథ్యంలో రిబ్బన్ కట్‌చేసి గృహప్రవేశం చేశారు. అనంతరం ఎస్సై చేతుల మీదుగా నిత్యవసర సరుకులు అందజేశారు.

ఒకేషనల్ విద్యలో విద్యార్థులకు శిక్షణ

కొండమంజూరు విద్యార్థుల ఫీల్డ్ విజిట్



బిల్డింగ్‌ను పరిశీలిస్తున్న విద్యార్థినులు

పంగులూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒకేషనల్ విద్యనభ్యసిస్తున్న కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్ శనివారం అద్దంకిలో నిర్వహించారు. 9, 10 తరగతుల విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా అద్దంకిలోని శ్రీ షిరిడిసాయి షాపింగ్‌మాల్, శివప్రియ ఆటోమోటివ్స్‌ను సందర్శించారు. రిటైల్ ట్రేడ్‌లో బిల్లింగ్, బార్‌కోడ్ స్కానింగ్‌తో పాటు వినియోగదారునితో మెలిగే పద్ధతులు, నగదు సేకరణ విధులు, అమ్మకాల గురించి షాపు నిర్వాహకులు నాగసూరి హనుమాన్ వెంకటశివప్రసాద్, విశ్రాంత ట్రైనర్ భావని ప్రసాద్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆటోమోటివ్ ట్రేడ్‌లో టూవీలర్ స్పేర్ పార్ట్స్, సేల్స్, వెహికల్ రిజిస్ట్రేషన్, వెహికల్ సర్వీస్ గురించి దుకాణం నిర్వాహకులు బ్రహ్మయ్య, ఆటోమోటివ్ ట్రైనర్ రవీంద్రలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇండస్ట్రియల్ విజిట్‌లో విద్యార్థులు ప్రాక్టికల్‌గా అనుభవం గడించేందుకు సహకరించిన శివప్రియ ఆటోమోటివ్స్ యజమాని బ్రహ్మయ్య, శ్రీ షిరిడిసాయి షాపింగ్‌మాల్ యజమాని నాగసూరి వెంకట హనుమాన్ శివప్రసాద్‌లకు హెచ్ఎం ఎం.అనిత, రిటైల్ ట్రైనర్ గంగాభవాని ప్రసాద్, ఆటోమోటివ్ ట్రైనర్ రవీంద్రలు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను అడ్డుకున్న రైతులు

పరిహారం చెల్లించక పోవడంపై ఆగ్రహం



రోడ్డు అడ్డంగా గొయ్యి తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

అద్దంకి, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): పరిహారం చెల్లించకుండానే గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు చేస్తుండటంతో కొటికలపూడి గ్రామస్థులు ఆగ్రహించారు. విజయవాడ-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా అద్దంకి మండలంలోని కొటికలపూడి రెవెన్యూ పరిధిలో కోదండరామస్వామి దేవాలయానికి చెందిన భూమితో పాటు మరి కొందరు రైతులకు సంబంధించిన భూమికి పరిహారం చెల్లించాల్సి ఉంది. దీంతో గ్రామస్థులు, రైతులు పలుమార్లు ప్రశ్నించినా, ఏదో ఒక సాకు చెప్తూ పరిహా రం చెల్లింపులో ఆలస్యం చేస్తున్నారు. అయితే రోడ్డు నిర్మాణ పనులు యథావిధిగా చేస్తునే ఉన్నారు. ఆగ్రహించిన కొటికలపూడి గ్రామస్థులు, భూమి కోల్పోతున్న రైతులు శనివారం తమ పొలం వద్ద వేసిన రోడ్డును ఎక్స్‌కవేటర్ సహాయంతో తవ్వించి గాడి తీయించారు. తమకు పరిహారం చెల్లించే వరకు పనులు చేయనివ్వమని తేల్చి చెప్పారు. దీంతో ఆ ప్రాంతంలో రోడ్డు నిర్మాణ సంస్థ ప్రతినిధులు తాత్కాలికంగా పనులు నిలిపివేశారు.

మహిళా ఉపాధ్యాయినుల త్రోబాల్ జట్టు ఎంపిక



త్రోబాల్ జట్టు ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న హెచ్ఎం

పంగులూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల మహిళా ఉపాధ్యాయినుల త్రోబాల్ జట్టు ఎంపిక శనివారం నిర్వహించారు. పంగులూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల త్రోబాల్ జట్టు ఎంపిక కార్యక్రమాన్ని హెచ్ఎం సోమేపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ జట్టుకు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఐ.అనిత, పద్మావతి (ఎస్.ఎ.గణితం), జి.ఆదిలక్ష్మి (ఎస్‌జీటీ), ఎ.కాంతికళ(ఎస్‌జీటీ) కొండమంజులూరు, బి.అనిత(ఎస్ఏ, గణితం), సీహెచ్.పద్మావతి (ఎస్ఏ బయాలజి) తూర్పుకొప్పెరపాడు, సీహెచ్. కృష్ణవేణి(ఎస్‌జీటీ) జనకవరం, షేక్‌మీరాబీ (ఎస్‌జీటీ) ముప్పవరం, ఇ.స్వర్ణలత(ఎస్‌జీటీ), బైటమంజులూరు, కొండా ప్రతిమ(ఎస్ఏపీడీ) చందలూరు, ఎ.అంజమ్మ(ఎస్ఏ తెలుగు), షేక్ జలీనాబేగం (ఎస్ఏ హిందీ) కోటపాడు, రాధారాణి (ఎస్‌జీటీ) పంగులూరు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.ప్రతిమ, మండల సమన్వయకర్త ఏ.హనుమయ్య తెలిపారు. ఈ జట్టు డివిజన్ స్థాయిలో జరిగే ఉపాధ్యాయినుల త్రోబాల్ పోటీలో పాల్గొంటుందన్నారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

ఇంకొల్లు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు మండల స్థాయిలో ఆటల పోటీలు నిర్వహించారు. పురుషులకు క్రికెట్ పోటీలు నిర్వహించగా, స్త్రీలకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలైన టీంను డివిజన్ స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారు. కార్యక్రమంలో ఎంఈవో ఏ.శ్రీనివాసరావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

నాగులుప్పలపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థునుల తమ ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చీరాల నాగ రత్నం వైద్యశాల డాక్టర్ అంజలి సూచించారు. ఉప్పుగుండూరులోని ఆర్‌వీవీ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాల ని చెప్పారు. డైరెక్టర్లు కిషోర్, నరేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు



ఏఐసీసీ అబ్జర్వర్ శరత్ అహేర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆమంచి కృష్ణమోహన్

అద్దంకి, నవంబరు29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వస్తే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏఐసీసీ అబ్జర్వర్ శరత్ అహేర్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ అద్దంకి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్ అహేర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. అందరి సలహాలు, సూచనలతో జిల్లా అధ్యక్షుడి ఎన్నిక చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో అద్దంకి నియోజకవర్గ కన్వీనర్ అడుసుమల్లి కిషోర్‌బాబు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చీరాల : ఏఐసీసీ పరిశీలకులు శారద్ అహర్‌ను ఆమంచి కృష్ణ మోహన్ స్థానిక ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం పేరాల పద్మశాలి కల్యాణ మండపంలో 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈక్రమం లో శనివారం చీరాలకు చేరుకున్న పరిశీలకులను ఆమంచి కలిశారు. అలాగే కార్యక్రమానికి సంబంధించి సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మార్పు గ్రెగోరీ, జడ్పీటీసీ ఆకురాతి పద్మినీ, కనపర్తి బాబ్జీ, డేవిడ్, బాబు, ఇస్సాక్, శ్రీకాంత్, దేటా దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

కుందేరు వాగు ఆధునికీకరణకు చర్యలు

● చీరాల - బాపట్ల కుందేరు వాగును పరిశీలించిన కలెక్టర్ వినోద్‌కుమార్



వాగును పరిశీలిస్తున్న కలెక్టర్

చీరాల, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి) : పారుదల సక్రమంగా ఉండే లా చీరాల-బాపట్ల మధ్య ఉన్న కుందేరు వాగు ఆధునీకరించాలని కలెక్టర్ డా.వినోద్‌కుమార్ పేర్కొన్నా రు. శనివారం రాత్రి ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడితో కలిసి కుందేరును పరిశీలించారు. తుఫాన్ ప్రభావాలతో వాగుల్లో పారుదల లేక పంటపొలాల్లోకి నీరు చేరుతున్నట్లు చెప్పారు. అంతిమంగా రైతులు నష్టపోవడంపై మాట్లాడారు. ఇప్పటికే మొంథా తుఫాన్ ప్రభావంతో తీవ్రనష్టం వాటిల్లినట్లు వివరించారు. తిరిగి మరో తుఫాన్‌తో ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. కుందేరులో గుర్రపు డెక్క తొలగించి పారుదల సక్రమంగా ఉండే లా జాగ్రత్తలు చేపట్టాలని జలవనరుల అధికారులకు సూచించారు. మత్స్యకారులు కూడా వేటకు వెళ్లరాదని చెప్పారు. అలాగే విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రవాహం తగ్గిన తరువాత పూర్తిస్థాయిలో డ్రెయినేజీ పనులు చేపట్టాలని సూచించారు. తహసీల్దార్ గోపీకృష్ణ తదతరులు ఉన్నారు.

కేఆర్‌కేలో రేపటి నుంచి ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

అద్దంకిటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్-2 విభాగం విద్యార్థులతో స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎన్. షర్మిలరాణి తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అనుమతితో డిసెంబరు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు దత్తత గ్రామం శింగరకొండపాలెంలో జాతీయ సేవా శిబిరం నిర్వహిస్తున్నట్లు, ఈ శిబిరానికి చైర్మన్‌గా కళాశాల ప్రిన్సిపాల్ వ్యహరిస్తారన్నారు. గ్రామంలో వారంరోజుల పాటు రోజుకు ఒక్కొక్క కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి రోజు నీటి సంరక్షణపై అ వగాహన కార్యక్రమం, మాదకద్రవ్యాల నివారణ, ఆరోగ్యం-పరిశుభ్రత, వైద్య శిబిరం, రోడ్డు భద్రత, స్వచ్ఛ భారత్- వ్యర్థాల యాజమాన్యంపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. చివరి 7 రోజున మొక్కలు నాటే కార్యక్రమం, ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్ష కోసం మాదిరి ప్రశ్నాపత్రాల పంపిణీ

పంగులూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 7న నిర్వహించే నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్‌షిప్ పోటీ పరీక్షకు సంబంధించిన మాదిరి ప్రశ్నా పత్రాలు, ఓఎంఆర్ షీట్లను అజిత్ ట్రస్ట్ చైర్మన్ వి.వీరనారాయణ శనివారం పలు పాఠశాలలకు అందజేశారు. పోటీ పరీక్షకు హజరయ్యే విద్యార్థులకు ముందస్తు అవగాహన కోసం ట్రస్ట్ చైర్మన్ వీరనారాయణ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో రూపొందించిన మాదిరి ప్రశ్నాపత్రాలను పలు పాఠశాల హెచ్ఎంలకు అందజేశారు. పంగులూరు మండలంతో పాటు ఎనిమిది మండలాలలోని 35 పాఠశాలల నుంచి పరీక్షకు హాజరవుతున్న 500ల మంది 8వ తరగతి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా మాదిరి ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లు సమకూర్చారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పోటీ పరీక్షకు సంసిద్ధులను చేసేందుకు ఉపకరించే మాదిరి ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లు సమకూర్చిన ట్రస్ట్ చైర్మన్ వీరనారాయణకు పాఠశాలల హెచ్ఎంలు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అద్దంకి, నవంబరు29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో గుండ్లకమ్మ రిజర్వాయర్ పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ సుబ్బరాజు తెలిపారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో పాటు గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలు అ ప్రమత్తంగా ఉండాలన్నారు. ఇబ్బందులు ఎదురైతే వెంటనే సమాచారం అందించాలన్నారు.

రేపటి నుంచి క్రిస్మస్ క్యారల్స్

చినగంజాం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని డిసెంబరు 1వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ప్రతి రోజు క్రిస్మస్ క్యారల్స్ ర్యాలీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మేకల మేషక్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని అంబేద్కర్‌నగర్‌లో సోమవారం తెల్లవారుజాము 4 గంటల నుంచి 6గంటల వరకు ప్రతి రోజు క్రిస్మస్ క్యారల్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యారల్స్ ర్యాలీలో సండే స్కూల్ చిన్నారులు, యువతి యువకులు, పెద్దలు పాల్గొనాలని కోరారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు : డీఎస్పీ



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రౌడీషీ టర్లు నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎ స్పీ ఆర్.శ్రీనివాసరావు హె చ్చరించారు. శనివారం ఒంగోలు టూటౌన్ పోలీస్‌స్టేష న్ వద్ద రౌడీషీటర్లకు కౌన్సిలి ంగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడినా, చ ట్టాన్ని అతిక్రమించి దౌర్జన్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చ రించారు. సత్ప్రవర్తన ఒక్కటే మార్గమన్నారు. బైండోవర్ నిబంధనలు ఉల్లం ఘించి గొడవలు, అల్లర్లు చేసే వారి ఆస్తులు జప్తీ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ సాంబశివయ్య, ఫిరోజ్, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతించిన మేరకే పొగాకు సాగు చేయాలి



పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న ఆర్ఎం రామారావు

కొండపి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రైతులు బోర్డు అనుతించిన విస్తీర్ణం మేరకే పొగాకు సాగు చేయా లని ఒంగోలు ఆర్ఎం శీలం రామారావు సూచించారు. పంట నాణ్యతకు అనుగుణంగా ధరలు ఇప్పించేందు కు బోర్డు కృషి చేస్తుందని చెప్పారు. శనివారం ఆయన స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోళ్లను పరిశీలించారు. వ్యాపారులు, రైతులతో మాట్లాడారు. సిబ్బందితో స మీక్ష నిర్వహించారు. రైతుల సమస్యల పరిష్కారానికి పారదర్శకంగా, జవాబు దారీతనంతో పనిచేయాలని ఈ సందర్భంగా సిబ్బందికి సూచించారు. రైతులు అధిక రేట్లకు పొలాలు, బ్యారన్లు కౌలుకు తీసుకుని నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్, చతుకుపాడు, గుర్ర ప్పడియ, నరసరాజుపాలెం, కె.అగ్రహారం గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రూ.కోటి అవినీతి ఎలా సాధ్యం : వైసీపీ

సంతనూతలపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని సిండికేట్ రైతు సొసైటీ భవన నిర్మాణానికి అయిన ఖర్చు రూ.98లక్షలు కాగా అందులో కోటిరూపాయలు అవినీతి ఎలా సాధ్యమని సొసైటీ మాజీ అధ్యక్షులు దుంపా యలమందారెడ్డి, మాదాల వెంకట్రావు, వైసీపీ మండల కన్వీనర్ దుం పా చెంచిరెడ్డి ఆరోపించారు. శనివారం సంతనూతలపాడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత వైసీపీ పాలనపై అసత్య ప్ర చారం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ డైరెక్టర్లు మోహన్ రావు, కోటేశ్వరరావు, హరిబాబు పాల్గొన్నారు.

రైతుల వివరాలను నమోదు చేయాలి

సంతనూతలపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రైతన్నా మీకోసం కార్యక్ర మంలో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న రైతు కుటుంబాల సర్వేలో రైతుల వి వరాలను ఏపీఎయిమ్స్ యాప్‌లో నమోదు చేయాలని డీఏవో ఎస్.శ్రీనివా సరావు ఆదేశించారు. మంగమూరులో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు బి.రమేష్‌బాబు, ఏవో పావని, టీడీపీ మండల అధ్యక్షుడు హరిబాబు, నీటిసంఘం అధ్యక్షుడు నల్లూరి క్రిష్టారావు, నా యకులు అబ్బూరి శ్రీనివాసరావు, నల్లూరి నారాయణరావు పాల్గొన్నారు.

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 30 నవంబరు 2025

కలువాయిని తిరుపతి జిల్లాలో కలపొద్దు

- గ్రామస్థులు, విద్యార్థుల భారీ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న గ్రామస్థులు, విద్యార్థులు తదితరులు

కలువాయి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో కలువాయి మండలాన్ని కలపొద్దంటూ శనివారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దారు వీవీ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు, యువత పెద్దఎత్తున స్వచ్ఛందంగా తరలి వచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. ముందుగా అందరూ బస్టాండుకు చేరుకుని మనవహారంగా ఏర్పడి అక్కడి నుంచి తిరుపతి జిల్లా వద్దు... నెల్లూరు జిల్లా ముద్దు అంటూ నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్నారు. కలువాయి మండలాన్ని గూడూరు రెవెన్యూ డివిజన్, తిరుపతి జిల్లాలోకి తీసుకెళుతూ తీసుకున్న నిర్ణయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా తిరుపతిలో కలపడం ఎంతవరకు న్యాయం అని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని నెల్లూరు జిల్లాలోనే కలువాయిని ఉంచాలని విజ్ఞప్తి చేశారు. కాగా, భారీ ర్యాలీ కారణంగా సుమారు గంట పాటు ట్రాఫిక్ స్తంభించింది.

7న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

నెల్లూరు(విద్య), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరానికి(2025-26) సంబంధించి జాతీయ ఉపకారవేతనం పరీక్ష (ఎన్ఎంఎంఎస్)ను డిసెంబరు 7న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈవో డాక్టర్ బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 18 కేంద్రాల్లో 3,685 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల హాల్ టికెట్లు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు డాట్ బీఎస్ఈ డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో, స్కూల్ లాగిన్‌లో, మనమిత్ర వాట్సాప్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాల యూడైస్ కోడ్‌ను ఉపయోగించి విద్యార్థుల హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని అందచేయాలని ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల బాలుర విజేత నెల్లూరు
వివరాలు 8లో

కొయ్య కొరత.. తీరనుందిక!



చెక్కనగిషీ కేంద్రంలో వస్తువులు తయారు చేస్తున్న కళాకారులు

- ఉదయగిరి చెక్కనగిషీ కేంద్రానికి ఊతం
- ఉడ్ బ్యాంకు ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు
- ఇటీవల పరిశీలించిన అధికారుల బృందం
- త్వరలో ఉడ్ బ్యాంక్ ఏర్పాటుకు సన్నాహాలు

ఉదయగిరిలో రూపుదిద్దుకుంటున్న చెక్క నగిషీ వస్తువులు రాష్ట్ర, దేశస్థాయిలో గుర్తింపు పొందాయి. ఎందరో ప్రముఖులను మెప్పించిన ఈ వస్తువుల ఉత్పత్తి నానాటికి పడిపోతోంది. ఇందుకు ప్రధాన కారణం అవసరమైన కర్ర లభ్యత లేకపోవడమే. అధిక ధరకు కర్ర కొనుగోలు చేసినా అంత ధరకు వస్తువులు విక్రయించుకోలేక కళాకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం కళాకారులకు అవసరమైన కర్రను సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టింది. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఉదయగిరిలో ఉడ్ బ్యాంకు ఏర్పాటుకు ముమ్మరంగా సన్నాహాలు జరుగుతున్నాయి.



కళాకారులు వాడే కర్ర కొలతలు సేకరిస్తున్న అధికారులు

ఉదయగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉదయగిరిలోని చెక్కనగిషీ కేంద్రంలో 400 మంది మహిళా కొయ్య కళాకారులు ఉన్నారు. దశాబ్దాల కాలంగా వీరంతా కొయ్యతో చెక్కనగిషీ వస్తువులు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. సుమారు 150 రకాల వస్తువులను తమ స్వహస్తాలతో అందంగా తీర్చిదిద్దుతారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయంగా నిర్వహించే ఎగ్జిబిషన్లలో వస్తువులను విక్రయించి ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నారు. ప్రధానంగా కొయ్య వస్తువుల తయారీకి కలివి, నెర్ధి, బిల్లనెర్ధి, వేప కర్రను వినియోగిస్తున్నారు. వాటిని రిజర్వు ఫారెస్టు, రైతుల పొలాల నుంచి సేకరిస్తారు. అయితే వాటిల్లో కలివి, బిల్లనెర్ధి అంతరించిపోగా వేప కర్ర స్థానికంగా దొరుకుతున్నా నెర్ధి కర్ర కోసం రిజర్వు ఫారెస్టులోని దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో కర్ర తెచ్చే కూలీలు వాటి ధరలను పెంచడం, తయారు చేసిన వస్తువులు ధర పలకకపోవడంతో చాలా మంది కళాకారులు పనికి దూరంగా ఉన్నారు. ఇలాంటి పరిస్థితులను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం ఉడ్ బ్యాంకు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది.

- అధికారుల బృందం పరిశీలన

చెక్కనగిషీ కేంద్రంలో కొయ్య కళాకారులు చేస్తున్న వస్తువులు, కర్ర కోసం వారు పడుతున్న ఇబ్బందులను నేరుగా తెలుసుకునేందుకు ఇటీవల విశ్రాంత సీసీఎఫ్ జేఎస్ఎన్ మూర్తి, జిల్లా అటవీ శాఖాధికారి మహబూబ్ బాషాల ఆధ్వర్యంలో అధికారుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన చేసింది. ఏ ఏ జాతుల కర్రతో చెక్కనగిషీ వస్తువులు తయారవుతున్నాయి.. ఎంత ధరకు కొనుగోలు చేస్తున్నారు.. ఏడాదికి ఎంత కర్ర అవసరమవుతుంది.. ప్రభుత్వం అందించాలిసన సహాయ సహకారాలు ఏంటి!? తదితర విషయాలను కళాకారులను అడిగి తెలుసుకున్నారు. కళాకారులు వాడుతున్న కర్ర కొలతలు సేకరించారు. దీంతోపాటు అడవుల్లో ఆయా జాతులు అంతరించకుండా అటవీ శాఖ ద్వారా ఉడ్ బ్యాంకు ఏర్పాటు చేసి ఆయా జాతుల మొక్కలను పెంచి వారికి సబ్సిడీపై కర్రను సరఫరా చేసేలా సమగ్ర వివరాలు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలో ప్రభుత్వం ఉడ్ బ్యాంకుల ఏర్పాటుకు చర్యలు చేపట్టనుంది.



- ఉడ్‌బ్యాంకు ఇలా..

వస్తు తయారీకి అవసరమైన జాతుల కర్రను స్థానికంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో పెంచనున్నారు. లేదా లేదా రిజర్వు ఫారెస్ట్‌లోని కర్రను తెచ్చి స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో నిల్వ ఉంచుతారు. ఇక్కడ నుంచి కళాకారులకు అవసరమైన కర్రను తక్కువ ధరకే విక్రయించేలా చర్యలు చేపట్టనున్నారు.

కళకు కొత్త ఊపిరినిచ్చింది



తమ చెక్కనగిషీ కేంద్రంలో కొయ్యతో 150 రకాల వస్తువులు తయారు చేస్తున్నాం. అయితే కొన్నేళ్లుగా అవసరమైన కర్ర లభ్యత కాకపోవడం, అరకొరగా దొరికినా ధర ఎక్కువగా ఉండడంతో అవస్థలు పడుతున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉడ్ బ్యాంకుల ఏర్పాటు చేసి కర్ర సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టడం కళకు కొత్త ఊపిరి ఇచ్చినట్లయ్యింది.

- షేక్ గౌసియాబేగం,
కేంద్రం నిర్వాహకురాలు, ఉదయగిరి

ఉడ్ బ్యాంకు ఏర్పాటుకు చర్యలు



చెక్కనగిషీ వస్తువుల తయారీకి కర్ర కొరతతో కళాకారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఉడ్ బ్యాంకు ఏర్పాటు చేసి కర్ర పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతోంది. ఇటీవల చెక్కనగిషీ కేంద్రాన్ని అధికారులతో కలిసి పరిశీలించి, ఇబ్బందులు గుర్తించాం. ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. వారి ఆదేశాలతో త్వరలో ఉడ్ బ్యాంకు ఏర్పాటుకు శ్రీకారం చుడుతోంది.

- కే.మహబూబ్‌బాషా,
జిల్లా అటవీ శాఖాధికారి, నెల్లూరు

ముంచుకొస్తున్న 'దిత్వా'

- వాయుగుండంగా మారి జిల్లాపై ప్రభావం
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం



సోమశిల నుంచి డెల్టాకు వదిలిన నీరు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : శ్రీలంకను అతలాకుతలం చేసిన దిత్వా తుఫాను రాష్ట్రం వైపుగా కదులుతోంది. దీని ప్రభావంతో శనివారం జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. నెల్లూరులో సాయంత్రం వర్షం దంచి కొట్టింది. రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆది, సోమవారాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. కాగా జిల్లాలో శనివారం సగటు వర్షపాతం 2 మి.మీ.గా నమోదైంది. అత్యధికంగా కోవూరులో 11.4 మి.మీ. అత్యల్పంగా కలువాయిలో ఒక మి.మీ వర్షపాతం నమోదైంది.

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : జేసీ

దిత్వా తుఫాను వాయుగుండగా బలపడే అవకాశం ఉందని జేసీ మొగిలి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. లోతట్టు, తీరప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదన్నారు. నీటిపారుదల, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, ఆర్అండ్‌బీ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

భారీ వర్షాల్లో ప్రజలకు అత్యవసరమైన సేవలు అందించేందుకు కలెక్టరేట్‌లో 0861-2331261, 7995576699 నంబర్లతో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని జేసీ తెలిపారు. 24గంటలూ ఈ కంట్రోలు రూం పనిచేస్తుందన్నారు. ఆర్డీవో కార్యాలయాల్లో కూడా కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాల ఆదేశించారు.

- సోమశిలకు ఇన్‌ఫ్లో 11,581 క్యూసెక్కులు

అనంతసాగరం : సోమశిల జలాశయానికి శనివారం సాయంత్రం 11,581 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువకు 30 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. తుఫాను కారణంగా వచ్చే వరద మరింతగా పెరగవచ్చని, ఆదివారం నీటి విడుదల పెంచుతామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 70.034 టీఎంసీలు నిల్వ ఉండగా, ఉత్తర కాలువకు 400, కండలేరుకు 2,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. తుఫానుతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సాగరం తహసీల్దారు జయవర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. పశువుల కాపరులు, జాలర్లు పెన్నా నదిలోకి వెళ్లవద్దని కోరారు.

- కండలేరులో నీటి నిల్వ 57.84 టీఎంసీలు

రాపూరు : మండలంలోని కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 57.84 టీఎంసీలుగా ఉన్నదని ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 1900 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, 1080 క్యూసెక్కుల అవుట్ ఫ్లోగా ఉందని ఆయన తెలిపారు.

- సంగం బ్యారేజీకి పెరిగిన ప్రవాహం

సంగం : సంగం బ్యారేజీకి శనివారం నీటి ప్రవాహం తగ్గి మళ్లీ పెరిగింది. సోమశిల జలాశయం నుంచి నీటి ప్రవాహం 11 వేల క్యూసెక్కుల నుంచి 30,000లకు పెంచడంతో నీటి ప్రవాహం పెరిగింది. నీటితో సంగం బ్యారేజ్ వద్ద నీటిమట్టం 11 అడుగుల నుంచి 11.5 అడుగులకు పెరిగింది. బ్యారేజ్ 27 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

గంజాయి ముఠాపై కాల్పులు

- గాయపడిన నిందితుడు
- ప్రతిదాడిలో హెడ్ కానిస్టేబుల్‌కి గాయాలు
- పెంచలయ్య హత్య కేసులో 14 మంది గుర్తింపు
- డిసెంబరు 2న జిల్లా బంద్

కోవూరు/నెల్లూరురూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో సీపీఎం నాయకుడు పెంచలయ్యను గంజాయి బ్యాచ్ హతమార్చిన సంఘటన రాష్ట్రంలో సంచలనం రేపింది. నిందితులను పట్టుకునే క్రమంలో పోలీసులు కాల్పులు జరిపా రు. శనివారం వేకువజామున జరిగిన ఈ ఘటన తో జిల్లా వాసులు ఉలిక్కి పడ్డారు. గంజాయి ముఠాకు వ్యతిరేకంగా డిసెంబరు 2న జిల్లా బం ద్‌కు సీపీఎం పిలుపునిచ్చింది. కాగా గంజాయి బ్యాచ్ చేతిలో గాయపడ్డ హెచ్‌కానిస్టేబులు, పోలీ సు కాల్పుల్లో గాయపడ్డ నిందితుడు జీజీహెచ్‌లో పొందుతున్నారు.

- నిందితుల గుర్తింపు

నెల్లూరు రూరల్ మండలం కల్లూరుపల్లి వద్ద శుక్రవారం సీపీఎం నాయకుడు కొట్టావిట్టం పెంచలయ్య హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో 14 మందికి ప్రమేయం ఉన్నట్లు రూరల్ పోలీసులు గుర్తించారు. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. వారంతా కోవూరు మండలం పొలుచింత వద్దనున్న షుగర్ ఫ్యాక్టరీలో ఉన్నట్లు సాంకేతికత ఆధారంగా గుర్తించారు. శనివారం వేకువజామున రూరల్ సీఐ గుంజి వేణు, హెచ్‌కానిస్టేబుల్ ఆదినారాయణ అక్కడకు చేరుకున్నారు. వారిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో ముఠాలోని ప్రధాన నిందితుడు జేమ్స్ ఆదినారాయణపై కత్తితో దాడి చేశాడు. దీంతో ఆయనకు గాయాలయ్యాయి. వెంటనే సీఐ వేణు ఆత్మరక్షణ కోసం గాలిలో కాల్పులు జరిపారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో రెండోసారి కాల్పులు జరపగా, జేమ్స్ కాలికి గాయమైంది. గాయపడిన ఇద్దరిని నగరంలోని జీజీహెచ్‌కు తరలించారు.

- నిప్పో సెంటరు నుంచే రెక్కీ

సీపీఎం నేత పెంచలయ్యను హతమార్చేందుకు గంజాయి బ్యాచ్ శుక్రవారం నగరంలోని నిప్పో సెంటరు నుంచే రెక్కీ నిర్వహించినట్లు పోలీసుల విచారణ తేలింది. నిప్పో వద్దనున్న మైథిలి స్కూల్లో పెంచలయ్య కొడుకు



పెంచలయ్య భౌతికకాయంపై పార్టీ జెండా కప్పుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

నిఖిల్ చదువుతున్నాడు. కుమారుడిని స్కూటర్ పై ఎక్కించుకున్న పెంచలయ్యను గంజాయి ముఠా వెనుక వెంటాడింది. అనంతరం కల్లూరుపల్లి ఆర్చీ ప్రాంతంలో హత్య చేసినట్లు తెలిసింది. కాల్పుల్లో గాయపడ్డ జేమ్స్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతుండగా, అతని డిశ్చార్జి అదుపులోకి తీసుకునేందుకు రూరల్ పోలీసులు సిద్ధమయ్యారు. మిగిలిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

- 2న జిల్లా బంద్

పెంచలయ్య హత్యకు నిరసనగా డిసెంబరు 2న జిల్లా బంద్‌కు పిలుపునిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు తెలిపారు. పెంచలయ్య భౌతికకాయానికి నివాళి అర్పించేందుకు శనివారం నెల్లూరుకు వచ్చిన జీజీహెచ్ వద్ద జిల్లా నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కాగా ఆది, సోమ, మంగళవారాల్లో పార్టీ శాఖలన్నీ సంతాప దినాలు పాటించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. అనంతరం పెంచలయ్య భౌతికకాయంపై పార్టీ జెండా కప్పి కల్లూరుపల్లి వరకు అంతిమయాత్ర నిర్వహించారు.

- గంజాయి బ్యాచ్‌లకు వ్యతిరేకంగా పోరాడదాం

గంజాయి బ్యాచ్‌లకు వ్యతిరేకంగా పోరాడదామంటూ నెల్లూరురూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జీజీహెచ్ వద్ద పెంచలయ్య మృతదేహాన్ని పరిశీలించి నివాళి అర్పించారు. ఆయన కుటుంబానికి సంతాపం తెలిపారు. పెంచలయ్యను హతమార్చిన నిందితులను వదిలే ప్రసక్తే లేదని వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనను జనసేన, సీపీఐ నాయకులు ఖండించారు.

- పాతకక్షల వల్లే హత్య

వర్గపోరు కారణంగానే పెంచలయ్యను శుక్రవారం సాయంత్రం కిరాతకంగా నరికి చంపినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. చక్కెర కర్మాగారం ఆవరణలలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్పీ అజిత వేజండ్ల ఆదేశాల మేరకు పోలీసు దళాలు రంగంలోకి దిగాయన్నారు. 20 ఏళ్ల కిందట మూతపడిన ఫ్యాక్టరీ అడవిని తలపిస్తోంది. దీంతో నిందితులు ఫ్యాక్టరీ ఆవరణలోకి చేరుకున్నారు. నిందితుల సమాచారం అందిన పోలీసులు పకడ్బందీగా అక్కడికి చేరుకున్నారు. అర్ధరాత్రి సమయంలో డ్రోన్ల సహాయంతో నిందితుల్ని గుర్తించారు. కాగా పోలీసులు కాల్పులపై కేసున మోదు చేయనున్నట్లు ఎస్ఐ ముత్యాలరావు తెలిపారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

అల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ నేపథ్యంలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురవనున్న కారణంగా మం డల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహ సీల్దారు లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ బయట ప్రాంతాలతో పాటు వాగు లు, నదుల వద్దకు వెళ్లరాదన్నారు. మత్స్య కారు లు వేటకు వెళ్లవద్దని, తీరప్రాంతంలో అప్ర మత్తంగా ఉండాలన్నారు. అధికార యం త్రాంగం నిత్యం అందుబాటులో ఉంటంద న్నారు. వర్షాల వల్ల ఇబ్బందులు ఎదురైతే స్థానిక అధికారులను సంప్రదించాలన్నారు. మరో రెండు రోజుల పాటు సురక్షిత ప్రాం తాల్లోనే ఉండాలని కోరారు.

నేత్రదానం


పసుపులేటి శివకుమార్ (ఫైల్)

కావలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విక్రుతవారివీధికి చెందిన కావలి రెడ్‌క్రాస్ జీవిత సభ్యుడు పసుపులేటి శివ కుమార్ (56) శనివారం తెల్లవారుజామున తన స్వగృహంలో మృతి చెందాడు. ఆయన సమీప బంధువు పోలు వెంకటగిరిప్రసాద్, రెడ్‌క్రాస్ జిల్లా పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరిరెడ్డి ప్రేరణతో మృతుడి భార్య విజయ లక్ష్మి, కుమార్తెలు శ్వేత, శిల్ప అంగీకారంతో శివకుమార్ నేత్రాలను నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి దానం చేశారు. స్పెషలిస్ట్ సునీల్ నేత్రాలను సేకరించారు. కుటుంబ సభ్యులకు కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాష్ నేత్ర దాన ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఇది కావలి రెడ్‌క్రాస్, అభయం సంస్థల ఆధ్వర్యం లో 153వ నేత్రదానమని రెడ్‌క్రాస్ నేత్రదాన విభాగం కన్వీనర్ ఇలింద్ర శ్రీవాణి తెలిపారు.

విద్యుత్ అంతరాయం

బిట్రగుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయితీ బేతనీపేటలో శనివారం సాయంత్రం 11 కేవీ విద్యుత్ తీగ తెగిపోవ టంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏ ర్పడింది. విద్యుత్ ఏఈ జడరాయ్ సిబ్బందితో కలిసి వెళ్లి మరమ్మతులు చేపట్టారు.

పౌరహక్కుల దినోత్సవం


సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కొండాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంట పంచాయతీ ఆదిమూర్తిపురంలోని ఎస్సీ కాలనీలో ఎంపీ డీవో ఆదినారాయణరావు శనివారం పౌరహ క్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమంలో టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ జాగ ర్లమూడి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇళ్ల స్థ లాలు లేనివారికి మంజూరు చేయించే విధం గా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరా రు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీ వో శ్యామ్, వీఆర్వో మాలకొండయ్య, పంచాయతీ కార్యదర్శి రవీంద్ర, ఏపీవో మురళీధరరావు, మాజీ సర్పంచ్ మంచాల ఏడుకొండలు, స్థాని కులు వెంకటేశ్వర్లు, వేణు, పాల్గొన్నారు.

అధ్వానంగా పొలాలకు వెళ్లే రోడ్డు

● రైతుల అవస్థలు


గుంతలుపడి బురదమయమైన పొలాలకు వెళ్లే గ్రావెల్ రోడ్డు

లింగసముద్రం, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని అంగిరేకులపాడు గ్రామానికి చెందిన రైతులు పొలాలకు వెళ్లే గ్రావెల్ రోడ్డు గుంతలుపడి అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ రోడ్డుపై ఉన్న చిన్న చిన్న గుంతలు కాస్తా పెద్దవై దారుణంగా తయారైంది. దీంతో ఈ గ్రామానికి చెందిన రైతులు ఈ రోడ్డుపై మాగాణి భూములలోకి వెళ్లేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. ఈవర్షాలకు రోడ్డుపై ఉన్న గుంతలలో వర్షపు నీరు నిలబడి బురదమయమైంది. దీంతో రైతులు పొలాల్లో వ్యవసాయ పనులు చేసేందుకు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ రైతులు కోరుతున్నారు.

ఉదయం 6 గంటల నుంచే పింఛన్లు పంపిణీ చేయాలి

లింగముద్రం, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): వచ్చే నెల 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచే లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేయాలని ఎంపీడీఓ కె శ్రీని వాసులు సూచించారు. శనివారం మధ్యా హ్నం 12 గంటలకు లింగసముద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయన పింఛన్లు పంపిణీ చేసే సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1వ తేదీ 90 శాతానికి పైగా లబ్ధిదారులకు అంద జేయా లని, మిగిలిన పింఛన్లను 2వ తేదీ పంపిణీ చేయాలన్నారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో 5235 మంది లబ్ధిదారులు న్నారని, వీరికి ప్రభుత్వం రూ.2.50 కోట్లు విడుదల చేసిందని ఆయన తెలిపారు.

కుట్టు శిక్షణతో ఆర్థిక పురోగతి : డీఎస్పీ శ్రీధర్

కావలి (టౌన్) నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కుట్టు శిక్షణతో మహిళలు ఆర్థిక పురోగతి సాధించవచ్చని డీఎస్పీ శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం తుఫాన్ నగర్‌లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. పీ4 పథకంలో భా గంగా సంస్థ సభ్యులు శ్రీనివాసులు, సాయిచైతన్యల సహకారంతో లలిత జ్ఞాపకార్థం ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జీ సురేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ శ్రీధర్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదగాలని డీఎస్పీ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మా గార్మెంట్స్ అధినేత ఎం నరసింహా రావు, ఈఎన్‌టీ డాక్టర్ విజయభాస్కర్, స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాష తదితరులు పాల్గొన్నారు.


కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీధర్

రేషన్ షాపుల సంఖ్యను పెంచండి

కావలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరులో ఉన్న రెండు రేషన్ షాపుల సంఖ్యను నాలుగుకు పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చాంబర్‌నుంచి కావలి తహసీల్దార్ కార్యాలయానికి గ్రీవెన్స్ ద్వారా ఉత్తర్వులు అందాయి.ఇటీవల మంత్రి లోకేష్ దగదర్తి పర్యటనకు వచ్చినపుడు ముసునూరుకు చెందిన టీడీపీ నాయకుడు బొట్లగుంట శ్రీహరినాయుడు మంత్రిని కలిసి ముసునూరులో రేషన్ షాపుల సంఖ్యను రెండు నుంచి నాలుగుకు పెంచాలని వినతి పత్రం అందజేశారు. దీంతో మంత్రి స్పందించారు.

21 బీఎస్ఎన్ఎల్ టవర్ల మంజూరు

కొండాపురం, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): ఉదయగిరి నియోజకవర్గానికి 21 బీఎస్ఎన్ఎల్ టవర్లు మంజూరైనట్లు టెలి కాం బోర్డు అడ్వయిజరీ కమిటీ సభ్యురాలు తాటికొండ అనూష తెలిపారు. వింజమూ రులోని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ క్యాంపు కార్యాలయంలో జిల్లా టెలికాంబోర్డు అధి కారులు, తహసీల్దార్లతో సమావేశం నిర్వ హించారు. సెల్ టవర్ల నిర్మాణాలకు స్థలం కేటాయింపుతో పాటు, అన్నిరకాల అనుమ తులను సత్వరమే అందించాలని తహసీ ల్దార్లకు ఎమ్మెల్యే సురేష్ సూచించారు. 21 టవర్ల ఏర్పాటుకు కొండాపురం మండల పరిధిలోని వెలిగండ్ల, శెట్టిపాలెం, మర్రిగుంట గ్రామాలు ఎంపికయ్యాయని అనూష తెలిపారు. మరికొన్ని గ్రామాలలో టవర్లు ఏర్పాటు చేయాలంటూ అధికారులకు వినతపత్రం అందజేశామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ మేనేజర్ ఎం. శ్రీనివాస్, కావలి డీఈ సాయి కుమార్, భాస్కర్, రమేష్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల, తాటికొండ అనూష తతదితరులు

మండలస్థాయి ఉపాధ్యాయ క్రీడా జట్ల ఎంపిక


మహిళల త్రోబాల్ జట్టుతో ఎంఈవో - 2 ఆనందరావు తదితరులు


బౌలింగ్ చేస్తున్న ఎంఈవో గోవిందయ్య

కావలి (టౌన్) నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జెడ్పీ పాఠశాల క్రీడా మైదానంలో శనివారం మండల స్థాయి ఉపాధ్యాయ క్రీడా జట్ల ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. క్రికెట్, త్రోబాల్ క్రీడాంశాల్లో ఉపాధ్యాయులు, ఉపా ధ్యాయినులకు పోటీలు నిర్వహించారు. ఎంఈవో 1 గోవిందయ్య, ఎంఈవో -2 వెంకట సుబ్బయ్య పాల్గొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమం లో కో ఆర్డినేటర్ చిరంజీవి, జెడ్పీ ఉన్నత ప్రధానోపాధ్యాయుడు మాధవరావు తది తరులు పాల్గొన్నారు.

కొండాపురం: మండలస్థాయి ఉపాధ్యాయ క్రీ డా జట్లను శుక్రవారం స్థానిక జడ్పీ ఉన్నత పా ఠశాలలో ఎంపిక చేశారు. రాష్ట్రప్రభుత్వం ఉపా ధ్యాయినులకు త్రోబాల్, ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు ఆయా జట్ల ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా కొండాపురం క్లస్టర్ ఉపాధ్యాయుల జట్టు జిల్లా స్థాయి క్రికెట్ పోటీ లకు ఎంపికైంది. మహిళల త్రోబాల్ జట్టుకు ఉత్తమ ప్రతిభ కనబరచిన పలువురు మహిళా ఉపాధ్యాయినులను ఎంపిక చేశారు. ఈ కార్యక్ర మంలో ఎంఈవో-2 ఆనందరావు, కొండాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయుడు రాధాక్రిష్ణ, ఉపాధ్యాయు లు పాల్గొన్నారు.

బిట్రగుంట(దగదర్తి): దగదర్తి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల క్రికెట్ జ ట్టు ఎంపిక ఎంఈవో భాస్కర్ ఆధ్వర్యంలో శని వారం నిర్వహించారు. కార్యక్రమంలో మండ లంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశ్రామిక హబ్‌గా కందుకూరు : ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): కందుకూరు ప్రాంతానికి భారీ పరిశ్రమలు రాబోతున్నాయని, ఈ ప్రాం తం అతిపెద్ద పారిశ్రామిక హబ్‌గా మార బోతున్నదని కందుకూరు ఎమ్మెల్యే ఇం టూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ గాయత్రీ విద్యాపరిషత్ డిగ్రీ కళాశాల లో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారం భించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి ఇప్పటికే 40వేల మందికి పైగా వలసలు వెళ్తున్నారని, ఇకముందు ఆ అవసరం ఉండబోదన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం దూరదృష్టితో చంద్రబాబునాయుడు చేస్తున్న కృషి మరువలేనిదని, నేడు ప్రతి గ్రామంలో కనీసం యాభై నుంచి వందమంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఉన్నారంటే ఆ ఘనత చంద్రబాబు దేనని వివరించారు. 8సార్లు డీఎస్సీలు నిర్వహించి పెద్దఎత్తున ఉపాధ్యాయ నియామకాలు చేసింది తెలుగుదేశం ప్రభుత్వమేనని, ఈవిడత కూడా అధికారంలోకి రాగానే 16వేల టీచర్ పోస్టులు, 6వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందని గుర్తుచేశారు. త్వరలో తన స్వంత నిధు లతో కందుకూరు నియోజకవర్గ యువతీ యువకుల కోసం మెగా జాబ్‌మేళా ఏ ర్పాటుచేయించనున్నట్లు నాగేశ్వరరావు వెల్లడించారు. కార్యక్రమంలో శ్రీ గాయత్రీ కాలేజీ కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావు, డైరక్టర్ భరద్వాజ, ప్రిన్సిపాల్ గీతాశ్రీనివాసరావు, శ్రీవిద్య హైస్కూల్ కరస్పాండెంట్ రమణయ్య, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.


ఉద్యోగ నియామకపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సబ్ కలెక్టర్

ఉలవపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫా న్ రాబోవు రెండు రోజుల్లో తీవ్ర ప్రభావం చూపనున్నం దున మండలంలోని తీర ప్రాంతం, లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కం దుకూరు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ సూచించారు. శని వారం ఆయన మన్నేటికోట గ్రామం శంకర్‌నగర్ ఎస్టీ కాలనీవాసులకు తుఫాన్ హెచ్చరికలపై అప్రమత్తంగా ఉండాలని, అధికారులు అన్నివేళలా అందుబాటులో ఉంటారని, ఎలాంటి పరిస్థితులనైన ఎదుర్కొనేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు ముందస్తుగా రెవెన్యూ సిబ్బందిని, మండల అధికారులను సహాయక చర్యలకు నియమించినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితులు, సహాయ చర్యలు కోసం కంట్రోల్ రూమ్ 8712622676 నెంబరుకు కాల్ చేసి అత్యవసర సేవలు పొందవచ్చన్నారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ టీ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.


శంకర్‌నగర్ ఎస్టీ కాలనీవాసులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ హిమవంశీ, తహసీల్దార్ శ్రీనివాసులు

రాళ్లపాడు రోడ్డుపై గుంత

● వాహనదారుల అవస్థలు

లింగసముద్రం, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు పాత స్పిల్‌వే వంతెనను అనుసంధానం చేసే తారు రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వాహ నదారులు ఈ గుంతను గమనించకుండా వాహనాలను నడిపితే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధి కారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


రాళ్లపాడు ప్రాజెక్టు పాత స్పిల్‌వే వంతెన వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంత

మాలకొండను దర్శించుకున్న కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర

వలేటివారిపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామిని శనివారం ప్రకాశం జిల్లా కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉప అర్చకులు గౌరీశంకర్ ప్రత్యేక పూజలు చేశారు. అనం తరం శాలువా పూలమాలతో సత్కరించారు. ఆయన వెంట డీసీ చంద్రశేఖర్, సూపరిటెండెంట్ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

మాలకొండ ఆదాయం రూ. 7,74,586

మండలంలోని మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామికి శనివారం భక్తుల నుండి రూ. 7,74,586 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ. 6,650, కుంకుమార్చన ద్వారా రూ. 17,120, వివాహముల ద్వారా రూ. 1,000, తలనీలాలు ద్వారా రూ. 25,825, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 2,63,400, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 460, రూముఅద్దెలు ద్వారా రూ. 27,780, కవర్లు ద్వారా రూ. 8,225, లడ్డుప్రసాదం ద్వారా రూ. 2,10,710, అన్నదానం ద్వారా రూ. 2,10,396, ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ చంద్రశేఖర్ తెలిపారు.

ప్రసాద్ నాయుడు హత్య బాధాకరం

జలదంకి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత గొ ట్టిపాటి ప్రసాద్‌నాయుడు హ త్యకు గురవడం బాధాకరమని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే, టీ డీపీ నాయకుడు మేకపాటి చం ద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆ యన శనివారం జలదంకి మం డలం చింతలపాలెంలో ఆయన స్వగృహానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్ర సాద్ సోదరుడు వెంకటేశ్వర్లు నాయుడుతో మాట్లాడారు. అనం తరం మేకపాటి మీడియాతో మాట్లాడుతూ ప్రసాద్ మరణం గట్టుపల్లి పంచాయతీ ప్రజలకు, వ్యక్తిగతంగా తనకు తీరని లోటన్నారు. హంతకులను చట్టపరంగా శిక్షించాలని ఆయన కోరారు.


ప్రసాద్ నాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి

తాళ్ల వెంకయ్య కుటుంబానికి సీపీఎం రాష్ట్ర నేతల పరామర్శ

బుచ్చిరెడ్డిపాళెం, నవం బరు 29 (ఆంధ్ర జ్యోతి): సీపీఎం సీనియర్ నాయ కుడు, మాజీ పెనుబల్లి సర్పంచు తాళ్ళ వెంకయ్య కుటుంబ సభ్యులను రాష్ట్ర సీపీఎం నాయకుడు వి. శ్రీ నివాసరావు, ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్, సీపీఎం జిల్లా కా ర్యదర్శి మూలం రమేష్ శని వారం పెనుబల్లిలోని తాళ్ల వెంకయ్య నివాసంలో వారి కుటుంబ సభ్యులను పరా మర్శించి వెంకయ్య చిత్రపటానికి జోహార్లు అర్పించారు. గత కొంత కాలంగా తాళ్ళ వెంకయ్య అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందిన విష యం విదితమే. ఈమేరకు శనివారం సీపీఎం రాష్ట్ర నేతలు, జిల్లా కార్యదర్శి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించి వారి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి వెంట పలువురు సీపీఎం నాయ కులు, కార్యకర్తలున్నారు.


వెంకయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీపీఎం రాష్ట్రనేతలు

నిత్యావసర సరుకుల పంపిణీ

విడవలూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మోంథా తుఫాను కారణంగా స ర్వం కోల్పోయిన వరద బా ధితులను ప్రతిఒక్కరు చే యూతని ఇవ్వాలని స్థాని క ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపు మే రకు ఏఆర్డీ స్వచ్ఛంద సం స్థ బాధిత గిరిజనులకు నిత్యవసర సరుకులను అం దజేయటానికి ముం దుకు వచ్చిందని టీడీపీ యువ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఊటుకూరులో ఏఆర్డీ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో గిరిజనులకు శనివారం అయన నిత్యవసరసరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీసెల్ కోవూరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొమరగిరి దయాకర్, గిరిజన నాయకులు కొండా ర ఘు, పుల్లయ్య, వాసు, చౌటూరు శ్రీను,టీడీపీ నాయకులు తూళ్లూరు మాధవ్, ఏఆర్డీ సంస్థ నిర్వాహకులు రమేష్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పచ్చదనం-పరిశుభ్రత

తోటపల్లిగూడూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎన్‌డీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు మండల పరి షత్ ప్రాథమిక పాఠశాలలో ఎన్ఎస్ఎస్ పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా వివిధ రకాల చెట్లను నాటడం జరిగింది. నాటిన చెట్ల ప్రజలకు ఎంతో ప్రయోజనాత్మకంగా ఉంటాయని, విద్యార్థులు ప్రజలకు చెట్ల ప్రయోజనాలను వివరించారు.

నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రాలు

వలేటివారిపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుం డి, అమ్మపాలెం, పోలినేని చెరువు, లింగపాలెం, జమీన్ ఉప్పలపాడు, కొండసముద్రం, శాఖవరం తదితర గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. సంపద తయారీ కేంద్రాలకు చెత్త రాదు సంపద సృష్టించడం లేదు. గత ఎనిమిదేళ్ల క్రితం గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో సంపద సృష్టి కేంద్రాలను నిర్మించారు. అప్ప టి నుండి ఇప్పటి వరకూ ఆ కేంద్రాలు వృధాగా పడి ఉన్నాయి. ఒక్కొక్క కేంద్రానికి రూ. 8 లక్షల నుండి రూ 10 లక్షలు ఖర్చు పెట్టి నిర్మించారు. ఈ కేంద్రాల్లో వానపాముల పెంపకం చేపట్టి సేంద్రియ ఎరువులు తయారు చేయాల్సి ఉంది. కానీ అలా జరగడంలేదు. సిమెంట్ తొట్టెలో పిచ్చిమొక్కలు, గడ్డి మొలిచి బీడు భూముల్లాగా మారాయి. అంతేగాకుండా ఆ కేంద్రాలు ఆకతాయిలకు అడ్డాగా మారాయి. మండలంలోని 21 గ్రామ పంచాయతీలు ఉండగా 16 గ్రామ పంచాయతీల్లో చెత్తసంపద కేంద్రాలు ఉన్నాయి. గ్రామాల్లో ఇళ్లలోని చెత్తను గ్రీన్‌అంబాసీడర్లు చెత్తరిక్షాల్లో కేంద్రాలకు తరలించి, సంపద కేంద్రాల్లో తడి పొడి చెత్తను వేరుచేసి వానపాముల ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేయాలి. సేంద్రియ ఎరువులను రైతులకు తక్కువ ధరలకు విక్రయించి, వచ్చే ఆదాయంతో పంచాయతీలను అభివృద్ధి చేయాలి. ఈ కేంద్రాలకు చెత్తను తరలించేందుకు ప్రభుత్వం గ్రీన్‌అంబాసీడర్లకు రూ 6 వేలు చెల్లించి నియమించింది. సంపద కేంద్రాలకు చెత్త రాదు. సంపద సృష్టి లేదు. ఇప్పటికైనా అధి కారులు స్పందించి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకరావల్సిన అవసరం ఎంతైనా ఉంది.


చుండిలో నిరుపయోగంగా ఉన్న చెత్తసంపద కేంద్రం

శ్మశానంలో వసతుల కరువు

వలేటివారిపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పో కూరు బస్టాండు సెంటరులోని శ్మశానంలో వసతులు కరువ య్యాయి. దీంతో ఆదిఆంధ్ర కాలనీ వాసులు కనీస సౌకర్యాలు లేక అంత్యక్రియల సమయంలో ఇబ్బం దులు పడుతున్నారు. శ్మశానంలో ఏళ్ల తరబడి ముళ్లచెట్లు దట్టంగా పెరిగిపోయి అడవిని తలపిస్తోంది. శ్మశానంలోకి వర్షంనీరు చేరి నీటికుంటను తలపిస్తోంది. శ్మశానంలో నిల్వఉన్న వర్షంనీరు నిల్వ ఉండి దుర్వాశన వస్తుందని ఆ కాలనీ వాసులు వాపోతున్నారు. అయినప్పటికీ సంబంధిత పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శ్మశానంలోని ముళ్లచెట్లను తొలగించి, శ్మశానం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి శ్మశానంలో వసతులకు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


పోకూరు శ్మశానంలో పెరిగిన ముళ్లచెట్లు

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో ?

వలేటివారిపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పల పాడు - కొండసముద్రం మట్టి రోడ్డు అధ్వానంగా ఉంది. దీంతో ఆ మట్టిరోడ్డుపై వెళ్లే వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. చినుకు పడితే చాలు మట్టి రోడ్డుపై వెళ్లే వాహనదారులు బురదలో జారిపడుతున్నారు. మట్టి రోడ్డంతా మోకాటిలోతు గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతల్లో వర్షంనీరు చేరి ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి గాయాలపాలుతున్నారు. ఆ రోడ్డుపై వెళ్లే పాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టి రోడ్డును తారురోడ్డుగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


అధ్వానంగా ఉన్న ఉప్పలపాడు - కొండసముద్రం మట్టిరోడ్డు

వినోదం.. విజ్ఞానం.. వికాసం..!

క్షేత్ర పర్యటనల వల్ల విద్యార్థులకు వినోదం తోపాటు విజ్ఞానం, వికాసం కలుగుతాయని రామచంద్రాపురం పీఎంశ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వేదవతి తెలిపారు. శనివారం విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు చెముడుగుంట జిల్లా విజ్ఞానకేంద్రాన్ని సందర్శించారు. రాకెట్ల పనితీరు, విద్యుదుత్పత్తి ప్రాజెక్టులతో పాటు జైన్ దేవాలయం, దొడ్ల డైరీని సందర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గండికోట సుధీర్‌కుమార్, మున్వర్, బ్రహ్మారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు భవాని, శ్రీలేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)



జిల్లా సైన్సు కేంద్రంలో పీఎంశ్రీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

సంగంలో పెలికాన్ పక్షి

సంగం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పెన్నానది ఒడ్డున శనివారం పెలికాన్ పక్షిని గిరిజనులు గుర్తించి రక్షించారు. స్థానికుల ద్వారా ఆత్మకూరు అటవీ రేంజ్ అధికారి శేఖర్‌కు సమాచారం అందించారు. ఆయన ఆదేశాలతో డీఆర్‌వో నాయబ్ రసూల్ సంఘటన స్థలానికి వచ్చి పక్షిని పరిశీలించారు. సుమారు 4 కిలోల బరువుండే ఈ స్పాట్ బిల్డ్ పెలికాన్ వయసుపై బడటంతో ఎగరలేక ఉందని తెలిపారు. ఈ జాతి పక్షులు ఎక్కువగా సరస్సులు, నదీ తీరప్రాంతంలో నివసిస్తాయని తెలిపారు. సంతానోత్పత్తి కోసం తిరుపతి జిల్లా నేలపట్టు ప్రాంతానికి వస్తాయని, ఈ క్రమంలో నదీ తీర ప్రాంతం వైపు వచ్చి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. స్థానిక పశు వైద్యశాలలో వైద్యం చేయించి సురక్షిత ప్రాంతానికి తరలిస్తామని తెలిపారు. ఆ మేరకు సంగం పశువైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.





పెలికాన్ పక్షికి వైద్యం చేయిస్తున్న పశువైద్య సిబ్బంది

రెచ్చిపోతున్న గంజాయి స్మగ్లర్లు

- వరుస ఘటనలతో ఉలిక్కిపడుతున్న జిల్లా
- పోలీసులపైకి వాహనాలు ఎక్కిస్తూ..
- నాలుగు నెలల్లో రెండుసార్లు తుపాకీ పేలుళ్లు
- గంజాయి మత్తులో జంట హత్యలు



నెల్లూరు(క్రైం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి స్మగ్లర్లు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద గంజాయిను తరలిస్తున్న కారును నిలిపి డీఎస్పీ తనిఖీ చేస్తున్న సమయంలో... స్మగ్లర్లు కారు వేగం పెంచి దూసుకెళ్లారు.ఈ ఘటనలో డీఎస్పీతోపాటు పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. ఆ ఘటన మరువక ముందే నెల్లూరు ఎస్వీజీఎస్ కళాశాల మైదానం వద్ద జాతీయరహదారిపై గంజాయి స్మగ్లర్ కారును చుట్టుముట్టిన పోలీసులను ఢీకొని పరారయ్యేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటనలో ఈగల్ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. ఇక జిల్లాలో గంజాయి కేసుల్లో సస్పెక్ట్‌షీట్‌లో ఉన్న ఒకే కుటుంబానికి చెందిన వారు నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గత నాలుగు నెలల్లో గంజాయి స్మగ్లర్లపై రెండుసార్లు తుపాకీ పేలడంతో అందరినీ కలవరపరుస్తున్నది.

● కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టి...

చెన్నై వైపు ఓ కారులో గంజాయిని తీసుకువస్తున్నారన్న సమాచారం గతంలో ఎస్పీ జీ.కృష్ణకాంత్‌కు అందింది. దీంతో ఆయన బాలాజీనగర్ పోలీసులు, ఈగల్ సెల్‌ను అప్రమత్తం చేశారు. ఇన్‌స్పెక్టర్ కే.సాంబశివరావు తన సిబ్బంది, ఈగల్‌టీమ్ కానిస్టేబుల్ ఫిరోజ్‌తో కలిసి జాతీయరహదారిపై కాపు కాశారు. పెన్నాబ్రిడ్జికు ముందు కాపు కాసిన పోలీసులు కారును వెంబడించారు. కారు జాతీయరహదారి నుంచి ఎస్వీజీఎస్ కళాశాల వద్ద యూటర్న్ తీసుకొని అక్కడున్న ఇద్దరు వ్యక్తులకు గంజాయి ఇచ్చేందుకు నిందితుడు కారును స్లో చేశాడు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే కారును చుట్టుముట్టారు. గంజాయిని తీసుకునేందుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పరారయ్యారు. నిందితుడు తప్పించుకునే క్రమంలో పోలీసులను ఢీ కొడుతూ కారును వెనుకకు వేగంగా రివర్స్ తీసి ముందుకు దూసుకెళ్లాడు. కారు వెనుక ఉన్న ఈగల్‌టీమ్ కానిస్టేబుల్ ఫిరోజ్‌ను ఢీకొనడంతో ఆయన ఎగిరి జాతీయరహదారిపై పడ్డాడు. అదే సమయంలో ఓ లారీ వేగంగా కానిస్టేబుల్ పైకి వచ్చింది అయితే డ్రైవర్ అప్రమత్తమై షడన్ బ్రేకులు వేయడంతో కానిస్టేబుల్‌కు చిన్నపాటి గాయాలయ్యాయి.

● జంటహత్యలతో భయాందోళన

నగరంలోని సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన జంట హత్యలు నగర ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాయి. పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజ్‌లను పరిశీలించడంతోపాటు ఆ ప్రాంతంలో వారిని విచారించారు. మృతుల్లో ఒకరు సమీపంలోని పెన్నానదిలోకి వెళ్లే దారిలో గుడారంలో ఉంటున్న పోలయ్య, మరొకరు కడప జిల్లాకు చెందిన శివగా గుర్తించారు. ఈ హత్యలకు పాల్పడిన నిందితులు గంజాయి మత్తులో ఉన్నారన్న ఆరోపణలు వినిపించాయి. గంజాయిని అడ్డుకోవడంలో విఫలం కావడంతో ఆ స్టేషన్ సీఐని వీఆర్‌కు పంపారని సమాచారం.

● పెంచలయ్య హత్యలోనూ...

నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం జరిగిన పెంచలయ్య హత్య కేసులోనూ గంజాయి మరకలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. హత్యకు ప్రధాన సూత్రధారిగా కన్పిస్తున్న మహిళ, హత్య చేసిన నిందితులపై నెల్లూరు నవాబుపేట పోలీసు స్టేషన్‌లో గంజాయి కేసులకు సంబంధించి సస్పెక్ట్ షీట్లు ఉన్నాయి. పెంచలయ్య గంజాయి డాన్ కామాక్షితోపాటు వారి గ్యాంగ్‌ను అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించనని గట్టిగా వార్నింగ్ ఇచ్చాడు. దీంతో ఆయన్ను అందరూ కలిసి హత్య చేశారు.

● మరోసారి తుపాకీ పేలుళ్లు

ప్రశాంతంగా ఉండే జిల్లాలో నాలుగు నెలల వ్యవధిలో రెండుసార్లు పోలీసు తుపాకీ పేలడం జిల్లా ప్రజలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అందరిని కలవర పెడుతోంది. పెంచలయ్యను హత్య చేసిన నిందితులను పట్టుకునేందుకు వెళ్లిన పోలీసులపై కత్తితో దాడి చేసిన గంజాయి లేడీ డాన్ తమ్ముడు జేమ్స్‌ను పోలీసులు ఆత్మరక్షణ చర్యల్లో భాగంగా హెచ్చరిస్తూ ఓ సారి గాల్లోకి, మరో సారి జేమ్స్ కాళ్లపై తుపాకీతో కాల్పులు జరిపారు.

● రాజకీయ నేతల అండ

జిల్లాలోని గంజాయి ముఠాలకు రాజకీయ నాయకుల అండదండలు స్పష్టంగా ఉన్నట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో లేడీ గంజాయి డాన్ కామాక్షి నెల్లూరు రూరల్‌కు సంబంధించిన ఓ నాయకుడు ఇంటి ముందు నిత్యం భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేది. ఆ నాయకుడు సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్‌లు చేసి మన వారే చూసీచూడనట్లు ఉండమని చెప్పేవారని తెలుస్తోంది. అధికారం మారిన తర్వాత కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ మహిళ పార్టీ మారిన ఓ నాయకుడి అండ చూసుకొని గంజాయి వ్యాపారం సాగిస్తోంది.

ఉత్సాహంగా విభిన్న ప్రతిభావంతుల క్రీడలు



చదరంగం ఆడుతున్న విభిన్న ప్రతిభావంతులు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శనివారం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ, జిల్లా స్పోర్ట్సు అథారిటీ సహకారంతో జరిగిన విభిన్న ప్రతిభావంతుల క్రీడాపోటీలు ఉత్సాహంగా సాగాయి. షాట్‌పుట్, రన్నింగ్ రేస్, క్రికెట్, క్యారమ్స్, చెస్ తదితర పోటీలలో తమకెవరూ సాటిలేరంటూ ఆడి బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు మహ్మద్ ఆయూబ్ మాట్లాడుతూ దృష్టి లోపం కలిగిన విద్యార్థులు షాట్‌పుట్, రన్నింగ్ రేస్, క్రికెట్ పోటీలలో పాల్గొన్నారన్నారు. బధిరులు షాట్‌పుట్, రన్నింగ్ రేస్, క్రికెట్, చెస్, క్యారమ్స్ ఆటలలో పాల్గొన్నారని తెలిపారు.

ఐటీడీఏ పీవో సీఆర్‌డీఏకి బదిలీ



బదిలీపై వెళుతున్న ఐటీడీఏ పీవో మల్లికార్జునరెడ్డిని సన్మానించిన అధికారులు, సిబ్బంది

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నెల్లూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బీ.మల్లికార్జునరెడ్డి డిప్యుటేషన్‌పై సీఆర్‌డీఏకి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఐటీడీఏ కార్యాలయం అధికారులు, సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. అనంతరం మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర కలిగిన జిల్లాలో పనిచేసినందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ అధికారి రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లు.. న్యాయ సేవలకు వారధులు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్

నెల్లూరు(లీగల్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పారా లీగల్ వలంటీర్లు ప్రజలకు, న్యాయ సేవలకు మధ్య వారధులని జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ.శ్రీనివాస్ అన్నారు. శనివారం పారా లీగల్ వలంటీర్లకు ఒక్క రోజు శిక్షణ శిబిరం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్ భవన్‌లో జరిగింది. శిక్షణ పొందిన పారా లీగల్ వలంటీర్లు సామాన్య ప్రజలకు న్యాయ సహాయం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఉపన్యశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటి సెక్రటరీ కే.వాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులిమి అయ్యప్పరెడ్డి, పారా లీగల్ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

● మహిళ మృతి, ఏడుగురికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన లక్ష్మీ మృతదేహన్ని పరిశీలిస్తున్న ఎస్సై అంకమ్మ

ఉలవపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆటోను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఏడుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఉలవపాడు జాతీయ రహదారి రాజుపాలెం అడ్డరోడ్డుకు సమీపంలో శనివారం ఉదయం జరిగింది. ఎస్సై అంకమ్మ కథనం మేరకు వివరాలు.. కరేడు పంచాయతీ పరిధిలోని టెంకాయచెట్లపాలెంకు చెందిన మత్స్యకార మహిళలు మండలంలోని రాజుపాలెం గ్రామానికి ఆనుకొని ఉన్న జామాయిల్ తోపులో తుక్కు కట్టె పనులకు వెళ్తుంటారు. రోజూలాగానే శనివారం ఉదయం ఆటోలో బయలుదేరారు. ఈక్రమంలో సాయిబాబా మందిరానికి కూత వేటు దూరంలో కావలి వైపు వెళ్తున్న కావేరి ట్రావెల్స్‌కు చెందిన బస్సు ముందు వెళుతున్న ఆటోను ఢీకొంది. దీంతో ఆటో రోడ్డు పక్కన ఉన్న ఫెన్సింగ్‌ను ఢీకొంది. దీంతో వాయల లక్ష్మీ(32) ఆటోలో నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆటోలో ఉన్న మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఇద్దరిని కావలి ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా, మిగతా క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. మృతురాలి భర్త పిర్యాదు మేరకు ట్రావెల్ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

బైకుల చోరీపై కేసుల నమోదు

నెల్లూరు(క్రైం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వివిధ ప్రాంతాల్లో పార్క్ చేసిన బైక్‌లను గుర్తుతెలియని దుండగులు అపహరించుకు వెళ్లిన ఘటనలపై చిన్నబజారు పోలీసులు శనివారం కేసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రంగానాయకులపేట ఇసుకడొంక ప్రాంతానికి చెందిన అబ్దుల్ షరీఫ్ ఏసీ కూరగాయల మార్కెట్‌లో కూరగాయల వ్యాపారి వద్ద గుమస్తాగా పనిచేస్తున్నారు. ఈనెల 17వ తేదీన ఆయన తన బైక్‌ను మార్కెట్ ఎదురుగా పార్క్ చేసి ఉండగా గుర్తుతెలియని దుండగులు అపహరించుకు వెళ్లారు.

● హరనాథపురంకు చెందిన శ్రీనివాసులు ఈనెల 14వ తేదీన సాయంత్రం తన కుటుంబ సభ్యులతో కలిసి బైక్‌పై ఎస్2 థియేటర్‌లో సినిమా చూసేందుకు వెళ్లారు. బైక్‌ను థియేటర్ బయట పార్క్ చేసి సినిమా చూసి బయటకు వచ్చే సరికి బైక్ కన్పించలేదు. ఈ మేరకు బాధితుడు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● హరనాథపురంకు చెందిన శ్రీనివాసులు రామ్మూర్తినగర్‌లో కూల్‌డ్రింక్ షాపు నిర్వహిస్తున్నారు. ఈనెల 18వ తేదీన ఆయన కూరగాయాల మార్కెట్ వద్ద బైక్ పార్క్‌చేసి కూరగాయలు తీసుకొని బయటకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● సుందరయ్యనగర్ పుత్తాఎస్టేట్ ప్రాంతానికి చెందిన షేక్ అబ్దులా ఏసీ కూరగాయల మార్కెట్‌లో కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 14వ తేది తెల్లవారుజామున ఆయన తన బైక్‌ను మార్కెట్ బయట పార్క్ చేయగా గుర్తుతెలియని దుండగులు అపహరించుకు వెళ్లారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదులపై చిన్నబజారు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి డబ్బు ఇవ్వకుంటే చంపుతా..

● కత్తితో వదినను బెదిరించిన మరిది

నెల్లూరు(క్రైం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలని, లేకుంటే చంపుతానని కత్తితో వదినను బెదిరించిన మరిదిపై సంతపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని సంతపేట కామాక్షినగర్‌లో షేక్ షమీమ్, సతీష్ దంపతులు నివాసం ఉంటున్నారు. కపాడిపాలెం రాయపువీధిలో షమీమ్ మేనత్త ముంతాజ్ నివాసం ఉంటోంది. అప్పుడప్పుడు మేనత్త బాగోగులు చూసుకునేందుకు షమీమ్ కపాడిపాలెం వెళ్లేది. ఈ క్రమంలో ఈనెల 27వ తేది రాత్రి 7 గంటల సమయంలో ఆమె మేనత్తను చూసేందుకు వెళ్లగా అక్కడే ఉన్న మరిది షేక్ సత్తార్ అసభ్యకరంగా మాట్లాడడంతోపాటు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని కూరగాయల కత్తితో బెదిరించడంతో ఆమె భయపడి తన వద్ద ఉన్న రూ.1000 అతనికి ఇచ్చింది.

13న జడ్పీ సమావేశం

నెల్లూరు (జడ్పీ), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం డీసెంబరు 13న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో శ్రీధర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ, నీటిపారుదల శాఖ, వైద్య, ఆరోగ్యశాఖ, సాంఘిక సంక్షేమశాఖ, రోడ్లు, భవనాలశాఖలతోపాటు 2026-27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాలు,2025-26 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్ అంచనాలపై సమావేశంలో చర్చిస్తామని తెలిపారు.

నేడు గంధ మహోత్సవం

కావలి (టౌన్) నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నాగూరు మీరాస్వాముల గంధం మహోత్సవం ఆదివారం వైభవంగా జరగనుంది. ఉత్తరంపేట ట్రంకురోడ్డు వద్ద ఉన్న జెండా చెట్టు దర్గా గంధ మహోత్సవం ఆదివారం రాత్రి 7 గంటలకు ప్రారంభమై సోమవారం తెల్లవారుజాము వరకు జరుగుందని ఉత్సవ కమిటీ తెలిపింది.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల బాలుర విజేత నెల్లూరు

- బాలికల విజేత తూర్పు గోదావరి
- బహుమతులు పంపిణీ చేసిన సోమిరెడ్డి



నెల్లూరు జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు డీఎన్ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి రగ్బీ అండర్ -17 పోటీల్లో బాలుర విభాగంలో నెల్లూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో ప్రకాశం, నెల్లూరు జట్లు తలపడగా నెల్లూరు విజేతగా, ప్రకాశం జిల్లా జట్టు రన్నర్‌గా నిలిచాయి. అలాగే అండర్-17 బాలికల విభాగంలో తూర్పు గోదావరి జిల్లా జట్టు విజేతగా, రన్నర్‌గా గుంటూరు జిల్లా జట్టు నిలిచాయి. ఫైనల్ మ్యాచ్‌లో తూర్పుగోదావరి, గుంటూరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. చివరకు తూర్పుగోదావరి విజేతగా నిలిచింది. విజేతలకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బహుమతులు అందజేశారు. రగ్బీ టోర్నమెంటు ఆర్గనైజర్ పోతురాజు రమేష్ పర్యవేక్షణలో పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ సందర్భంగా ఆయన సోమిరెడ్డి విజేతలకు బహుమతులతో పాటు సొంతంగా నగదు బహుమతులు అందించి క్రీడాకారులను ప్రోత్సహించారు. మొదటిస్థానంలో నిలిచిన జట్టుకు రూ.12 వేలు, రెండో స్థానం రూ.8 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5 వేలు చొప్పున అందించారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు, రాష్ట్ర రగ్బీ పోటీల అబ్జర్వర్ నాగమల్లేశ్వరరావు, ఐపీ మహబూబ్‌బాషా, డిప్యూటీ డీఓ వెంకటేశ్వరనాయక్, సెక్రటరీ రమణయ్య, డాక్టర్ దేవిక, శ్రీనివాసులు, టీడీపీ నాయకులు పులిపాటి వెంకటరత్నం నాయుడు, కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి, దేవరం రఘురామిరెడ్డి, అమార్థాలూరు చెంచయ్య, గుర్రం మీరా మధు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

3న అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన యాత్ర



మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరావు

నెల్లూరు(వైద్యం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విజయవాడలో డిసెంబరు 3వ తేదీన అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన యాత్ర నిర్వహిస్తున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి తెలిపారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 11 ఏళ్లుగా అగ్రిగోల్డ్ బాధితులు దాదాపు 11 లక్షల కుటుంబాలు రోడ్డున పడుతుంటే పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో అగ్రిగోల్డ్ బాధితులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి పార్టీలకు చలనం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చెప్పారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయకపోతే కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసేందుకు నిర్వహిస్తున్న ఆవేదన యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అగ్రిగోల్డ్ బాధితుల పోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు రామరాజు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వేళకు రారు.. అడిగేవారు లేరు..!

- ఇక శనివారమొస్తే సెలవే..
- ఇదీ ఉదయగిరి ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల తీరు



తహసీల్దారు కార్యాలయ ఆవరణలో అధికారుల రాక కోసం వేచి ఉన్న ప్రజలు

ఉదయగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అసలే మెట్టప్రాంతం.. ఆపై జిల్లా కేంద్రానికి వంద కిలోమీటర్ల దూరం.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ అసలుండదు.. ఇంకేముంది ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగులు ఆడిందే ఆట.. పాడిందే పాట.. ఇదీ ఉదయగిరి ప్రభుత్వ కార్యాలయాల్లో వారి పనితీరు.. స్థానికంగా నివాసం ఉండి సకాలంలో విధులకు హాజరు కావాల్సి ఉన్నా ఏ కార్యాలయంలో ఆ పరిస్థితి కనిపించడంలేదు. చాలామంది ఉద్యోగులు సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించడంతో సమయపాలన పాటించడంలేదు. దీంతో కార్యాలయాలు తలుపులు తెరుచుకోకపోవడంతోపాటు వివిధ సమస్యలపై కార్యాలయాలకు వచ్చిన వారు వారి కోసం పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది.

శనివారమొస్తే సెలవే...

పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారి నుంచి సిబ్బంది వరకు శనివారమొస్తే సెలవు పెట్టడం ఆనవాయితీగా మారింది. కొంతమంది ఉద్యోగులు ఉన్నతాధికారుల తనిఖీలు ఏమైనా ఉంటాయోమోనని పేరుకు సెలవు చీటీ రాసి రిజిస్టర్‌లో పెడతారు. అనంతరం వచ్చి ఆ చీటీ చింపేసి ఎంచక్కా సంతకాలు పెట్టేస్తున్నారు. ప్రధానంగా తహసీల్దారు, ఎంపీడీవో, వెలుగు, ఉపాధి, సొసైటీ, ఎంఈవో, హామీ, ఐసీడీఎస్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ ఈఆర్‌పీ, హౌసింగ్, వ్యవసాయ శాఖల కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది ఎప్పుడు ఉంటారో ఎవరికీ తెలియని పరిస్థితి. సమయపాలన అసలూ పాటించడంలేదు. అవసరమై ఎవరైనా ఏదైనా కార్యాలయానికి వెళితే అక్కడుండే కిందిస్థాయి సిబ్బంది సార్ మీటింగ్ వెళ్లారని, కోర్టుకెళ్లారని షరామామూలుగా సమాధానం ఇస్తున్నారు. తహసీల్దారు కార్యాలయంలో కొంతమంది ఉద్యోగులు యథేచ్ఛగా విధులకు ఎగనామం పెట్టడంపై ప్రజలు బహిరంగంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం దారుణం. దీనికితోడు కొన్ని శాఖల అధికారులు వారానికి రెండు, మూడు రోజులు మాత్రమే విధులకు హాజరవుతున్నారు. మరికొన్ని శాఖల అధికారులు ఉన్నతాధికారులకు మామూళ్లు ముట్టజెప్పి యథేచ్ఛగా విధులకు రావడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమయపాలన పాటించని, విధులకు ఎగనామం పెట్టే ఉద్యోగులపై చర్యలు చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని పలువురు కోరుతున్నారు. .

హామీ ఇచ్చాం.. నిలబెట్టుకున్నాం : ఎమ్మెల్యే ఇంటూరి



ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును సత్కరిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కందుకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపటం ద్వారా వైసీపీ అధినేత జగన్ ఈప్రాంత ప్రజలకు తీరని ద్రోహం చేయగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపి ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలుపుతూ రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ఎన్నికల ప్రచార సమయంలో ఇంటింటికీ వెళ్లినప్పుడు కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపాలని అడిగారని, అందులో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి ప్రకాశం జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చామని గుర్తుచేశారు. ఎన్నికల య్యాక కూడా చంద్రబాబు సహా ముఖ్య నేతలు, మంత్రుల కమిటీకి అనేకసార్లు కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపాల్సిందేనని విన్నవించానని ఫలితంగానే ఈ నిర్ణయం జరిగిందన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల సంతోషం వ్యక్తంచేస్తూ డిసెంబరు 1న మధ్యాహ్నం నుంచి కందుకూరులో భారీ ర్యాలీ నిర్వహించబోతున్నట్లు ఇంటూరి తెలిపారు. ఈ ర్యాలీలో కూటమి పార్టీలతోపాటు అన్ని వర్గాలు, రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు భాగస్వామ్యం అవుతాయని ఆయన తెలిపారు. కాగా, కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయ అభివృద్ధి విషయంలో జరుగుతున్న ప్రచారాలన్నీ అవాస్తవాలనీ ఆలయ ఆచారాలకు, ఆచారవంతుల సాంప్రదాయాలకు ఎలాంటి భంగం కలిగించటం లేదని, ఆలయానికి ఆదాయం పెంచాలన్న ఆలోచనతోనే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నామని చెప్పారు. సమావేశంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, రాచగర్ల సుబ్బారావు, మాదాల లక్ష్మీనరసింహ్మం, పూరిమెట్ల గురునాథం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, చిలకపాటి మధుబాబు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, గోచిపాతల మోషే, బెజవాడ ప్రసాదు, షేక్ సలాం, రాయపాటి శ్రీనివాసరావు, రెబ్బవరపు మాల్యాద్రి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

● ప్రైవేటు పాఠశాలల బస్సుల తనిఖీ

కావలి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పాఠశాలల వాహనాలు నడిపితే ఆయా యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంవీఐ సుందర్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని ముసునూరులో శనివారం పలు ప్రైవేటు పాఠశాలల బస్సులను ఆయన తనిఖీ చేశారు. బస్సుల ఫిట్‌నెస్‌తోపాటు, అగ్నిప్రమాదాల నియంత్రణ పరికరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. విద్యార్థులకు ఎమర్జన్సీ డోర్ల వినియోగంపై అవగాహన కల్పిస్తూ ఉండాలన్నారు. అనంతరం బస్సుల రికార్డులతో పాటు డ్రైవింగ్ లైసెన్స్‌లు, అగ్నిప్రమాదాల నియంత్రణ పరికరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐ లక్ష్మీబాయ్, సిబ్బంది పాల్గొన్నారు.